

ఉప వేదాంగాలు
దర్శన, భాష్య, బ్రహ్మ సూత్రాలు
నీలకంఠ శారీరక బ్రహ్మ మీమాంస సూత్ర భాష్యము–చతుస్సూత్రి– 1



సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

"నేను" గా ఉండటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి, అంతేగాక విలువైన గ్రంధాలు సరైన సంరక్షణ లేక కనుమరుగైపోతున్నాయి, కనుక మన అందరి కోసం భారత ప్రభుత్వం పురాతన ఆధ్యాత్మిక గ్రంధాలను సంరక్షించే నిమిత్తం ఎంతో శ్రమతో కంప్యూటరీకరణ ద్వారా ఒక చోట చేర్చుతూ ఆన్ లైన్ చేయటం జరిగింది. ఇటువంటి విలువైన జ్ఞాన సంపదను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావటానికి సాయి రామ్ సేవక బృందం ఉడతా భక్తి గా ఇప్పటివరకి దాదాపు **5000** పుస్తకాలను వివిధ వర్గాలుగా విభజించి PDF(eBOOK) రూపంలో ఆన్ లైన్ లో ఉచితంగా అందించటం జరిగింది. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం అందించిన భారత ప్రభుత్వపు వెబ్ సైట్(డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా http://www.new.dli.ernet.in), ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in), మైక్రోసాఫ్ట్ వెబ్ సైట్(http://www.microsoft.com) కు మేము ఋణపడివున్నాము.అలాగే ఇటువంటి బృహత్తర కార్యక్రమానికి పెద్ద మొత్తం లో గ్రంధాలను అందించిన తిరుమల తిరుపతి దేవస్థానమునకు కూడా మనం ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in లేక http://www.dli.ernet.in
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సేవక బృందాన్ని సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com

సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement

సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంద వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము. మీరు చదువుకోవటంలో ఏమైనా ఇబ్బంది కలిగితే సేవక బృందంను సంప్రదించగలరు. ఒకవేళ మా సేవలో ఏమైన పొరపాటు వస్తే మన్నించగలరు.

ఈ గ్రంధపు భారత ప్రభుత్వ డిజిటల్ లైబ్రరీ గుర్తింపు సంఖ్య: 2020010008078

గమనిక: భక్తి,జ్ఞాన ప్రచారార్ధం **ఉచితంగా eBook** రూపంలో భారత ప్రభుత్వపు సహాయంతో ఇవ్వడం జరిగింది. ఈ గ్రంధముపై వ్యాపార,ముద్రణ హక్కులు రచయిత,పబ్లిషర్స్ కి గలవు, కనుక వారిని సంప్రదించగలరని మనవి చేసుకొంటున్నాము.

Sai**R**eal**A**ttitude**M**anagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయినాథ పాద సమర్పణమస్తు *

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని జళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీ సర్వమంగళా గ్రంథమాల - ద్వితీయ పుష్పము.

శ్రీ మేధా దక్షిణామూర్తయే నమః

శ్రీ శాంకరీయ

బ్రహ్మమీమాంసాసూత్రభాష్యము

[ఆంధ్రీకరణము]

చతుఃసూత్రి - ప్రథమ సంపుటము

అనువాదకులు :

[illegible]

బ్ర॥ శ్రీ॥ సర్వల రామనాథారాధ్యులవారి ద్వితీయ పుత్రులు,

సుప్రసిద్ధులగు శ్రీ సర్వల అంబయ్య సిద్ధాంతిగారి మనుమలు.

బ్ర॥ శ్రీ॥ కోడిమేల శ్రీగిరిసోమలింగారాధ్యులవారిచే శాంభవదీక్షితులు.

బ్ర॥ వే॥ సకలశాస్త్రపారీణ ఆత్రేయ లక్ష్మణశాస్త్రిగారి సచ్ఛాత్రులు నగు

సర్వల శంకరశాస్త్రిగారు

★

ప్రతులు 500] (1960) శార్వరి సం॥ [వెల రూ. 5.00

శ్రీ పార్వతీ రాజరాజేశ్వరాభ్యాం నమః

ముందుమాట

శ్రీ నీలకంఠ శివాచార్యులఁ గుఱించియు నత్కృత భాష్యము నుద్దేశించియు ప్రముఖుల యభిప్రాయములు వివిధములుగా నున్నందున "ఇదమిత్థ" మని వ్రాయుట కవకాశము కలుగుచున్నయది.

మద్విరచిత వైదికమత సామరస్యమున "శ్రీ నీలకంఠ భగవత్పాదులు గౌతమ గోత్రికు" లని శివాంకము ననుసరించి వ్రాసితిని.

భారద్వాజ గోత్రికులు ప్రాయశః కృష్ణానదీ ప్రాంతమునందు నివసించువారుగాను, గౌతమ గోత్రికు లధికముగా నైజాంరాష్ట్రమం దుండువారుగాను గానంబడుచున్నందున నైజామునందు చేరిన కాశీశ్వరము, శ్రీ నీలకంఠ శివాచార్యులవారి జన్మస్థాన మగుటవలనను శ్రీమదాచార్యులవారు గౌతమ గోత్రికులని విశ్వసించవలసి యున్నది.

ద్వాదశారాధ్యులలోని యాచార్యత్రయములో చేరిన శ్రీ నీలకంఠాచార్యులు గౌతమగోత్రికు లని నొక్కి వక్కాణించుటకు కాశీశ్వరస్థలమును, శివాంకగ్రంథము అను నిదర్శనములు ప్రబలము లగునవి.

గౌతమమహర్షి మహాశివభక్తుఁడని "ఉపమన్యు దధీచి గౌతమ" అను నానుడి తెలుపునది; ఇట్టి గొప్పవ్యక్తి మూలముగాగల వంశమునందు భాష్యకర్త కాదగిన శ్రీ నీలకంఠ శివాచార్యు లవతరించుట "గోపకుల సంజాతుఁడైన శ్రీకరుఁ డనఁబఱగు శివభక్తుని వంశములో మహావిష్ణువు శ్రీకృష్ణుఁడై యావిర్భవించుట" వలె పొసగుచున్నయది.

ఋషుల చరిత్రలను విమర్శించి వారికి కళంకము నాపాదింప నుద్దేశించు నెడల ప్రతి ఋషికి నిట్టి సువిమర్శయే సంబంధించును కావున, ఋషుల సామర్థ్యమును మాత్రము స్వీకరించి వారి చరిత్రములలో నుండు నసంగతము లను పాటింపరాదని మన పెద్దలు నిర్ణయించిరి.

ఇందువలన నీలకంఠాభిధానుఁడైన భాష్యకర్త నుమ్రాతము గౌతమ గోత్రికుఁడనియు తదితరులలో చెప్పఁబడిన 'నీలకంఠశబ్దవాచ్యులు' భారద్వాజ గోత్రికులు కావచ్చుననియు విశదమగునట.

నీలకంఠోదంతము

శ్రీ నీలకంఠాచార్య శివయోగీంద్రులు గౌరీశ్వరార్యు లనఁబడు మాహేశ్వరదంపతులకు శ్రీ కాశీశ్వరానుగ్రహమున సత్పుత్రులుగా జన్మిం

చిరి. "నీలకంఠుఁడు భాష్యకర్త కాఁగలఁడనియు శైవమతప్రచారముఁ గావించి జగద్గురుపదవి నలంకరించుననియు శంకరుఁడు విశ్వేశ్వరునకు వర మొసగెను.

స్వభాను సంవత్సర చైత్రశుద్ధ దశమిని శుభగ్రహవిశిష్ట పుష్యర్క్షము నందు సోమవారమున గౌరీదేవియం దుద్భవించిన నీలకంఠుఁడు శుక్లపక్ష చంద్రునివలె దినదినప్రవర్ధమానుఁడై విద్య నభ్యసించుచుండగా బోధాయన మహర్షి కాశేశ్వరమున కేతెంచెను.

బోధాయనుఁడు సుఖాసీనుఁడై నీలకంఠారాధ్య జన్మవృత్తాంతమును దిగువవిధముగా వక్కాణించెను.

విశ్వేశ్వరా! సావధానుఁడవై వినుము.

పూర్వము కైలాసమందు హిరణ్యమంటపమున దేవగణసమేతంబుగా పార్వతీ పరమేశ్వరులు రత్నఖచితేంద్ర నీలమణిమయ పీఠమం దధిష్ఠించి యుండుతఱి మహావిష్ణువు "మహేశ్వరా! ప్రపంచమున నానాటికి తగ్గుచున్న శివభక్తి నుద్ధరింప వ్యాససూత్రముల యథార్థమును గ్రహించు విద్వాంసు లఱుదైనవారు. గురుతెఱిఁగియు విశదీకరింపకున్నవారు గాన నొకానొక మహాపురుషుని యిక్కార్యమునకు నియోగించుఁ" డని ప్రార్థించెను.

అంత మహాదేవుఁడు "నారాయణా? సర్వంబు విదితమయ్యెను. విఘనుఁడు బాదరి యనఁబడువారు తమ మతప్రచారార్థము నావలన పరముఁ బొంది విస్తృతప్రచారమును గావించిరి. అట్టి వరముల యపసానసమయ మాసన్నమైనది. కావున మాయామోహితులగువారి యవివేకమును పోఁగొట్టి సన్మతము నుపపాదించుటకు త్వరలో నీలలోహితరుద్రు నాజ్ఞాపింతు" నని యాదేశించి తద్విధము నెరవేర్చినవారు.

ఇది యంతయు దివ్యదృష్టితో కనుగొంటిననియు నీలలోహితరుద్రుడే నీ కుమారుడుఁగా నవతరించెననియు బోధాయనుఁడు వాక్రుచ్చి తోడనే వారిని వారాణసికి గొంపోయి నీలకంఠుని శ్వేతాచార్య సన్నిధిఁ జేర్చెను.

శ్వేతాచార్యులు నీలకంఠున కుపనయన సంస్కారమును గావించి శాంభవదీక్ష నొసగియు సర్వదర్శనములం దసాధారణ పండితు నొనర్చిరి. మరియు అఘోరవిద్య నుపదేశించి "గృహస్థుడవై శివాద్వైతప్రచారము గావింపు" మని యాజ్ఞాపించిరి.

పిమ్మట గౌరీవిశ్వేశ్వరులు కాశేశ్వరమునకు నీలకంఠునితోఁగూడ

నేతెంచి హారితగోత్రోద్భవుండైన వీరభద్రారాధ్యుల కుమార్తెయగు సర్వమంగళతో వివాహమును గావించినవారైరి.

తత్సమయమునందే కుబేరాంశతో కాళేశ్వరవరసంజాతుండగు విక్రమాంక మహీపాలుఁడు శ్రీ నీలకంఠారాధ్యులవారి యసమానపాండిత్యవైభవము నాకర్ణించి వారికి కాంచనభూషణాంబరాది వస్తుసమర్పణ పురస్సరముగా విధేయుఁ డయ్యెను.

ఇట్టి యపూర్వ సామర్థ్యముగల నీలకంఠారాధ్యులవారి సన్నిధిని భాష్యాంతము పఠించిన శిష్యులలో దాక్షిణాత్యుడైన హరిదత్తుఁడు, ప్రతీచ్యుడైన సోమశేఖరుఁడు, ఉదీచ్యుఁడగు భవదేవుఁడు, ప్రాచ్యుఁడగు శ్రీమేశ్వరుఁడును ప్రఖ్యాతిఁబడసినవారు. మరియు వీరు నలుగురు స్వగురు విరచిత ప్రస్థానత్రయమును నలుదిశలందు ప్రచారముఁ గావించినవారు.

శ్రీ నీలకంఠారాధ్యులకు సర్వమంగళాదేవియందు సోమేశ్వరుఁడు, అఘోరనాథుఁడు, కాళేశ్వరుఁడు, శ్రీగిరీశ్వరుఁడు అనఁబడు పుత్రులు జన్మించినవారు.

అంత శ్రీవారు జైన బౌద్ధ చార్వాకాది మతములను ఖండించి స్వమత సిద్ధాంతమును బలపఱచుచు కాశీక్షేత్రమందు ప్రవేశించిరి. అట గొప్పపండితుల సభలందు పూర్వపక్షములను నిరాకరించి "శివుఁ డొకఁడే ఆరాధ్యదైవము. శివాద్వైతమే సమంజసం" బని ప్రతిపాదించుచుండగా శ్రీవారి ప్రవచనమే శ్రుతిసూత్రాది ప్రమాణప్రసిద్ధంబనునట్లు విశ్వేశ్వరాలయమందు కోడుముగలేని గంట ప్రణవనాదముఁ జేయుచుండెడిది.

అట్టితఱి కాశిపండితులు - భాష్యము లన్నిటిని దేవసన్నిధి నుంచవలెను. ఎద్దాని దేవి తన శిరమున దిడుకొనునో నయ్యది సర్వజనాంగీకృతంబగుగాక - యని సర్వభాష్యములను దేవిపాద సమీపమునందునిచి మఱునాఁడు ప్రాతఃకాలమున కాగానే దేవీమందిర ద్వారమును తెఱవగా శ్రీ నీలకంఠభాష్యమే దేవి శిరముపై నున్నట్లు గాంచి "సర్వప్రామాణిక జనసమ్మతంబగునది యిట్టిదయే" యని యంగీకరించినవారైరి.

ఇత్యాది సందర్భములచే శ్రీ నీలకంఠాచార్యులవా రద్వితీయ జగద్గురు పదవి నధిష్ఠించిరనియు తత్కృతభాష్యము సర్వథా సమాదరణీయంబనియు తేటపడుచున్నయది.

ఇఁక అనువాద విషయము.

ఇట్టి యనుపమ భాష్యము దురవగాహ మగుటఁజేసి శ్రీ శివయోగి, మహోపాధ్యాయ, ముదిగొండ నాగలింగశాస్త్రిగారు శివచింతామణిప్రభ యనఁబడు సంస్కృతవ్యాఖ్యానమును వ్రాసి శైవకోవిదులకు భాష్యార్థమును విశదపఱచినవారు. ఇట్టి శివచింతామణిప్రభయు శైవులందరికి తెలియకుండుట ననువాద మెంతేని యవసరమైనది.

నేనేమో అభిజ్ఞుడ నని భావించి సూత్రభాష్యము ననువదించుమని శ్రీ లోకారాధ్యులైన ఘట్టెపల్లి నాగమల్లయారాధ్యులవారు తదితర శైవ ప్రముఖులును ప్రేరేపించినందున నిట్టి యనువాదమునకు కడంగితిని.

ఇట్లుతఱి కొందరు నా యనువాదమును గూర్చి తమ యసహనము నాచ్ఛాదించి శుష్కప్రియములను వక్కాణింపఁజొచ్చిరి. ఇఁక కొందరు తమ తర్కవాగ్ధాటితో వ్యాకరణాది శృంఖలములతోడను నన్ను విపశునిఁ జేయఁ జూచిరి. మరికొందరు అనావశ్యక భాషా నిర్బంధముల న్యూనతను కనఁ బఱచుచు కళవళపడఁజేసినవారు.

"శ్రేయాంసి బహువిఘ్నాని" అను నార్యోక్తి నాయందు సఫలమయ్యెఁ గదా యని మది గుందుచు శివానుగ్రహము నభ్యర్థించి యీ విధము ముద్రణ కియ్యకొన్నవాడను. మరియు సహృదయు లెవరో వారినే యీ పొత్తముఁ జదివి యభినందింపఁ బ్రార్థించువాడను.

షడ్దర్శనపారీణులగు బ్రహ్మశ్రీ మదాత్రేయ లక్ష్మణశాస్త్రులఁగారిచెంత వోరుగల్లుపురసీమ శ్రీ పణికెల రామలింగేశ్వర సన్నిధిని శ్రీ శైవమహాపీఠాధిపతి పిరోళలింగశాస్త్రిగారి ప్రోత్సాహముతో శ్రీయుత రామిణి రాజమౌళి శ్రేష్ఠిగారి ఆశ్రయమున భాష్యాధ్యయనమును గావించితిని.

శైవులలో పరస్పర సహకారము లేనందున సంఘ ప్రముఖులు స్వవైభవాస్వాదలోలు రగుటవలనను మతాచార ప్రవర్తనాభిరుచి పదుగురి ఎదుట మాత్రము గానంబడుచున్నందునను "కలౌ శైవ మరోచకమ్" అను వచనము సార్థక మగుచున్నయది.

"సంఘే శక్తిః కలౌ యుగే" వ్యక్తిగత దోషములను పాటింపక గుణగ్రాహులమై ప్రతి యభ్యుదయ కార్యమునకు దోహద మొసగుచుందుమేని మన సంఘము పురోఽభివృద్ధిఁ గాంచగలదు. మన పూర్వికులు మాహేశ్వర శక్తితో సంఘశక్తి నినుమడింపఁ జేసినవారైరి. ప్రస్తుత సభలు, సమావేశములు, తీర్మానములు, సన్మానములు, సత్కార్యములు అను తెఱచాటున స్వార్థము తాండవించుచున్నది.

నారికేళ సమాకారా దృశ్యంతేఽపిహి సజ్జనాః
అన్యే బదరికాకారా బహిరేవ మనోహరాః.

ఇతర సంఘములు బదరీఫలముల వలె పై మెరుగుతో కనఁబడునవి. మన సంఘమైతేనో పదే పదే గౌరవము నపేక్షించుచు స్వాంతరమును కనుగొనఁజాలకున్నది. తథాపి శమదమాది సంపన్నులగు శైవ మహాజనులు సర్వమత సామరస్యమును స్వమతమునందు చూపెట్టుచు స్వాచరణతో మతాభివృద్ధిఁ జేయుచున్నవారు.

సర్వమతములవారికి సాధనచతుష్టయ మపేక్షణీయంబు గదా! భగవత్స్వరూపము, ఉపాసనా భేదము మొదలగు విశేషములలో సంప్రదాయములు నేర్పఱచునవి.

ఈ యాంధ్రీకరణమును యథామతి గావించినవాఁడను. వైదిక శాస్త్రాభినివేశము గల పండితుల సునిశిత విమర్శలకు, శ్రీ నీలకంఠీయ నాగలింగీయ వ్యాఖ్యాతిరిక్తములగు స్వకీయుల పరిశోధనలకును, విమతస్థుల ఖలోక్తులకును, స్వసర్వజ్ఞతాభినివేశముతో మహనీయుల వ్రాతలను తిరస్కరించు స్వతంత్ర వాక్యములకును, ప్రమాణబుద్ధి గలిగియు వ్యక్తిగత స్పర్ధతో చేయఁబడు ఆర్భాటమునకును, దూర ముండువాఁడనై శ్రీ రాజరాజేశ్వరుని ప్రీత్యర్థము, సంస్కృత వాఙ్మయమును మాతృభాషయం దనువదించుట నభినందించు ఆంధ్రసహృదయుల సమాధానమునకై, శివాద్వైత వేదాంతాంశములను తెలుగునందు తెలియగోరువారి యుత్సాహము ఫలించుటకును, శైవస్వరూపము తద్భక్తియు నవగాహన చేసుకొను యథార్థ బుద్ధిని నివసించుటకును, స్వపరిగృహీత శైవదీక్షా సార్థక్యమునకును గురుమహేశ్వర విధేయుఁడనై ఏవమేతదనువాదమును ప్రథమ భాగముగా వెలయించితిని.

ఇద్దాని ముద్రణకు తోడుపడిన వదాన్యులు—శైవులు, బ్రాహ్మణులు, వైశ్యులు తదితరులును సర్వదా నాచే యభినందింపఁబడువారు. తమ యమూల్యాశయముల నడుగుటతోడనే వ్రాసియిచ్చిన పండితప్రకాండులు సర్వథాభివాదనీయులు; ఎట్టి స్ఖాలిత్యములను పడనీయక సర్వాంగసుందరముగా నేతద్గ్రంథమును ముద్రించి యిచ్చిన శ్రీనివాససోదర మహోదయులెంతయు ప్రశంసనీయులు.

ఇట్టి సదుద్యమ మాచంద్రతారార్కము విలసిల్లి సుప్రయుక్తం బగునని యాశంసించుట సరసహృదయుల కనివార్యం బగుగదా యని విరమించుచున్నాను.

ఇట్లు
నిర్మల శంకరశాస్త్రి



శ్రీకంఠవిద్యాభూషణ, సంస్కృతసాహిత్యరత్న,
శైవవాఙ్మయార్ణవ బిరుదాంకితులు, వైదికమతసామరస్యాదిగ్రంథరచయితలు,
ఏతద్భాష్యానువాదకులు వగు
బ్రహ్మశ్రీ లోకారాధ్యులు
నిర్మల శంకరశాస్త్రిగారు
జన్మసమయము - పింగళ సం॥ శ్రావణ కృ॥ ద్వాదశి. నివాసము - నిర్మల, సికింద్రాబాదు.

శ్రీ పార్వతీ రాజరాజేశ్వరాభ్యాన్నమః

శ్రీ నీలకంఠ భగవత్పాదకృత

శారీరక బ్రహ్మమీమాంసా సూత్రభాష్యము

[ఆంధ్రీకరణము]

చతుస్సూత్రి

మంగళాచరణ శ్లోకములు :

ఓ న్నమోఽహంపదార్థాయ - లోకానాం సిద్ధిహేతవే
సచ్చిదానందరూపాయ - శివాయ పరమాత్మనే. 1

నిజశక్తి భిత్తి నిర్మిత నిఖిల జగజ్జాల చిత్ర నికురుంబః
స జయతి శివః పరాత్మా సకలాగమసారసర్వస్వమ్. 2

భవతు స భవతాం సిద్ధ్యై - పరమాత్మా సర్వమంగళోపేతః
చిదచిన్మయః ప్రపంచః - శేషోఽశేషోఽపి యస్యైషః. 3

శ్రీ పరమేశ్వరేచ్ఛావశమున లోకకల్యాణార్థ మావిర్భవించినట్టి ద్వాదశాచార్యులలో ప్రధానులగు శ్రీ నీలకంఠ శివాచార్యులవారు వేదములను వేదాంగముల నభ్యసించి, శ్వేతాచార్యులవారివలన బ్రహ్మోపదేశముఁ బడసియు, తా నుద్దేశించిన బ్రహ్మసూత్రభాష్యము నిర్విఘ్న పరిసమాప్తిఁ జెందుటకుగాను శిష్టాచారము ననుసరించి మంగళము నాచరించియున్నవారు.

"అహంపదముతో చెప్పఁబడువాడు, మాహేశ్వరుల యుపాసనను సిద్ధింపఁ జేయువాడు, సత్యము-జ్ఞానము-ఆనందమున్ను స్వరూపములుగా కలవాడు, పరమాత్మయు ప్రణవవాచ్యుఁడునగు శివునకు నమస్కారము."

ఆస్తికులందరికిని ప్రమాణమగు వేదరాశిఁదగు పూర్వభాగము ఇహలోక ఫలములను పరలోక ఫలములను నిరూపించునట్టిది. ఉత్తరభాగము పరమపురుషార్థమైన మోక్షము నుపదేశించునట్టిది ; ఉత్తరభాగ మనఁదగు

నుపనిషత్తుల సమన్వయరూపమైన యర్థమును తెలుపఁదలచినట్టి శ్రీ వేద వ్యాసభగవానుడు రచించిన బ్రహ్మసూత్రములకు బోధాయనమహర్షి వృత్తిని (సంస్కృతములో సంగ్రహార్థమును) వ్రాసియుండెను.

బోధాయనుని తరువాత ననేకులు తమతమ యిష్టార్థములను కల్పించుటచే సూత్రములు కలుషితములైనందున కలిగిన వేదవ్యాసుని యావేదన గుర్తెఱిఁగి పరమేశ్వరుఁడు శ్రీ నీలకంఠశివాచార్యరూపమైన అంశావతారమును పొందవలసివచ్చెను.

అవతిధాతువునకు మన్ ప్రత్యయము వచ్చి వకారము లోపించియు ఉపకారము ఆదేశము రాగా అవతి, అవమన్, అ. ఉ. మ్=ఓమ్ అని రూపనిష్పత్తి యగుచున్నది.

అహంపదార్థముతో - ప్రియతమమగు ఇష్టలింగమును; "ఓన్నమః" "శివాయ" అను పదముల యర్థముతో - శివషడక్షరీమంత్ర స్వరూపమగు ప్రాణలింగమును; పరమాత్మ పదార్థముతో - సర్వాంతరమగు భావలింగ మును భావించవలెనని నిరూపించినట్టి శ్రీ నీలకంఠాచార్యులు పాశుపత వ్రతనిష్ఠులని తెలియుచున్నది.

జీవునియందుపయోగింపఁబడు అహం పదము జీవాంతరాత్మయగు పరమాత్మయందు పర్యవసానముఁ జెందుచున్నది. మఱియు అహం పదము శక్తి శివుల కూడికయగు పరబ్రహ్మను బోధించును. ఇట్టి అహం పదార్థ మగునట్టిదే అన్నమయమగు స్థూలశరీరమునుఁ జెందియుండు ఇష్టలింగ మనఁబఱగుచున్నయది. ఇష్టప్రాణభావలింగానుసంధానముఁ జేయువారికి నభిమతలోకములందలి సుఖములఁ గలుగఁజేయువాడు శివుఁడని "లోకా నాం సిద్ధిహేతవే" అను పదము తేటపఱచును.

లోకులనగా లింగాంగ సామరస్యము కలవారు. సిద్ధి యనగా ముక్తి; అద్దానిఁ బ్రసాదించువాడు శివుఁడనియు చెప్పవచ్చును.

సర్వోత్కృష్టమగు ఆనందము ననుభవించుట ముక్తి స్వరూప మనియు పరమేశ్వరుఁడు నట్టి యానందముకలవాడై సద్రూపమునందును

చిద్రూపమునందును వ్యాపించియుండుననియు "సచ్చిదానందరూపాయ" అను పదము విశదపఱచుచున్నది.

"ఓమ్" అను బ్రహ్మవాచి శబ్దమువలన జగత్కారణము బ్రహ్మ యని తెలియుచుండుటచే అణ్వాదికారణవాదంబును; "అహంపదార్థాయ" అనుటచే శివుఁడు శక్తి విశిష్టుఁడని విదితమగుటఁజేసి నిర్విశేషవాదంబును; "లోకానాం సిద్ధిహేతవే" అనుటవలన కర్మజ్ఞానముల సముచ్చయఫలము నిరూపితమగుచుండుటచే కేవలకర్మవాదంబును; "సచ్చిదానందరూపాయ" అను పదమువలన శూన్యవాదంబును ; "శివాయ" అను పదముతో పాంచ రాత్రాదివాదంబులును త్రోసివేయఁబడుచున్నవి.

సకల విద్యలందును నుత్కృష్టమగు శ్రుతిలో నుత్తమమగు రుద్రా ధ్యాయమున మధ్య విరాజమానంబగు పంచాక్షరియం దమరియుండు "శివ" శబ్దమునకు పాపపరిహారమునందు ఎంత శక్తి కలదో అన్ని పాపము లను చేయుటకు కలియుగమున శక్యముకాదు గావున నిట్టి మహోత్తమ మైన శివశబ్దము నీ శ్లోకమునఁ జేర్చుటచే భాష్యార్థశ్రోతలకు వివిధ ప్రతి బంధములను తొలగించు శివనామశ్రవణము (ఇట) విహితమగుచున్నయది.

"శివ ఏకో ధ్యేయః శివంకరః సర్వమన్య త్పరిత్యాజ్య" అను శ్రుతి ననుసరించి "శివేతర దేవతలను విడనాడి యిహపరశ్రేయోదాయకుడగు శివునొకనినే పూజింపవలెను, ప్రార్థింపవలెను, ధ్యానింపవలె" నను నంశము బోధపడును.

ఏతద్భాష్యగత ప్రథమాధ్యాయమందలి సర్వవేదాంతసమన్వయము "ఓమ్" అనుటచే శివునందే కలదనియు; ద్వితీయాధ్యాయములోని శ్రుతి విరోధపరిహారము "అహం పదార్థాయ" అనుటచే అహం పదముతో తెలుపఁబడు చిదచిత్తులందు వ్యాపించు పరమాత్మ సమస్త ప్రపంచరూపము గల శక్తితో కూడియుండువాడని తెలుపఁబడుచున్నదనియు; తృతీయా ధ్యాయగత సాధననిరూపణము "లోకానాం సిద్ధిహేతవే" అనుటఁజేసి— ముక్తిసాధనము శివానుసంధానమని— గావింపఁబడినదనియు; చతుర్థా

-ధ్యాయ ప్రతిపాదితమగు ముక్తిఫలము "సచ్చిదానందరూపాయ" అను పదముతో సచ్చిదానందప్రాప్తి యనియు సూచింపఁబడినవి.

పరమేశ్వరునకు నద్వితీయత్వము నంగీకరించునెడ ద్వైతశ్రుతివిరోధంబును సద్వితీయత్వముఁ గ్రహించునెడ నద్వైతశ్రుతివిరోధంబు నేర్పడును కావున శివాద్వైతసిద్ధాంతము సర్వశ్రుతిసమన్వయముతో సమంజసమగునని విబుధులు గ్రహింతురుగాత!

అణ్వాదికారణవాదము :

"సృష్టి ప్రారంభమున రెండు అణువులుకూడి పెద్దవై క్రమముగా కూడుచు ననేకములై యీ ప్రపంచమును నిర్మించినవి" యని చెప్పునది.

నిర్విశేషవాదము :

ఇద్దానినే యద్వైతమందురు. "గుణములు స్వరూపము మొదలగు విశేషములు బొత్తిగా లేనట్టి బ్రహ్మము - గుణములు రూపముగల జగమునకు కారణమైనది. నిర్విశేషమగు బ్రహ్మమునందు జగము నారోపించి జగద్రూపముఁ జూచుట భ్రాంతి యగును. ఇట్టి భ్రమను వీడి 'అహం బ్రహ్మాస్మి' యని భావించుట ముక్తి" యని నిరూపించునది.

కర్మవాదము :

"జీవులాచరించు కర్మ యపూర్వముగా పరిణమించి స్వర్గనరకములందు సుఖదుఃఖముల ననుభవింపఁ జేయును. ఇట్టి కర్మఫలమునకు భగవదనుసంధాన మనవసర"మని యుద్దేశించునది.

శూన్యవాదము :

నిర్విశేషవాదముతో సరిదూగును. "బ్రహ్మము సచ్చిదానంద శివస్వరూపముగానిదై భూతాకాశమువలె శూన్యమైనట్టి" దని కంఠార్థములతో నార్భాటముఁ జేయునది.

పాంచరాత్రవాదము :

పాంచరాత్రము లనఁబడు ఆగమములకు ప్రాముఖ్యము నంగీకరించి "అంతస్తమో బహిః సత్త్వః" అని చెప్పఁబడు నారాయణుఁడు - సర్వోత్తముఁడు మోక్షప్రదుఁడనియు చెప్పువాదము.

2. నమస్కారరూపమైన మంగళము నాచరించి వస్తునిర్దేశాత్మక మంగళము నాచరించి యున్నవారు.

ఎల్లకాలము తన నాశ్రయించియుండు శక్తియనఁబడు గోడయందు సర్వవిధలోకముల సమూహాము అనెడు చిత్తరువుల చేరికను నిర్మించువాడును, వేదములు, వేదాంగములు మొదలగు శివాగమముల సారము లనఁదగు ఉపనిషత్తుల సర్వస్వమగువాడును (అనగా నవ్వానియందు బాగుగా నిరూపింపఁబడిన ముఖ్యాంశముఁ దగు సంపూర్ణ లక్షణము కలవాడును) జీవాత్మను నియమించువా డగుటఁజేసి పరమాత్మ యనఁదగు శివుఁడు - తా సృష్టించిన చేతనాచేతన ప్రపంచమునకంటె నతిశయముగా విరాజిల్లుచున్నవాడు.

శివుఁడు సర్వోత్కర్షతో నుండువాడని చెప్పుటకు వేదాంతములు ప్రమాణము లగుచున్నవి. శక్తియందు జగమును చిత్రించువా డగుటచే జగమునకు శక్తిగాక తానే కారణమగుచున్నవాడు. పరమాత్మ - అజ్ఞానములేనివా డగుట ననంతకల్యాణగుణములు గల పరిశుద్ధస్వరూపము గలవాడగుటను తత్త్వవేత్తలు శివుఁడని చెప్పుచున్నవారు. వేదాంతప్రతిపాదిత సంపత్తిగలవా డగుటచే వేదాంతసర్వస్వము శివునియందే తాత్పర్యము గలది యగుచున్నది. పరమేశ్వరుఁ డెల్లపుడు జీవభిన్నుఁడని "పరాత్మా" యను పదము తేటపఱచునది ; జగమునకు చిత్రసామ్యము వలన జగము మిథ్యయని భావింపరాదు. చిత్రమువలె నానావిధమైన జగము సత్యమైనట్టిది. గోడ చిత్తరువుఁ గూడుట నిత్యము కానట్లు - అపరాప్రకృతి వికారములైన పృథివీజలాగ్నివాయ్వాకాశా ద్యచేతనములందు పరాప్రకృతిసంబంధముగల చేతనులు (జీవులు) ప్రవేశించియుండుట మాత్ర

మనిత్య మగుచున్నయది. శశవిషాణమువంటి మిథ్యావస్తువులు ఆభాసించుట కును వీలులేదు. భిత్తికి సుధాలేపనతో చిత్రము అంతరించునట్లు జగము జ్ఞానదశయందు శూన్యమగునని కొందరు తలచెదరు. చిత్తరుగురంగులతో నేర్పడును గావున వర్ణరూపేణ సూక్ష్మస్థితిఁ బొందునట్లు జగము జ్ఞానికి సూక్ష్మచిదచిద్విశిష్ట బ్రహ్మముగా గోచరించునని భావము.

3. ఆశీర్వాదరూపమగు మంగళము నాచరించుచున్నవారు.

సర్వమంగళ యనఁబడు గౌరీదేవితో కల్యాణగుణము లన్నిటి తోడను కూడియుండువాఁడు; పగలు-రాత్రి, సత్తు-అసత్తు అనువాని వివేకము లేనట్టి మహాప్రళయ సమయములో తనకంటె రెండవ వస్తువు (ప్రపంచము నధిష్ఠించునది) లేనివాఁడు; నుత్తమ పురుషుఁడు నగు సదాశివుఁడు—భాష్యార్థ శ్రవణముఁ జేయు మీ యందరి మనోఽభీష్టము లను సిద్ధింపఁజేసి విజ్ఞానమును కలిగించుగాత!

చేతనులు, అచేతనములును నిండియుండు ప్రపంచమంతయు శేష మగువాఁడు శివుఁడని గ్రహించునది. శేష మనగా పరార్థమైనది. అశేషము శేష మగుచున్నదని చెప్పుటయం దాభాసించు విరోధము - ప్రాకృతదృష్టి గలవారికి ప్రపంచము అశేషముగా కనుపడినను అప్రాకృతదృష్టి గలవా రికి పరమేశ్వర విభూతి లేశముగా స్ఫురించునని నిరూపించుటవలన పరిహరింపఁబడును.

చేతనవర్గము-తమతమ యధికారము ననుసరించి కర్మజ్ఞానములతో శివు నారాధించుట కుపయోగించును. భూజలా ద్యచేతనవర్గము శివా రాధన కాశ్రయ మగుటకు నుపకరించును. కావున చరాచర మంతయు శివునకు శేషమగు ననుటలో సందేహములేదు.

సంసారులగు జీవులు పశువు లనఁబడుదురు. జగము పాశ మనఁ బడును. శివుఁడు పతి యనఁబడును. ఇతర ప్రభువులవలె గజాశ్వ సువర్ణాభర ణాది పరిమితసంపద కలవాఁడు గాక, పశుపాశసమ్మిశ్ర మగు ప్రపంచము నంతయు శాసించు గొప్ప ఐశ్వర్యము కలవాఁడని భావము.

పాశుపతవ్రత దీక్షాప్రదానపూర్వక సమస్త వేదాంతార్థ బోధకు డైన తమ ఆచార్యుని దిగువ శ్లోకముతో నమస్కరించుచున్నవారు.

నమః శ్వేతాభిధానాయ నానాగమ విధాయినే ;
కైవల్య కల్పతరవే కల్యాణగురవే నమః. 4

అనేక వేదాంతములకు తోచెడు విరోధమును పోనాడి సరసమైన ఏకార్థమును నిర్ధారించి యుపదేశించువారును, కైవల్యము (శివ సాయుజ్యము) నకు కల్పవృక్షమువంటివారును, భక్తి-జ్ఞాన-వైరాగ్యాది కల్యాణ గుణములు కలవారును, పాశుపతదీక్ష ననుగ్రహించినట్టి కల్యాణగురువులు నగు శ్వేతాచార్యులవారికి నమస్కారము.

వేదవాక్యములందువలె నీ శ్లోకమున, శైవసమయము ననుసరించి శివస్తుతికన్న గురుస్తుతి యధిక ఫలప్రద మగుచున్నందున ఆదరాతిశయముతో రెండుమారులు నమఃపదము ప్రయోగింపఁబడెను.

శ్వేతాచార్యులవారు - వేదాంతము లన్ని యెట్టి విరోధముఁగానక శివునియందే తాత్పర్యము కలవని శిష్యులకు నుపదేశింప నవతరించినవారు. మరియు కల్పవృక్షము కాముకుల కోర్కెలను ఫలింపఁజేయునట్లు కైవల్య మహాఫలము నపేక్షించు ముముక్షువులకు జన్మ రాహిత్యమును కలుగజేయువారు.

శ్రీ నీలకంఠాచార్యులకు విద్యాగురువులే గాక దీక్షాగురువులనియు "కల్యాణగురవే" అను పదము తెలుపును. తమ కల్యాణగురువగు శ్వేతాచార్యులవలన శాంభవదీక్షితులై ఇష్టప్రాణభావలింగానుసంధానముతో సంప్రదాయబద్ధమైన ముముక్షుత్వము నవలంబించినవారని తెలియనగును.

వ్యాససూత్ర మిదం నేత్రం విదుషాం బ్రహ్మదర్శనే
పూర్వైః కలుషితం నీలకంఠేనాద్య ప్రసాద్యతే. 5

అంగములతోకూడిన వేదములను వేదాంతములను చదివి యవ్వాని యర్థమును గ్రహించుటవలన బ్రహ్మస్వరూపము మనస్సునందు తోచు

చుండును. ఇట్టి జిజ్ఞాసువులకు "బ్రహ్మ యిట్టి" దని నిశ్చితబుద్ధి కలుగుటకై వ్యాసులవారిచే రచియింపఁబడిన ఈ సూత్రముల సముదాయము నేత్రము వంటిదనియు, ఇట్టి వ్యాససూత్రములను వ్యాఖ్యానించిన పూర్వాచార్యు లందరును సూత్రార్థమును కలుషితముఁ గావించినవారగుటఁ జేసి నీలకంఠ శివాచార్యుడ నగు నేను సూత్రకారుని యుద్దేశము ననుసరించి సమన్వయ ముతో వివరించుచున్నవాడను.

లోకములో వస్తువులను కనుగొనుటకు కన్నువలె బ్రహ్మ దర్శనము నకు శ్రీ వేదవ్యాసప్రణీతమైన సూత్రజాతము నిరపేక్షసాధనంబని నేత్ర మను పదము విశదపఱచును. మరియు కుత్సితవైద్యుల చికిత్సచే వికృతము లైన నేత్రములు సద్వైద్యులచే బాగుజేయఁబడునట్లు పూర్వాచార్య కలుషితములైన వ్యాససూత్రములను ప్రసన్నార్థ నిరూపణతో నుపాదేయ ములుగా నొనర్చినవారని గ్రహింపనగును.

కొందఱు అధ్యాసకల్పనతో కూడిన మాయావాదబలముతో జీవేశ్వరాభేదమును నిరూపించుటతోడను, మరికొందరు తర్కవితర్క బలముతో అనీశ్వరులందు ఈశ్వరత్వమును సాధించు దుష్టవ్యాఖ్యానములు తోడను వ్యాససూత్రములను కలుషితములఁ గావించిరని "పూర్వైః కలుషితం" అను పదము తెలుపును.

భాష్యకర్తలందరు శ్రీ నీలకంఠ భగవత్పాదులవారి తరువాతి వారైనను వారి యభిమతములను పూర్వపూర్వముగా తెలిపినవారందఱు నిచటి పూర్వపదముతో చెప్పబడుచున్నవారు.

ప్రమితత్వాధికరణమునందు చెప్పఁబడు ఈశానశబ్దము యోగము వలనను రూఢివలనను శంకరునే బోధించుననియు నారాయణాదులను బోధింపదనియు "శబ్దాదేవ ప్రమితః" అను సూత్రమున కీశానశబ్దాశ్రయ శ్రుతియే విషయవాక్య మగుననియు ఇది మున్నగు నుపనిషదము లన్ని టితో నారాయణపరత్వమును గాని జీవపరత్వమును గాని ప్రకృతిపరత్వ మును గాని సాధించుటకు వలనుపడదనియు "ప్రసాద్యతే" అను పదము తేటపఱచును.

బ్రహ్మసూత్రం పయో గాంగం మలత్రయవిశోధకం
పరైః పంకిలితం నీలకంఠారాధ్యేన శోధ్యతే. 6

మలము అనగా అజ్ఞానము;

ఆణవమనియు, మాయికమనియు, కార్మికమనియు, త్రివిధమగునది.

ఆణవము :

సృష్టిప్రారంభమున అణువుల కూడికవలన ఏర్పడునది.

మాయికము :

ఈశ్వరు నెడబాయనట్టి మాయాశక్తివలన సంభవించునది.

కార్మికము :

సంచిత ప్రారబ్ధరూపములగు కర్మలఁ జెందునది.

ఇట్టి మలత్రయమును పోనాడునట్టి గంగోదకమువలె పవిత్రమైనట్టియు బ్రహ్మసూత్రసముదాయము నితరాచార్యులు నపార్థకల్పనతో మలినముఁ గావించినవారగుటచే నీలకంఠారాధ్యుడను పూర్వోక్తసదర్థముతో నిర్మలముఁ జేయుచున్నవాడను. కర్మజ్ఞానసముచ్చితమగు సమరసభావముగల శివభక్తియోగము జీవేశ్వరజగత్ప్రతిపాదనద్వారా బ్రహ్మసూత్రములందు నిరూపింపఁబడినదగుటవలన శివయోగుల కీ సూత్రార్థము పరమాదరణీయమగుచున్నయది.

నీలకంఠో వివృణుతే శ్రీకంఠోపసమాహ్వయః
బోధాయనోక్తి మాలంబ్య బ్రహ్మసూత్రం యథాశ్రుతి. 7

శ్రీకంఠుడనఁబడు నీలకంఠశివాచార్యులు బ్రహ్మసూత్రములను శ్రుత్యనుకూలార్థముతో బోధాయనవృత్తి ననుసరించి వివరించుచున్నవారు. "శ్రీ భాష్యకారులు నీ బ్రహ్మసూత్రములను విష్ణుపరములుగా బోధాయనవృత్తి నవలంబించియే వ్యాఖ్యానించినవారని" చెప్పగూడదు. బోధాయనుఁడు శైవులలో నగ్రగణ్యుడగువాడు. మరియు భగవ

త్త్వము శివరూపమని నిర్ధారించి మహోన్యాస రుద్రయాగాది కల్పములు నేర్పఱచియు విష్ణుపరత్వము నుపేక్షించుటవలన బోధాయనవిరచితమగు సూత్రవృత్తి శ్రీ భాష్యకారుల కుపయోగింపదనియు శ్రీ నీలకంఠ శివాచార్యులు శ్రీ రామానుజాచార్యులకన్న మొదటివారగుటచే బోధాయనవృత్తి శ్రీవారికే లభ్యమైయుండుననియు ఇందువలన శ్రీ భాష్యకారులు శ్రీకంఠభాష్యగతమైన వృత్తిపద్ధతి నవశ్యముగా గ్రహించియుందురనియు శైవాచార్యుల యేకగ్రీవాభిప్రాయము.

ఇట్లు తా రచించిన భాష్యమునందు పరభాష్యములకంటె సుశ్కార్థము ను నిరూపించినవారై యితరగుణములఁ దెలుపుటకై దిగువశ్లోకము నుదాహరించినవారు.

శ్రీమతాం వ్యాససూత్రాణాం శ్రీకంఠీయః ప్రకాశతే
మధురో భాష్యసందర్భో మహార్థో నాతివిస్తరః. ౪

నిఖిలవేదార్థగర్భితములైన వ్యాససూత్రములకు శ్రీకంఠశివాచార్య ప్రోక్తమగు భాష్యసందర్భము మధుర(సరస)మై బ్రహ్మగుణములను బ్రహ్మ తత్త్వమును నిర్ణయించుటకు వలయు న్యాయసహస్రముతో నిండియుండునదగుటఁజేసి గొప్ప యర్థముకలదై యనవసరప్రసంగములు లేనిదగుటచే మిక్కిలి విస్తృతముకాని దగుచున్నది.

సకలవేదార్థమును బాగుగా గ్రహించిన వేదవ్యాసులు రచించిన బ్రహ్మసూత్రములకు బ్రహ్మ (వేద) శ్రీః సహజమని "శ్రీమతాం" అను పదము తెలుపుచున్నయది. రస మనగా పరమాత్మ; శ్రుతినిర్ధారితమై నిరతిశయానందరూపమగు పరబ్రహ్మను ప్రతిపాదించునది భాష్యమని "మధురః" అను పదము విశదపఱచును. "నాతివిస్తరః" అనుటచే పరభాష్యములందున్న శబ్దాడంబర మిందు లేదని తెలియుచున్నది.

ఇట్టి శ్రేష్ఠగుణములు గల భాష్యము సర్వగ్రాహ్యముకాదా యని శంకించి గ్రాహకుల యోగ్యత నీ క్రింది శ్లోకముతో నిరూపించి యున్నవారు.

సర్వవేదాంత సారస్య సౌరభాస్వాదమోదినాం
ఆర్యాణాం శివనిష్ఠానాం భాష్యమేతన్మహానిధిః. 9

వేదాంతములన్నియును పరమాత్మయందు తాత్పర్యము కలిగి యుండుట యను పరిమళము నాఘ్రాణించుటచే సంతృప్తిఁబడునట్టి శివనిష్ఠులైన పూజ్యులందరికి నీ భాష్యము మహానిధివంటిది.

శివనిష్ఠులనగా సర్వాంగలింగసాహిత్యముతో సదాశివు నుపాసించు నిష్ఠగల ఆర్యులు; "యదా తమ స్తన్నదివారాత్రి - ర్నసన్నచాసచ్ఛివ ఏవ కేవలః" ఇత్యాది శృతివాక్యములకు రామానుజీయులు పాంచరాత్రాగమముల ననుసరించి విష్ణుపరత్వము నన్వయింపఁజాలరైరి. "ద్వాసుపర్ణా" మొదలగు వేదవచస్సులకు జీవబ్రహ్మైక్యము ప్రతిపాదింప శక్యముగానట్టిది; కాని సర్వశ్రుతిప్రమాణవాదులగు శైవులకు సర్వశ్రుతిసమన్వయముగల యీ భాష్యము పరమాదరణీయమగుచున్నది.

పూర్వసుకృతపరిపాకము గలవారికి ద్రవ్యనిధి ప్రకాశించునట్లు నిరంతర శివధ్యానముఁజేయు మహానుభావుల కీ సూత్రభాష్యము సకల వేదాంతార్థనిర్ణయమును కలుగఁజేసి దర్శనమాత్రమున పరమానంద జనకమై సకలకల్యాణగుణసంపన్నమగు శివరూపము నవగతముఁ జేయునదై యున్నది. మరియు పాపాత్ములకు ఘోరసర్పాకారముతో గోచరించునదై దధీచిగౌతమాదిశాపదగ్ధులగువారికి రుచించనిదై యున్నయది.

జిజ్ఞాసాధికరణము

వేదము కర్మపరమనియు బ్రహ్మపరమనియు రెండు భాగములు కలిగియుండునది; ఇట్టి వేదములోని యుపనిషదముల యేకార్థమును నిర్ణయించుటకు వలయు న్యాయములను సూత్రములు వెలిబఱచునవి. ఇట్టి సూత్రముల సముదాయము మీమాంసా (విచార) శాస్త్ర మనఁబడుచున్నయది. వేదాంతములన్నిటిని వివరింప శక్యముకాదు గావున సూత్రములకు విషయములగు నుపనిషద్వాక్యములఁ జెందియుండు సంశయములు తొలగుటకై యీ మీమాంసాశాస్త్రము ఉపయోగించునట్టిది;

అన్యోన్యవిరుద్ధములగు నర్థములను పోనాడి సద్వివరణమును తెలుపు బ్రహ్మసూత్రములన్నియు ముముక్షువులకు నత్యంతావశ్యకము లగుచున్నవి. అన్యమతములం దభినివేశము గలవారికీ సూత్రవివరణ రుచించకుండును. తటస్థులగు బుద్ధిమంతులకు మాత్రము తప్పక నవగతము కాగలదు.

"శబ్దాదేవ ప్రమితః" అను సూత్రమునకు గల "ఈశానో భూత భవ్యస్య" అను విషయవాక్య మందలి యీశానశబ్దముఁబట్టి సూత్రగత మైన "శబ్దాదేవ" అనుదానికి "ఈశానశబ్దము వలననే" యని యర్థము సంగత మగునది; అభిధానశ్రుతి ననుసరించి ఈశానశబ్దము-అంగుష్ఠ పరిమాణము గల పురుషుడు శివపరమాత్మ యని-శివపరముగా నిర్ధారణఁ జేయఁబడుచున్నది.

"భూతభవ్యమైన జగమునకు ప్రభువు"అను నర్థముఁబట్టి నారాయణ పరత్వమును సాధింపరాదు. సూత్రములో ఏవకార ముండుటవలన "ఈశానశబ్దము వలననే" యని యేర్పడుటచే శివపరత్వము సుసాధ్య మగుచున్న యది.

"పరిణామాత్" అను సూత్రాధికరణమునందు వివర్తవాదమును నిరూపింప వీలుతేదు. ఇట పరిణామ శబ్దము కంఠరవేణ చెప్పఁబడినందున పరిణామవాదము సులభ మగునది; మరియు "కర్తా శాస్త్రార్థ వత్త్వాత్" అను సూత్రవివరణయందు జీవాత్మకు కర్తృత్వము లేదని చెప్పగూడదు. శాస్త్రార్థమంతయు జీవునియందే యుపయోగము కలదగుటచే జీవుఁడు కర్తయు, భోక్తయు నగుచున్నవాడు.

ఇట్లు భాష్యములు సూత్రకర్త్రాశయ విరుద్ధము లగుటచేత నుపనిషద్గత సందేహములను పోనాడుటకు సూత్రకర్త యాశయము ననుసరించి మీమాంస (విచారము) యావశ్యక మగుటఁ జేసి శ్రీ నీలకంఠ శివాచార్యులవారి కీ భాష్య మనివార్యముగా కర్తవ్య మైనది.

ఇట్టితఱి కొన్ని ప్రశ్న లుదయించును. ఎట్లనగా ?

౧. మీమాంసా శాస్త్రమునకు ఫలితము ఎద్ది ?

ఎట్టి ఆశ్రయము లేని ప్రేమఁదగు సుఖము ప్రాప్తించుట, అథవా ద్వేషమూలమైన దుఃఖము పొత్తిగా తొలగుట ఫలితముఁ దగు స్వరూపము.

౨. ఈ శాస్త్రమును చదువుటకు తత్ప్రకారము వర్తించుటకు నధికారి యెట్టివాడు ?

అర్థిత్వాదిగుణములు గలవాడు బ్రహ్మవిచార శాస్త్రపఠనాధికారి యగును.

౩. మీమాంసకు విషయ మెట్టిది ?

కొద్దిగా తెలిసి, పూర్తిగా తెలియనట్టిది సంశయముల చేరికఁ జెందియుండునదియు విషయ మనఁబడును.

౪. ఎద్దాని తరువాత నీ మీమాంసాశాస్త్రము నారంభించవలెను ?

ప్రారంభమునకు సమీపవర్తి యగు నిశ్చిత సాధనము సిద్ధించిన తరువాత నని చెప్పవలసియుండు.

ఇట్టి సందిగ్ధ ప్రశ్నలకు సమాధానముగా సర్వజ్ఞులలో శ్రేష్ఠుడైన వేదవ్యాస భగవానుఁడు మొదటిదగు బ్రహ్మజిజ్ఞాసాసూత్రము నవతరింపఁ జేసినవారు. ప్రయోజనము (ఫలితము), అధికారి, విషయము, సంబంధము అనఁబడు నాలుగు అనుబంధములును ప్రతిశాస్త్రమున కవసరము.

సంసారసుఖము లభించుటయు సంసారము తొలగుటయు నీ శాస్త్రమునకు ప్రయోజనము కాజాలవు.

స్వధర్మానుష్ఠానముతో నేర్పడు చిత్తశుద్ధి, వేదశాస్త్రవిజ్ఞానము, వేదశాస్త్రములచే నిషేధింపఁబడకుండుట, మోక్షాపేక్షయు నను నవి యధికారి గుణములు ;

౧. సూ. అథాతో బ్రహ్మజిజ్ఞాసా

అథ=ధర్మవిచారణ తరువాత, అతః=ధర్మవిచారముఁ జేసినందు వలన, బ్రహ్మణః=పరమాత్మయగు సదాశివుని, జిజ్ఞాసా=తెలుసుకొనఁ గోరుట యనగా నుపనిషదములందు విషయమగు బ్రహ్మము నవగాహనము చేసుకొనుటయని సూత్రార్థము.

విషయము, సంశయము, పూర్వపక్షము (ప్రశ్న), సిద్ధాంతము (ఉత్తరము), నిర్ణయము, సంగతి యనువాని కాధారమగునది యధికరణ మనఁబడును.

ఈ సూత్రములోని అథశబ్దమునకు ప్రారంభము మంగళము అను నర్థములు పొసగఁజాలవు. బ్రహ్మవిచారము ప్రారంభింపఁబడునది కాకుండుటను జిజ్ఞాసకు మంగళార్థమునకు నన్వయము కుదురకుండుటను "అనంతరము" అను నర్థమే పొసగునది.

ఇఁట సిద్ధాంతము నిర్ణయము అని నిర్ణయాంతము సిద్ధాంతమగునను నుద్దేశముతో వేరు చెప్పఁబడినవి. "మిక్కిలి పొందఁబడునది" యను వ్యుత్పత్తివలన నిర్ణయశబ్దమునకు ప్రయోజనమను నర్థంబు గ్రాహ్యమగును. సూత్రప్రారంభము నథ యను నుచ్చారణవలన మంగళము ధ్వనించుచున్న యది.

బ్రహ్మవిచారముఁ జేయువానిఁ జెందియుండునది, బ్రహ్మవిచార సాధనమైనదియు బ్రహ్మవిచారమునకు ముందు నియతము కావలెను. కూర్చుండుటకు ముందు భోజనము నడత అనువానిలో నెద్దియు నియతము కానట్లు బ్రహ్మవిచారమునకు ముందు ఏదే నొకటి యనియతమని చెప్ప గూడదు కావున అథ శబ్దమునకు నియతముగానుండుదాని పిమ్మటనని యర్థమును నిర్వచించవలెను.

పూర్వపక్షము :

బ్రహ్మవిచారమునకు ముందు వేదాధ్యయనము నియతము ;; ఎట్లనగా ?

ఎనిమిది వత్సరములు మొదలగు ప్రాయమున బ్రాహ్మణాదివర్ణస్థులకు విహితమైన ఉపనయనముఁ గావించిన తరువాత నాచార్యుని సేవించుచు వారి ముఖమునుండి వెలువడు నక్షరములఁ గ్రహించి యవ్వాని యర్థమును తెలిసికొనవలసియుండును. ధర్మమువలె బ్రహ్మము వేదమునందు ప్రతిపాదింపఁబడునదగుటచే వేదములఁ జదువనివానికి బ్రహ్మ విచారముఁ జేయవలనుపడదు గావున వేదాధ్యయనానంతరము బ్రహ్మ విచారము సమంజసమగుచున్నయది.

అధ్యయనము నిత్యమగుటచే నధ్యయనాంగమగు నుపనయనంబు నిత్యమగునది ; వేదముఁ జదువక నితర వాఙ్మయము నధిగమింప పరిశ్రమించు బ్రాహ్మణుఁ డీ జన్మయందే తన వంశముతో సహా శూద్రత్వమును బొందునని ప్రమాణములు నిరూపించుటచే వేదాధ్యయనము తదంగమైన యుపనయనంబు నిత్యములగుచున్నవి.

"స్వాధ్యాయోఽధ్యేతవ్యః" అను వాక్యములోని స్వశబ్దముఁబట్టి స్వశాఖకుఁ జెందిన వేదమును తప్పక చదువవలెను. శుశ్రూషాది నియమములతోడ నాచార్యునిచెంత గావించు వేదాధ్యయనము, ఆచార్యుని అధ్యాపనంబు వేదార్థపరిజ్ఞానమను నభ్యుదయమునకై యుపయోగించు నట్టివి.

ఇట్లు వేదాధ్యయనము తప్పనిసరియై బ్రహ్మవిచారమునకు ముందు నియతమగు చున్నది.

సిద్ధాంతము :

ఓయీ ! నీవు చెప్పినట్లు వేదాధ్యయనము బ్రహ్మవిచారమునకు పూర్వము నియతమగుగాత; వేదములఁ జదివి ధర్మము ననుష్ఠింపవలెగదా ; వేదాధ్యయనములేనిది ధర్మ (అనుష్ఠానము) విచారము సాధ్యము కానిదని మాకు నిష్టమేను ;

ఉపాధ్యాయులచెంత వేదముఁ జదివినపిమ్మట ధర్మవిచారముఁ జేయవలెనని "అథాతో ధర్మజిజ్ఞాసా" సూత్రమును శ్రీ జైమిని మహర్షి

ప్రతిపాదించినందున వేదాధ్యయనానంతరము ధర్మవిచారంబనియు ధర్మ విచారానంతరము బ్రహ్మవిచారంబనియు గ్రహించుము.

ఉపనయనాంగమైన వేదాధ్యయనమునకు వేదార్థమును గుర్తెరుగుట ఫలమైనను వేదార్థజ్ఞానానంతరము ధర్మవిచారమే ప్రాపించును. కావున నుపనీతుఁడు వేదవేదాంగముల నభ్యసించినపిమ్మట ధర్మాధర్మములు మహాఫలముగలవని పెద్దలవలన కనుగొని వేదవాక్యముల సమన్వితార్థమును తెలుసుకొనఁ బ్రవర్తించువాఁ డగును.

విరక్తులకు నవిరక్తులకును కర్మానుష్ఠాన మత్యంతావశ్యకమగుటచే వేదములఁ జదివి ధర్మము నాచరింపవలెనని విశదమగును. ఐతే సెద్దాని తరువాత నీ శాస్త్రము నారంభింపవలె ననుచెడ - ధర్మవిచారానంతరమని గ్రహించునది. ఎట్లనగా ? ధర్మవిచారశాస్త్రమునకు బ్రహ్మవిచారశాస్త్రమునకును మిక్కిలి భేదమును పాటించువారము కాము. రెండు నొకే శాస్త్రమని నిరూపించువారము.

"అథాతో ధర్మజిజ్ఞాసా" సూత్రమునుండి "అనావృత్తిః శబ్దాత్" సూత్రమువరకు గల శాస్త్రార్థమంతయు నొకటియై ఆరాధనగానుండు ధర్మమును ఆరాధ్యంబగు బ్రహ్మమును పూర్వోత్తరభాగములతో ప్రతిపాదించుచున్నయది. ఇట్టి ఏకశాస్త్ర మనఁదగు మీమాంసలో మొదటిభాగము ముగిసినపిమ్మట రెండవభాగము నను నర్థమును పురస్కరించుకొని "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" యని యుత్తర మీమాంసలో మొదటి సూత్రము చెప్పఁబడినది. వేదముఁ దగు పూర్వకాండ - ధర్మవిచారమనియు ఉత్తరకాండ - బ్రహ్మవిచారమనియు, పూర్వోత్తరకాండలకు రెంటికిని నియతసంబంధము కలదనియు పూర్వోత్తరభాగములలో నవాంతరభేద ముండుటచే "అత్యంత" అను పదము కించిద్భేదమును సూచించునదనియు గ్రహించవలెను. ధర్మప్రతిపాదకమగు వేదమంతయు బ్రహ్మమునందే పర్యవసానముఁ జెందునదగుటచే వేదమునందును వేదాంతములందును బ్రహ్మమే ప్రతిపాద్యంబగుచున్నయది.

ద్వాదశలక్షణియొక్క పూర్వోత్తర షట్కములకు ప్రయోజన భేదమున్న నేకశాస్త్రమగుట యంగీకరింపఁబడినట్లు నభ్యుదయ నిఃశ్రేయసము లనఁబడు భిన్నప్రయోజనములుగల పూర్వోత్తర మీమాంసలకు నేకశాస్త్రత్వ మనివార్యంబగుచున్నయది.

వామన జయాదిత్యులచే రచింపఁబడిన పాణినీయసూత్రముల పూర్వోత్తర వృత్తులకు మూలగ్రంథ మొకటి యగుటచే వ్యాఖ్యానముఁ గూడ నొకటియే వ్రాయబడినట్లు పూర్వోత్తరమీమాంసలకు జైమిని వ్యాస కర్తృకత్వభేదము ఏకశాస్త్రత్వభంగకరము కాజాలదు.

ఇంతియేగాక వేదార్థపరిజ్ఞానసంపన్నుఁడై యాచరింపఁబడు ధర్మము బ్రహ్మబోధ నాపాదింపఁజేయునదగుటచే ధర్మవిచారమున కుపయోగించునట్టి శ్రుతిలింగాదులును, ప్రేరణ, అర్థవాదము, స్మృతి, వేదప్రామాణ్య నిరూపణ మొదలగునవియు బ్రహ్మవిచారోపయుక్తము లగుటఁజేసి ధర్మ విచారానంతర మవశ్యము బ్రహ్మవిచారము కర్తవ్యముగా నేర్పడుచున్నయది. సాధనంబగు ధర్మవిచారములేనిది సాధ్యంబగు బ్రహ్మవిచారము సంభవించదు కదా.

"తమేతం వేదానువచనేన బ్రాహ్మణా వివిదిషంతి యజ్ఞేన దానేన తపసానాశకేన" "బ్రహ్మనిష్ఠగల మహానుభావులు - యజ్ఞము, దానము, ఉపవాసాది తపశ్చర్య అను వానితో కూడియుండు ధర్మము నాచరించవలెనని బోధించు వేదము నావర్తించుచు పరమాత్మ గుర్తెరుగుటకు బ్రహ్మము నుపాసింతురు" అను నర్థముగల పూజ్యమైన శ్రుతిప్రమాణము - ధర్మము బ్రహ్మబోధసాధనంబని - నిరూపించుచున్నది. "కర్మాచరణానంతరము బ్రహ్మజిజ్ఞాస" యని వృత్తికారులును చెప్పియున్నవారు.

ప్రశ్న : బ్రహ్మబోధకు కర్మాచరణ సాధనమగుచో నట్టి ధర్మమునే యాచరించవలెను. కాని వేదాంతవాక్యములఁ బరామర్శించి బ్రహ్మజ్ఞానము నభ్యసించుట యనవసరము కాదా?

ఉత్తరము : ఫలాపేక్ష లేనట్టి ధర్మాచరణము పాపములఁబోకార్చి చిత్తశుద్ధిని కలుగఁజేసియు బ్రహ్మజ్ఞానమునకు కారణమగుచున్నది గాన

వేదాంతవిచార మవసరమగుచున్నయది. మరియు "యస్యైతే చత్వారింశత్సంస్కారాః స బ్రహ్మణః సాయుజ్యం సాలోక్యం చ గచ్ఛతి" గర్భాధానము మొదలగు సంస్కారము లన్నియు పాపమాలిన్యమును పోగొట్టి శివసాయుజ్యమును సాలోక్యమును చిత్తశుద్ధిపూర్వక శివోపాసనద్వారా కలుగజేయునని గౌతమ స్మృతియు విశదపఱచునది.

ప్రశ్న : ఐహికములు ఆముష్మికములు నగు వరముల నొసగు పరమేశ్వరుని సమీపదర్శనమునకు తపశ్చర్య కారణమగునట్లు మోక్షమును ప్రసాదించు శివుని సన్నిధానదర్శనమునకు యజ్ఞాది శ్రుతులు హేతువు లగుచున్నవి గాన నిట్టితఱి వేదాంత విచారముతో ప్రయోజనము కనఁబడుటలేదు గదా ?

ఉత్తరము : యజ్ఞాదిశ్రుతియే చిత్తశుద్ధిగలవాఁడై వేదాంతములను విచారించవలె ననుటకు ప్రమాణమగుటఁజేసి వేదాంతవిచారము తప్పనిసరి యగుచున్నది. మోక్షమునకు ముఖ్యసాధనమగు శివ సాక్షాత్కారమున కాశ్రయమగు చిత్తము ద్రవ్యమనియు, మలాపకర్షణ మతిశయమనియు, మోక్షము కార్యమనియు విశదమగుచుండుటచే యజ్ఞాదికర్మములు చిత్తశుద్ధిజనకములై బ్రహ్మబోధకు కారణము లగుచున్నవి.

ప్రశ్న : కర్మ లన్నియు చిత్తశుద్ధిజనకములగుచో వ్రీహిప్రోక్షణ వలె సంస్కారకము లగును.

అట్టితఱి "కర్మలు పుణ్యలోకముల నొసగునవి" యని వేదమందు చెప్పఁబడు కర్మఫల ప్రదానమను స్వాతంత్ర్యము కొట్టుబడునుగాదా ?

ఉత్తరము : పుణ్యలోకముల నుద్దేశించి గావింపఁబడు కర్మలు స్వతంత్రములైనను ఫలాభిసంధిలేని కర్మలు చిత్తశుద్ధి యనెడు సంస్కారమును కలిగించునవిగా నుండును. మరియు నట్టి పురుషున కెద్ది జ్ఞానఫలమో అద్దియే కర్మఫల మగుచున్నయది. దర్శపూర్ణమాసి యనఁబడు క్రతువునకుఁ దగు స్వర్గప్రాప్తికి వ్రీహిప్రోక్షణ ముపయోగించునట్లు కర్మ లన్నియు జ్ఞానప్రయోజకములై మోక్షప్రాప్తికి సాధనము లగుచున్నవి.

కావున ఫలాభిసంధిరహితము లన్నియు గుణకర్మలై జ్ఞానాంగములగు నట్టివి.

ప్రశ్న : జ్యోతిష్టోమాది కర్మలు నిత్యవిధిప్రాప్తములై ఇతి కర్తవ్యత (తప్పనిసరిగా చేయుట)కుఁ దగినవిగదా ; ఇట్టి వన్నియు సంస్కారకములై గుణకర్మలగునెడ ఇతికర్తవ్యత కొట్టుబడును గాదా ?

ఉత్తరము : "సౌత్రామణి" "బృహస్పతి" యను క్రతువులు ప్రత్యేకఫలము నుద్దేశించి చేయఁబడునెడ స్వతంత్రములై "అగ్నిచయనము" "వాజపేయము" అను క్రతువులకు పూర్వోత్తరములుగా నాచరింపఁబడునెడ తదంగములగునట్లు జ్యోతిష్టోమాదికర్మలు నితికర్తవ్యతా ప్రాప్తములైనను జ్ఞానాంగములగుటలో విరోధమేమియు లేదు. కావున జ్ఞానసమగ్రత కలుగువరకు కర్మలాచరణీయంబులని గ్రహింపవలెను.

సౌత్రామణియాగమునకు - మాతాపితృఋణవిముక్తియు ; బృహస్పతిసవమునకు - బ్రహ్మవర్చస్సును ప్రత్యేకఫలములు.

అగ్నిచయనముఁజేసి సౌత్రామణి నాచరించవలెను. వాజపేయమును యజించి బృహస్పతిసవము నొనర్పవలెను.

ఇట్లు రెండువిధముల నిర్దేశమున్నందున నొకకర్మకే గుణత్వము ప్రాధాన్యంబు నొప్పారునని విశదమగుచున్నది.

ప్రశ్న : కర్మలు చిత్తము నాశ్రయించు మలమును పోగొట్టుట ద్వారా జ్ఞానసాధనములగుగదా ; వ్రీహ్యావహననము తుషవిమోకము వరకే గావింపఁబడునట్లు చిత్తశుద్ధిపర్యంతమే కర్మలు చేయఁదగినవి యని తోచుచున్నది.

ఉత్తరము : పొట్టు నూడిన ధాన్యమునకు మరల పొట్టుగూడనట్లు చిత్తశుద్ధి కలిగిన తరువాత జ్ఞానప్రతిబంధములు సంభవింపకుండునెడ చిత్తశుద్ధి పర్యంతమే కర్మలఁ జేయవచ్చును. శుద్ధచిత్తుడై జ్ఞానార్థము శ్రవణాదులఁ బ్రవర్తించువానికి జ్ఞానప్రతిబంధకదురితము లేర్పడునవిగావున జ్ఞానోదయమై సమగ్రత కలుగువరకు చిత్తశుద్ధిని కాపాడుకొనుటకై కర్మాచరణ మనివార్యం బగుచున్నయది.

ప్రశ్న : "వేదశాస్త్రవిచారము మొదలగువానితో పరమాత్మ గుర్తెరుగుదు" రను శ్రుతివాక్యమువలన కర్మలు జిజ్ఞాస కలుగువరకే యాచరణీయములని తెలియుచున్నదిగదా !

ఉత్తరము : జిజ్ఞాస - పురుషునకు సహజమై పురుషార్థము కాని దగుటచే కర్మలు బ్రహ్మజ్ఞానమును గలుగఁజేయు వేదాంతశాస్త్ర విచార మును ప్రారంభించుటకు సముచితములై యున్నవి. మరియు స్వర్గసుఖ ఫలప్రాప్తికై చేయఁబడు కర్మలకు స్వర్గప్రాప్తియే ఫలముగాని స్వర్గ కామన ఫలము కాజాలదు. "అశ్వేన జిగమిషతి" "అసినాజిఘాంసతి" ఇత్యాది వాక్యములందును గమనాదులే ఫలము లగుచున్నవి.

కర్మలు జ్ఞానమునకు సాక్షాదంగములు కానట్టివి. ఎట్లనగా ? పాప ములు నశించునెడ జ్ఞానము గలుగునని ధర్మశాస్త్రము చెప్పుచున్నందున కర్మలు చిత్తశుద్ధిద్వారా జ్ఞానాంగము లగునని గ్రహింపనగును.

ప్రశ్న : పూర్వజన్మయందలి సుకృతమున విశుద్ధచిత్తుఁడై వైరా గ్యము కలిగియుండు పురుషునకు మరల నీ జన్మయందు కర్మాచరణ యనవసరము గదా ?

ఉత్తరము : పూర్వజన్మ సుకృతము పూర్వజన్మయందే చిత్తశుద్ధిఁ గలుగజేసినను జీవితశేషము లేనందున మరుసటి జన్మయందు విరాగము కలవాడు కావచ్చును. కాని చిత్తశుద్ధ్యనంతరము జ్ఞానోదయ పర్యంతము కర్మలాచరణీయము లగుటచే కర్మలు జ్ఞానసమకాలమందును ప్రతిబంధ నివృత్తికై గావింపఁదగిన వగుచున్నవి.

ఒకానొకఁడు తన పూర్వసుకృత బలమున లభించిన భాగ్యమును కాపాడుకొనుటకు ప్రకృతజన్మయందు వ్యవహారముఁ జేయునట్లు చిత్త శుద్ధికి భంగము రాకుండుటకు స్వవర్ణాశ్రమోచిత నిత్య నైమిత్తికాది కర్మల నవశ్యము గావింపవలసి యుండును.

అట్లు గానిచో–"కీటముగాని, పక్షిగాని పరమేశ్వరానుగ్రహమున ముక్తు లగుదురు" "వామదేవుఁడు గర్భస్థుడై జ్ఞానము కలవాడాయెను"

ఇత్యాది ప్రమాణముల నాశ్రయించి నీ చెప్పురీతిగా-కర్మాచరణచే గాక బ్రహ్మవిచారంబు జ్ఞానసాధనము కానిదగును.

"ధర్మేణ పాప మపనుదతి" అను శ్రుతియు - ఫలాభిసంధి రహిత కర్మల నాచరించుటచే పాపములఁ బోనాడి జ్ఞానము కలవాడు కావలె-నని విశదపఱచునది గావున బ్రహ్మప్రాప్తికి సాధనమగు జ్ఞానమంతయు ఆశ్రమకర్మ నపేక్షించుననియు అట్టి బ్రహ్మవిచార (జ్ఞాన) శాస్త్రమునకు ధర్మవిచార (కర్మ) శాస్త్రము పూర్వనియత మగుననియు సారాంశము.

ప్రశ్న : ధర్మవిచారమునకు, బ్రహ్మవిచారమునకును క్రమనియమ మెట్లు పొసగును ? కర్త యొకడగుటచే పొసగునందు రేని - యిట కర్త్రైక్యము ఎట్టిది ?

ఆఘార దర్శపూర్ణమాసములవలె నంగాంగిభావము గలదా ? పంచప్రయాజములవలె ఏకాంగిప్రయుక్తములగు ననేకాంగములు గలిగి యుండునదా ? గోదోహనాదులవలె మరియొక ప్రయోజనము నుద్దేశించి చేయఁబడు విధానము గలదా ? షడ్యాగములవలె ఫలైక్యము గలదా ?

ఇవ్వానిలో నేదే నొక విధముగా కర్త్రైక్యమునకు శ్రుత్యాది ప్రమాణము గానరానందున ధర్మ బ్రహ్మవిచార శాస్త్రములకు క్రమ నియమము కూడని దగుచున్నది.

ఉత్తరము : శ్రుత్యాది ప్రమాణములు లేకుండునెడ నీవు జెప్పిన విధానముగా క్రమనియమము పొసగకుండును. "విద్యాం చావిద్యాం చ యస్తద్వేదోభయం సహ, తేనైతి బ్రహ్మవి త్పుణ్యకృచ్చ, సత్యేన లభ్య స్తపసా హ్యేష ఆత్మా సమ్యగ్జ్ఞానేన బ్రహ్మచర్యేణ నిత్యం."

"కర్మజ్ఞానముల రెంటి నేకకాలమం దభ్యసించు పుణ్యాత్ముఁడు కర్మజ్ఞానసముచ్చయముతోడ బ్రహ్మవేత్త యగుచున్నవాడు. సత్యము తపస్సు బ్రహ్మచర్యము సమ్యగుపాసన యనువానితో నిత్యుడైన పరమాత్మఁ బొందగలుగును" ఇత్యాది - జ్ఞానకర్మసముచ్చయవాదిశ్రుతులవలనను

కర్మజ్ఞానములకు మోక్షమే ఫలము గావునను ధర్మబ్రహ్మవిచారములకు క్రమనియమము విహితమగుచున్నయది.

ప్రశ్న : ధర్మ బ్రహ్మవిచారముల క్రమనియమమునకు వలెయు కర్తైక్యమునకు అంగాంగిభావము మొదలగు విధాన ముండవలెను. మరియు యాగము అపూర్వముద్వారా స్వర్గసాధనమైనట్లు ధర్మము చిత్తశుద్ధిద్వారా జ్ఞానజనకమగుటచే జన్మాంతర సుకృతశుద్ధచిత్తుడగు ముముక్షువునకు బ్రహ్మవిచారమునందే ప్రవృత్తి కలుగును కావున క్రమ నియమ మెట్లు పొసగును ?

ఉత్తరము : చిత్తశుద్ధికొరకై ధర్మవిచారము నెవఁడు జేయునో నవ్వానికే బ్రహ్మవిచార మనివార్యమగున దగుటఁజేసి కర్త్రైక్యము సంభవించునది. కర్మ సాధనముగాను జ్ఞానము సాధ్యముగా నంగాంగి భావము విహితమగుచున్నయది. కర్మజ్ఞానములవలె కర్మజ్ఞానవిచారంబులు నంగాంగిభావముఁ బొందునవి.

మరియు "విద్యాంచావిద్యాంచ" అను మంత్రమునందు చూపఁ బడిన సహపదము బ్రహ్మోపాసనఁజేయు జీవితమునందే కర్మ ననుష్ఠించ వలెనని తెలుపునది.

"అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృత మశ్నుతే" "శివోపాసన ప్రతిబంధములు మరియు ప్రమాదమున నేర్పడు దురితము లును దూరమగుటకు కర్మల నాచరించుచు నుపాసనాత్మక జ్ఞానముతో మోక్షము నొందవలె"నని శ్రుతియు నుత్తరార్ధముతో కర్మజ్ఞాన సముచ్చ యముఁ దగు ప్రయోజనము నుపదేశించి యున్నది.

వేదాభ్యాసము వేదాక్షరములఁ గ్రహించుటవరకే పర్యవసానముఁ జెందునని చెప్పు పక్షమునను ధర్మ బ్రహ్మవిచారముల కవకాశము కలుగు చునే యున్నది. ఎట్లనగా ? వేదముల నంగములతో కూడఁ జదువుటచే కలుగు పదార్థ స్ఫురణవలన బ్రహ్మయొక్క స్థూలోపాసనములగు జ్యోతిష్టోమాదియాగములను విధించు వాక్యములకు, సూక్ష్మోపాసనమగు లింగాంగ సాహిత్యరూపమైన దహరవిద్య నుపదేశించు వాక్యములకు

నాభాసించు విరోధమును పోనాడుటకై - మోక్షపురుషార్థముఁ గోరు పుణ్యపురుషుఁడు ధర్మబ్రహ్మవిచారములందు స్వయముగా ప్రవర్తించును, కావున ధర్మబ్రహ్మవిచారము నిష్ప్రయోజనము కాజాలదు.

జ్యోతిష్టోమాది స్థూలోపాసనలు జ్ఞానద్వారా ముక్తిప్రదము లగుటచే బహిరంగము లనియు, దహరాది సూక్ష్మోపాసనలు సమీప సాధనములగుట నంతరంగములనియు గ్రహించునది.

కర్మకాండ వాక్యములు :

"చాతుర్మాస్యయాజికి నక్షయఫలము లభించును." "పుత్త్రుని సంపాదించి పుణ్యలోకమును పొందవలెను."

జ్ఞానకాండ వాక్యములు :

"కర్మసంపాదిత లోకము క్షీణించున దగుటచే సంతానముతో శాశ్వతప్రయోజనము సిద్ధించదు" "ఆత్మకును సంతతికిని ఎట్టి సంబంధము లేదు."

ఇవ్వానికి నాభాసించు విరోధమును పరిహరించుటకై ధర్మజ్ఞాన శాస్త్రములను విచారించుట యనివార్యమగుచున్నయది.

ప్రశ్న : వాస్తిష్టాది కల్పములందు విరోధములు తొలగింపఁబడి యుండుటచే నవ్వానితోడనే కర్మయందు నుపాసనయందును ప్రవృత్తి జనించు గావున విచార మనవసరము గాదా?

ఉత్తరము : వేదార్థమును సంగ్రహించు పౌరుషేయ గ్రంథములఁ జదువునపుడు నభ్యుదయమందు నిఃశ్రేయస (మోక్ష) మందు నపేక్ష కలుగునదగుటచేతను విచారములేనిది ధర్మబ్రహ్మనిర్ణయము గానందునను విచార మత్యవసరమగుచున్నయది. మరియు వేదార్థమును గుర్తెరుగుటకు వేదాంగములైన వ్యాకరణాదు లుపయోగించునవి కావున స్వాధ్యా యాధ్యయనము వేదార్థజ్ఞానమందు వినియోగము కలదగుచున్నయది. ఇట్లు సాంగవేదాధ్యయనమువలన కలుగు సామాన్యజ్ఞానముగలవాడు

నిర్ణీతమైన యర్థమునకై విచారముగలవాడగుటచేత వేదాధ్యయన విధి నీవు చెప్పినట్లు నతురగ్రహణోపయుక్తమైనను ధర్మబ్రహ్మవిచారములందు ప్రవృత్తిఁ గలుగజేయునదగుచున్నది.

ప్రశ్న : "శ్రోతవ్యో మంతవ్యో నిదిధ్యాసితవ్యః" అను వాక్యము - వేదాంతశ్రవణమును సాక్షాత్తు విధించుచున్నది గదా ?

ఉత్తరము : విధి లక్షణముగల యుపపత్తి కనఁబడుటలేదు. ఎట్లనగా? అపూర్వము, నియమము, పరిసంఖ్య యని విధి మూఁడు విధములు గలది ;

౧. కాలత్రయమందును మరియొక ప్రాప్తిలేనట్టిది యపూర్వ విధి ;

౨. ఒక పక్షమున భిన్నమైన నుపాయముతో ప్రాప్తిగలుగునది నియమ విధి ;

౩. ఒకే పర్యాయము అనేక ప్రాప్తు లేర్పడుచుండ నన్యాని తొలగించి ప్రస్తుతమును నిరూపించునది పరిసంఖ్యా విధి ;

వేదాంత శ్రవణము - స్వవిషయమువలన పరిజ్ఞానమును వైద్య శాస్త్రశ్రవణమువలె కలిగించునది గాన నిట్టి ప్రాప్తియు లేకుండినచో నపూర్వవిధి గోచరమయ్యెడిది.

వరిధాన్యపు పొట్టునూడదీయుటవలె ప్రత్యక్షఫల ప్రదర్శకమైన నుపాయాంతరము గలది వేదాంతశ్రవణమైనచో నియమవిధిఁ దగి యుండెడిది.

వేదాంతములను వినుట చదువుట మొదలగునవి సమానములుగా నేర్పడుచుండ "వేదాంతములు వినదగినవే గాని చదువఁదగినవి కా"వని యంగీకరించి పరిసంఖ్యావిధిఁ జెప్పవలసియుండును.

వేదాంతములఁ జదువనిది వేదాంతములను విచారించరాదు. "కర్మ కాండను నిషేధించి వేదాంతశ్రవణమును పరిసంఖ్యావిధి విధించున" దని భావింపకూడదు. కర్మకాండ నిషేధింపఁబడినచో ధర్మవిచారము కూడని దగును. కర్మాచరణలేనిది చిత్తశుద్ధి కలుగకుండుటచే జ్ఞానోదయము కాకుండును. గావున పరిసంఖ్యావిధియు సరిపడనిదగుచున్నది.

అందువలన - "పురుషార్థముఁ గోరువాడు స్వయముగా వేదాంత శ్రవణమందు ప్రవర్తించు" నని చెప్పఁబడినదియే సమంజసమని గ్రహింపవలెను.

సకలచేతనాచేతన ప్రపంచముగా పరిణమించు చిచ్ఛక్తితో కూడియుండు అద్వితీయవైభవము గలవాడును; నిఖిలవేదసారమగు సామరస్యమునకు నిధానమగు వాడును; భవశివశర్వపశుపతి పరమేశ్వర మహాదేవ రుద్ర శంభు ప్రభృతికములైన శ్రేష్ఠశబ్దములతో తెలుపఁబడు నుత్కృష్టమగు మహిమయొక్క విలాసము గలవాడును; స్వాధీనులైన జీవాత్మల యుపాసనల ననుసరించి ప్రసరించు ననుగ్రహముతో పురుషార్థములను సిద్ధింపఁజేయు వాడునగు పరబ్రహ్మను ప్రతిపాదించు నుపనిషచ్ఛాస్త్రము విచారింపఁ దగినదియేను.

పరమేశ్వరాజ్ఞారూపమైన ప్రేరణము లక్షణముగా గలదియు, పరమాత్మనారాధించుటకు భిన్నభిన్నసాధనముల స్వరూపమగునదియు, మంత్రములచేత నర్థవాదములచేతను చూపఁబడిన యోగ్యతావిలాసము గలదియు, శ్రుతి మున్నగు నంగములతో నిండియుండునదియు తన ప్రమాణతను సమర్థించెడి మన్వాదిస్మృతులు, మహాభారతాదీతిహాసములు, శైవాదిపురాణములు, హైరణ్యగర్భాద్యాగమములు, అభియుక్తసూక్తులు ననువాని సందర్భములతో చేయఁబడిన నుపబృంహణముగలదియు విధి (తప్పనిసరిగా చేయవలెననునది) నిషేధ (చేయకూడదని చెప్పునది) వికల్ప (రెంటిలో నేదేనొకదాని నంగీకరించునది) సముచ్చయ (ఇదియు నదియు గావింపవలెననునది) ఉత్సర్గ అపవాద బాధ అభ్యుచ్చయాది విశేషములు గలదియు, అర్థకామాది సకలపురుషార్థములకు సముద్రముఁ బోలినదియు, బ్రహ్మజ్ఞానమునకు సాధనమైనదియు, పరమపూజ్యంబునగు ధర్మమును విచారించినతరువాత యని "అథ" శబ్దార్థము ప్రతిపాదింపఁబడినది.

సూత్రగతబ్రహ్మశబ్దముతో చెప్పఁబడు శివుఁడు సకలచిదచిత్ప్రపంచాకారశక్తి విశిష్టుఁడగువాడు. బృంహతిధాతునిష్పన్నమైన బ్రహ్మము త్రివిధపరిచ్ఛేదములు లేనట్టిది. శివుఁడును దేశకాలాదిపరిచ్ఛేదరహితుడై

చేతనాచేతనసమ్మిశ్రమగు ప్రపంచమునకంటె విలక్షణుడు గావున బ్రహ్మం బని నిర్వచింపఁబడువాడు.

అద్వితీయంబైన వైభవము (బృహత్త్వము) గలది బ్రహ్మశబ్ద వాచ్యంబగుటవలె శివశబ్ద వాచ్యం బగుచున్నయది. సమానజాతీయమగు రెండవవస్తువు లేకుండుట వస్తుపరిచ్ఛేద రాహిత్యమనఁబడును. ఆకులు పుష్పములు మొదలగు లోని భేదమున్నను "ఇట నొకచే చెట్టు" అనునెడ సమానజాతీయమైన అన్యవృక్షము లేదని తెలియునట్లు శివునకు శివుని విశేషణములగు చేతనాచేతనములకు నంతర్గత భేదమేగాని బాహ్యభేదము లేదు గావున శివుం డద్వితీయుండగుచున్నవాడు.

ప్రశ్న : ఓయీ ? శక్తివిశిష్టుడయిన శివున కద్వితీయత్వము ఎట్లు పొసగును ? వేదాంతములందు నిర్విశేషమగు బ్రహ్మమే పరమార్థముగా నిరూపింపఁబడినదిగదా ! "చిన్మాత్రమైన బ్రహ్మము సత్యమనియు, జ్ఞాత జ్ఞేయము జ్ఞానము మొదలగు భేదములన్నియు రజ్జువు (త్రాడు) నందు సర్పమువలె మిథ్యాభూతములనియు శ్రుతిసూత్రములు స్ఫురింపఁజేయు నవి. "అనృతేన హి ప్రత్యూఢాః" "మాయామాత్రంతు కార్త్స్న్యేనా నభివ్యక్తరూపత్వాత్" "జీవాత్మలు అవిద్యతో కప్పఁబడునవి" "బ్రహ్మము మాయాపరిచ్ఛిన్న మగుటచే సంపూర్ణముగా విశదము కాన ట్టిది" "అస్థూలమనణ్వహ్రస్వమ్" "కేవలో నిర్గుణశ్చ" ఇత్యాది ప్రమాణ ములు బ్రహ్మము నిర్విశేషమని ప్రతిపాదించుచున్నవి. "సదేవ సోమ్యేద మగ్ర ఆసీత్, ఏకమేవాద్వితీయం బ్రహ్మ" ఇత్యాది వాక్యములు - సజా తీయ విజాతీయ స్వగతభేదములేనిదై సన్మాత్ర మగునది బ్రహ్మంబని చెప్పుటచే నిర్విశేషమైన బ్రహ్మమునకే నద్వితీయత్వము సరిపడునది.

ఉత్తరము : "ఏకవిజ్ఞానేన సర్వవిజ్ఞానం" ఒకటి తెలిసినచో నంతయు తెలియునను ప్రతిజ్ఞతో సద్వాచ్యంబగు పరబ్రహ్మము జగమున కుపాదా నము నిమిత్తంబు నగునని తెలియుచున్నది. మరియు "సర్వంబు కను గొనుట, సర్వవిధశక్తులు కలిగియుండుట, సత్యసంకల్పము, అన్నిటిఁ జేరి యుండుట, సర్వాధారమగుట, సర్వంబు నియమించుట. నిఖిల ప్రపంచ

స్వరూపమగుటయు ఇత్యాది అనంత మాంగళ్యగుణములను బ్రహ్మమునకు చూపెట్టి "ఇట్టి బ్రహ్మస్వరూపము గలవాడవు నీ వగుదువు" "తత్త్వమసి" అని శ్వేతకేతువున కుపదేశింపఁ బ్రవర్తించిన సద్విద్య - నిర్విశేషత్వమును సమర్థించుటలేదు.

ఎట్లనగా ? ప్రారంభములో నుండు ఆదేశశబ్దము-నిరుపాధికమైన ప్రశాసనగుణమును; "బ్రహ్మఁ దెలియుటచే విననలవిగానిది విననగు"నని జగదుపాదానత్వ నిమిత్తత్వములను; అవ్వానికి సరిపడు సర్వజ్ఞత్వ సర్వశక్తిమత్త్వాదులను; ఉపసంహారమున "తత్త్వమసి"యని సమానాధికరణ భావముతో జీవాంతర్యామిత్వమును సద్విద్య ప్రదర్శించుచున్నయది. ఇట్టి యంశమునే పునఃపునః ఆవర్తించుటచే నభ్యాసంబు సిద్ధమగుచున్నది. ఇట్లు జగత్కారణత్వాది గుణములు అన్యప్రమాణముల యవసరము లేకయే ప్రతిపాద్యములగుచున్నందున నపూర్వత యేర్పడుచున్నది. "ఉపాసకునకు-స్వశరీర విమోచనమే తడవుగా మోక్షము సంభవించు"నని ఫలంబు చెప్పఁబడియెను. పితాపుత్రసంవాదమగుటచేత నర్థవాదంబు సముచిత మగుచున్నయది. మృత్పిండాది దృష్టాంతములవలన నుపపత్తియు చేకూరునది; ఇట్లు ఉపక్రమ ఉపసంహార అభ్యాస అపూర్వతా ఫల అర్థవాదము లనఁబడు షడ్విధ తాత్పర్య లింగములతో సద్విద్య - పరమేశ్వరునకు సవిశేషత్వమునే సమర్థించుచున్నయది.

"అట్టి బ్రహ్మము తేజస్సు సృజించెను" అని చెప్పఁబడినది కాని "బ్రహ్మము భ్రమించె" నని లేదు గావున, "ఆ బ్రహ్మము స్వయముగా తనను విస్తరింపఁజేసె" నని శ్రుత్యంతరములందు కలదుగాని "వికారముఁ జెందె" నని లేదు గావునను, బ్రహ్మసూత్రములలో "పరిణామాత్" అని నిర్వచింపఁబడినది కాని "వివర్తాత్" అని చెప్పఁబడలేదు గావునను బ్రహ్మము సవిశేషమై జగద్రూపముగా పరిణమించునదగుచున్నయది. మరియు మన బోంట్లకు గల ప్రాకృతములైన నింద్యగుణములను నిషేధించి "నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మం" ఇత్యాది వాక్యములతో నిత్యత్వ వ్యాపకత్వ

సర్వగతత్వ సూక్ష్మత్వ భూతయోనిత్వ సర్వజ్ఞత్వాది మాంగళ్యగుణములను సత్యజ్ఞానాది గుణవిశేషములను ప్రతిపాదించినందున బ్రహ్మము సవిశేషమే యగుచున్నది.

అద్వితీయపదము-జగదుపాదానమగు బ్రహ్మమునకంటె నితరుడైన యధిష్ఠాత లేడని బ్రహ్మమునకు విచిత్రసామర్థ్యముం బ్రతిపాదించునట ; "తదైక్షత బహుస్యాం ప్రజాయేయ" "తత్తేజో உసృజత" ఇత్యాది శ్రుతి వాక్యములు సవిశేషత్వమును సమర్థించుచున్నవి.

సృష్టిం జేయందలచిన బ్రహ్మము - సృష్టికి పూర్వము సదాత్మకము గానే యుండెనని ఉపాదానకారణముగా ప్రతిపాదింపబడినందున బ్రహ్మాభిన్న కారణములను "అద్వితీయ" పదము నిషేధించుచున్నయది. మరియు నుపనిషదములలో సర్వశాఖాప్రత్యయన్యాయము ననుసరించి బ్రహ్మము నందు సమన్వయింపదగిన సర్వజ్ఞత్వాది గుణముల నుపసంహారము నిర్విశేష పక్షమునకు విరుద్ధంబగుచున్నది.

జ్ఞాతయే జ్ఞానరూపుడగును. ప్రకాశాశ్రయములైన మణి సూర్య దీపాదులు ప్రకాశరూపము లగునట్లు జలనిధియైన సముద్రము జలరూప మైనట్లును జ్ఞానాశ్రయుడగు పరమాత్మ-జ్ఞానస్వరూపుడగుట సముచితమే యగుచున్నయది.

ప్రశ్న : సగుణ వాక్యములకు, నిర్గుణ వాక్యములకును విరోధ మేర్పడును కావున సగుణ వాక్యములు మిథ్యావిషయకములని యంగీక రింతురా ?

ఉత్తరము : "అపహతపాప్మా" మొదలుకొని "అపిపాసః" వరకు ప్రాకృత గుణములను నిషేధించి "సత్యకామః, సత్యసంకల్పః" అని కల్యాణగుణములను ప్రతిపాదించెడి శ్రుతియే నిర్గుణ, సగుణ వాక్యముల రెంటికిని సమంజసభావమును చూపెట్టుచున్నయది. మరియు "భీషాஉస్మా ద్వాతః పవతే" ఇత్యాది వాక్యములతో జగచ్ఛాసకత్వము మొదలగు బ్రహ్మగుణముల నారంభించి క్షేత్రజ్ఞుడైన జీవాత్మకంటె నెన్నియో

రెట్లు నతిశయమగు ఆనందమును నిరూపించియు "యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ, ఆనందం బ్రహ్మణో విద్వాన్" అని బ్రహ్మగుణము లనంతములని శ్రుతి యత్యాదరముతో వక్కాణించి యున్నది.

బ్రహ్మము-నిరవధికానందము కలదగుటచే ప్రాకృత సంస్కార ములతో నిండియుండు మనస్సు గాని, వికారముగల వాక్కుగాని బ్రహ్మానందమును కనుగొనజాలవనియు ధీరుడు చేయు నుపాసనవలన ముక్తదశయందు బ్రహ్మానందము లభించుననియు గ్రహించునది. మరియు నిట గుణములను క్రమముగా తగ్గించి సర్వశూన్యమైన పర్యవసాన స్థితిని చూపక గుణములను వరుసగా హెచ్చించి వాఙ్మనోనివృత్తిఁ జూపుటవలన బ్రహ్మయొక్క మాంగల్యగుణములు ననంతంబులని విశదమగుచున్న యది.

ప్రశ్న : ఓయీ! "యస్యామతం తస్య మతం, అవిజ్ఞాతం విజా నతాం" "ఎవనికి బ్రహ్మ యిష్టమగునో నవ్వాని కొకప్పుడు బ్రహ్మము రుచించకుండును. మరియు తెలుసుకొనువారికి తెలియునదికాదు" అను వాక్యము మొదలుకొని బ్రహ్మము జ్ఞానవిషయము కాదని చెప్పఁబడుటచే నిర్విశేషము కానగును కదా!

ఉత్తరము : "బ్రహ్మవిదాప్నోతి పరం" "బ్రహ్మవిద్బ్రహ్మైవ భవతి" "బ్రహ్మఁ గురుతెరగువాడు బ్రహ్మమును పొందగలుగును" "బ్రహ్మవేత్త బ్రహ్మతో సమాను డగును" ఇట్లు బ్రహ్మజ్ఞానమువలన మోతుము లభించునని యుపదేశము వినఁబడుటచే బ్రహ్మము – ఉపాసనాత్మక జ్ఞాన విషయ మగుట పొసగుచుండుటఁ జేసి సవిశేషము సగుణంబు నగుచున్న యది. మరియు నీ శ్రుతియందు "నదృష్టేర్ద్రిష్టారం నమతే ర్మంతారం" అని జ్ఞేయమును తెలుసుకొనునట్టి జీవాత్మను నిషేధించి ప్రాణు లన్నిటి నంతరాత్మ యగు పరమేశ్వరునే యుపాసించవలసినదని చెప్పినందున బ్రహ్మముఁ దగు జ్ఞాతృత్వము సిద్ధమగుచున్నయది. అట్లు కానియెడల-

విజ్ఞాతార మరే కేన విజానీయాత్-విజ్ఞాతయగు బ్రహ్మము నెట్లు తెలుసు కొనవలెను-ఇత్యాది శ్రుతివాక్యములు విరోధించును.

ప్రశ్న : "యత్ర హి ద్వైతమివ భవతి" "నేహనానాస్తి కించన" "మృత్యోః స మృత్యుమాప్నోతి య ఇహ నానేవ పశ్యతి" "యత్ర త్వస్య సర్వ మాత్మైవాభూ త్తత్కేన కం పశ్యేత్" ఇత్యాదివాక్యములందు భేదము బహువిధములుగా నిషేధింపఁబడుచున్నందున బ్రహ్మము నిర్విశేష మగుచున్నది గదా!

ఉత్తరము : జగమంతయు బ్రహ్మకార్యమై బ్రహ్మ యంతర్యా మిగా కలదగుటచే బ్రహ్మస్వరూప మగుటఁజేసి యద్దానికి విరుద్ధంబగు నానాత్వము మాత్రము శ్రుతులందు నిషేధింపఁబడుచున్నది. "ఏకధైవాను ద్రష్టవ్యం" అను వాక్యమందలి ఏకధా యను దానికి - ప్రపంచమును పరమేశ్వర శరీరంబను నొకేరీతితోనని యర్థముఁ జెప్పవలెను.

"అహమేకః ప్రథమ మాసం వర్తామిచ భవిష్యామిచ, నాన్యః కశ్చిన్మత్తో వ్యతిరిక్తః" "నే నొకఁడను మొదట నుంటిని. ప్రస్తుతము ఉన్నాను. ఇక ముందుండగలను. నాకంటె నితరుఁడు విలక్షణుఁడు నగు ఎవఁడును లేడు."

"ఆత్మావా ఇద మేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్కించనమిషత్" "సృష్టికి పూర్వ మీ సమస్తంబును ఆత్మగానే యుండెను. మరియొక టేదియు స్ఫురించ కుండెను."

ఇత్యాది వాక్యములందు నిషేధింపఁబడు భేదము - ఏకత్వమును విధించుటకు శేషమగునది. కావున పరమేశ్వరునందెట్టి యైక్యము విహిత మగుచున్నదో నట్టి ఏకత్వమును స్థిరపఱచునదిగా భేద నివారణ ముప యోగించునది.

మన్నే కుండ యనుచో - రెండు కుండలు లేవు అను నిషేధము మన్ను కుండ యొకటి యనుటకు నుపకరించదు గదా; మరియు ఇది కుండ యనుచో కుండఁ జెందియుండు రూప పరిణామాది భేదమును

తొలగించుట - ఘట మనఁబడు ధర్మి యొకటి యనుటకు నుపయోగించదు. రూప పరిణామాది భేదము ఘటవస్తువుఁ దగు ఐక్యమునకు విరుద్ధము కానట్టిది.

మరియు "నచాస్య కశ్చి జ్జనితా నచాధిపః, న తత్సమ శ్చాభ్యధి కశ్చ దృశ్యతే" "ఈ పరమాత్మను పుట్టించు ఒకానొకఁడు గాని అధిపతి గాని సమానుఁడు గాని యధికుఁడు గాని కానరాడు" "ఏకః సన్ బహుధా విచారః" "పరమాత్మ యొకడై యుండియు ననేక విధములుగా సంచరించువాడు" "ఏకో దేవో బహుధా నివిష్టః" "దేవుం డొకఁడు నానా రీతులుగా నుండువాడు" "త్వమేకోఽపి బహూ ననుప్రవిష్టః" "ఓ పరమేశ్వరా ? నీ వొకఁడవైన ననేకాత్మల ననుసరించి ప్రవేశించువాడవు" ఏతాదృశవాక్యములు - పరమేశ్వరుని వివిధ లక్షణములను, నానా లక్షణములు గల పరమాత్మ యొకఁడే యగుటను, స్పష్టముగా ప్రతిపాదించుచున్నందున పరబ్రహ్మము సవిశేషమే యగుచున్నయది.

బ్రహ్మకు నానాస్వరూపములుండునని ప్రమాణములు నిరూపించుచుండగా అట్టి నానాత్వమే బాధింపఁబడుచున్నదని చెప్పుట హాస్యాస్పదమగును. కావుననే బ్రహ్మము శక్తివిశిష్టంబై అద్వితీయమై భవము కలదగుట సమంజసమగుచున్నయది.

ప్రశ్న : ఓయీ! "బ్రహ్మను ప్రతిపాదించు నుపనిషచ్ఛాస్త్రము విచారింపఁ దగినది" అను ప్రతిజ్ఞ ననుసరించి యుపనిషదము లెవని నిరూపించునో నట్టివాడే బ్రహ్మశబ్దార్థంబగు గదా; ఇట్టి తరి నుపనిషచ్ఛాస్త్రము శివునిఁ బ్రతిపాదించునది కాదు. ఎట్లనగా ! "వేదము లన్నియు నెవని స్థానమును వర్ణించుచున్నవో, తపంబులన్నియు నెద్దానిని సమర్థించుచున్నవో, ఎద్దానికై బ్రహ్మచర్యము నవలంబించువారో అట్టి పదమును నీకు సంగ్రహముగా చెప్పుచున్నా" నని యారంభించి "మోక్షమార్గమున కంత మగు శ్రేష్ఠమైన విష్ణుపదము నుపాసకుఁడు పొందు" నని చెప్పు కఠవల్లీ శ్రుతియు "ఏ విద్యతో నక్షరుఁడైన పురుషుని గుర్తెరుగునో అట్టి బ్రహ్మ

విద్యను యథార్థముగా చెప్పె" నని ముండకశ్రుతియు, విష్ణు పురుషాది శబ్దములతో చెప్పఁబడు నారాయణునే ఉపనిషదములన్నియు ప్రతిపాదించునని నిరూపించు చుండుటచే నుపనిషత్ప్రతిపాద్య బ్రహ్మశబ్దమున కర్థము శివుఁడు కాదని తెలియుచున్నది.

ఉత్తరము : ఈ శంకను నివారించుటకై "సకల నిగమసార" ఇత్యాది విశేషణమును భాష్యమందాచార్యులవారు ప్రతిపాదించినవారు.

"విష్ణోః పరమంపదం" అనుచో పదశబ్దము స్థానముఁ జెప్పునది కాదు. కఠవల్లియందు మొదట "అవ్యక్తాత్పురుషః పరః" అవ్యక్తముకన్న పరుడగువాడు పురుషుఁడని నిరూపింపఁబడు పరపురుషుఁడే పదశబ్దముతో చెప్పఁబడువాడు. మరియు పద్యతే - ప్రాప్యతే అను వ్యుత్పత్తివలన పద శబ్దము ప్రాప్యుడైన పురుషునే చెప్పునుకాని విష్ణ్వాదిదేవతలఁ జెప్పునది కాదు. "విష్ణువునకు ముఖ్యముగా ప్రాప్యమగు పదమును" అని విష్ణు ప్రాప్యత్వము పరమేశ్వరునకు నిరూపింపఁబడియెను.

మరియు - పరమేశ్వరుని యొకే శక్తి - వినియోగకాలమున నాలుగువిధము లగునది. భోగసమయమందు భవానిగాను, పురుషస్థితిని విష్ణువుగాను, క్రోధకాలమందు కాళిగాను, యుద్ధావసరమున దుర్గాదేవి గాను పరిణమించునని స్మృతి చెప్పుచుండుటచే శక్తి యవస్థావిశేషంబగు విష్ణువునకు గల పురుషావస్థ లయించుతరి స్వరూపమగు శైవీశక్తి ప్రాప్యం బగుటయు, శైవీశక్తిద్వారా ప్రాప్యత్వమునకు చివరి యవధి శివుఁ డగు టయుఁ జూడగా శివుఁడే విష్ణువునకు పదమపదము అనగా ముఖ్యప్రాప్యుఁ డగుచున్నవాడని విశదమగుచున్నది.

"ఉభయ నిర్దేశే పంచమీ నిర్దేశో బలీయాన్". "పంచమీ షష్ఠి విభక్తుల రెంటి కవకాశ ముండుతఱి పంచమియే బలవత్తరమగు" నను న్యాయము ననుసరించి "విష్ణోః" అను పదమునకు పంచమి గ్రహింపఁ దగినది. "సర్వే వేదా యత్పద మా మనంతి" అను నుపక్రమంబు శివ విషయక మగుట సముచితమగుచున్నది.

ఎట్లనగా ? "శివో రుద్రో మహాదేవః-శంకరో బ్రహ్మ సత్పదం, ఏవమాదీని నామాని - విశిష్టాని పరస్యతు" "శివుఁడు, రుద్రుఁడు, మహాదేవుఁడు, శంకరుడు, బ్రహ్మ, సత్, పదము ఇత్యాది నామధేయములు పరమేశ్వరునకు ముఖ్యవాచకములుగా నొప్పారునవి" యని స్కాందము నందు చెప్పఁబడుటచే "తత్తే పదం సంగ్రహేణ బ్రవీమి" అను నుపక్రమము-పదశబ్ద ప్రయోగమువలననే శివుని సమర్థించుచున్నదని తెలియుచున్నది. "విష్ణోః" అను పదమున కుత్తరముగా పరమపద ముండుటచే పంచమ్యంతమే యుక్తమగునది. "యేనాక్షరం పురుషం వేద సత్యం" అనుచో నక్షరపురుష పదములును శివునే చెప్పునట్టివి. "నక్షరతీ త్యక్షరః" అను వ్యుత్పత్తివలన చేతనమాత్రునియందు ప్రవర్తించు నక్షరపదమునకు శివవిష్ణువులు సాధారణులు కాగా "యః సర్వం యః సర్వజ్ఞః సర్వవిత్" అను మంత్రమున సర్వజ్ఞపదముతో రూఢిగా బోధింపఁబడు శివునందే నక్షరపదము సమన్వయింపబడునది. "సర్వజ్ఞ" పదము యౌగిక మగునెడ సర్వవిత్పదము నిరర్థక మగును. సర్వజ్ఞపదము రూఢమగుచో ప్రాకరణికములగు నక్షరాదిపదములకు ప్రత్యేక దేవతాపరమైన ఆకాంక్ష కలుగగా రూఢితో నాకర్షింపఁబడు తాత్పర్యము గల పదమునందే ఇతర పదములన్నియు పర్యవసానముఁ జెందును గావున రూఢిపదముయొక్క వ్యుత్పన్నార్థముఁ దెలుపు పదము సార్థక మగునది. అనగా సర్వజ్ఞపదము రూఢమై అక్షరాదిపదముల నాకర్షించుచుండుటఁ జేసి సర్వజ్ఞపదార్థమును విశదీకరించుటకు సర్వవిత్పదము ఉపయోగించునదని భావము. "కుర్యాం హరస్యాపి పినాకపాణే ర్ధైర్యచ్యుతిం కే మమ ధన్వినోఽన్యే" అను కుమార సంభవ శ్లోకమందలి పినాకపాణి పదము-సారతరమగు ఆయుధము కలిగి యుండుటను తెలుపుటకై ప్రయోగింపఁబడి యందలి యౌగికార్థముతో పినాకపాణి యగు శంకరునందే పర్యవసించుచున్నదై రూఢ్యర్థమునకై హరపదము ననువర్తించునది. అనగా హరపద ప్రయోగముచే పినాకపాణి పదముఁ దగు రూఢ్యర్థమైన శంకరత్వంబు, యౌగికార్థమైన సారతరాయుధము కలిగియుండుటయు నిరూపింపఁబడినవని తెలియునది.

కావున నుదాహరింపఁబడిన వేదాంతవాక్యము లన్నియు శివపరములే యగుచున్నవి.

ప్రశ్న : ఓయీ! ఉపనిషదము లన్నియు శివునిఁ బోధించునవి కావు. "హిరణ్యగర్భః సమవర్తతాగ్రే" సృష్టి ప్రారంభములో చతుర్ముఖు డుండెను. "ఏకోహవై నారాయణ ఆసీత్" పూర్వము నారాయణుఁ డొకడే యుండెను. ఇత్యాది శ్రుతి వాక్యములందు అన్యదేవతాపరత్వము పొడగట్టుచున్నది కదా!

ఉత్తరము : ఈ శంకను నివారించుట కయ్యే "శ్రుత్యంతసారముఁ దగు సమరసభావమునకు పెన్నిధివంటివా" డను విశేషణముఁ జెప్పి యున్నవారు.

ఆపాతతః అన్యపరములుగా భాసించు వాక్యముల కొన్నిటిని బాగుగా విమర్శించినచో శివునందే తాత్పర్యము గలవని తేటపడును. మరియు వేదములందు, వేదాంతములందు, పురాణములందు నితర దేవతాపరములుగా చెప్పఁబడు వాక్యము లన్నియు సృష్టిస్థితి లయ తిరోధానానుగ్రహ పంచకృత్యములఁ జెందిన చరిత్రను తెలుపుచు ఆయా స్వరూపముల నంతర్యామి యగు శివునందు పర్యవసానముఁ జెందుచున్న వని కేనోపనిషత్తు విశదీకరించుచున్నయది.

ఎట్లనగా : "బ్రహ్మా హి దేవేభ్యో విజిగ్యే" దేవత లందరి విజయమునకు బ్రహ్మ (శివుఁడు) కారణ మగునది. దేవతలును, రాక్షసులును పోరాడగా అంతర్యామి యగు పరమాత్మ ననుగ్రహముచే దేవతలు గెలుపొంది, స్వసామర్థ్యమువలన విజయమును భావించుచుండిరి. అట్టితఱి శివుఁడు దేవతల గర్వమును పోగొట్టు నుద్దేశముతో యక్షరూపముతో నావిర్భవించి, అగ్ని-వాయువుల గర్వము నణచి యంతర్థానముఁ జెందెను. అప్పుడు భగవతి పార్వతీదేవి యుపదేశించుటవలన "సకల ప్రాణులలో నంతర్యామి యగు శంకరుని కరుణవలననే మనము గెలుపొంద గలిగితి" మని మహేంద్రాదులు తెలుసుకొనఁ గలిగిరి. యక్షరూపముతో నావిర్భవించినవాడు మరియొక దేవత యగుచో, పార్వతీదేవి సాక్షాత్కరించు

టకు వీలులేదు. ఇట్టి యభిప్రాయమును పురస్కరించుకొనియే వేదాంతాది శబ్దరాశి యంతయు శివునే బోధించుచున్నదని "ఇమా రుద్రాయ స్థిరధన్వనే గిరః" "ఉపస్థితములగు నీ వాక్యము లన్నియు అనగా వేద స్మృతీతిహాస పురాణాది వాఙ్మయ మంతయు స్థిరమగు ధనస్సుఁ ధరించు రుద్రునికొరకై నుపయోగించునట్టిది" అని మంత్రభాగము నిర్ధారించుచున్నయది.

స్మృతయశ్చ పురాణాని భారతాదీని సత్తమ
శివమేవ సదా సాంబం హృది కృత్వా బ్రువంతిహి.

"స్మృతులు, పురాణములు, మహాభారతము మొదలగునవియు శక్తివిశిష్టుడైన శివునే ఎల్లకాలము హృదయమందిడుకొని ప్రతిపాదించుచున్న"వని పూజ్యుఁడగు పరాశరమహర్షి వక్కాణించెను.

"వేదవిదులగు బ్రాహ్మణులారా? కొన్ని వేదవాక్యములు రుద్రమూర్తి నాశ్రయించియు, మరికొన్ని విష్ణుమూర్తి నాశ్రయించియు, తదితరములు కొన్ని బ్రహ్మదేవు నాశ్రయించియు, అన్యవాక్యములు కొన్ని అగ్ని నాశ్రయించియు, ఇంకకొన్ని సూర్యు నాశ్రయించియు, పరమకారణుడైన శివునందు పర్యవసానముఁ జెందుచున్నయవి." అని స్కాందమహాపురాణమునందును కలదు.

ఇట్లాయా దేవతామూర్తుల ద్వారా ప్రతిపాదింపఁబడు మహాదేవుఁడు మూర్తుల నన్నిటి నంతర్యామిగా నుండువాడు గావున "సకల నిగమసార నిధానస్య" అని చెప్పుట సమంజస మగుచున్నయది.

సామరస్య మనగా - వేదాంతము లన్నియు తాత్పర్యముతో నేకముఖము కలియుండుట యగును.

ప్రశ్న : ఓయీ? సర్వవేదాంత తాత్పర్య పర్యవసానము శివునందు పొసగకుండునుగదా; "యః సర్వజ్ఞః సర్వవిత్" ఇత్యాది వాక్యములనంతమ్మాంగళ్యగుణరత్నాకరత్వంబు "యతోవా ఇమాని భూతాని జాయంతే" ఇత్యాది వాక్యములు జగజ్జన్మాదికారణత్వంబును, "అంతః ప్రవిష్టః శాస్తా జనానాం" ఇత్యాది వాక్యంబులు సర్వనియంతృత్వంబును,

"ఆనందాద్ధ్యేవఖల్విమాని భూతాని జాయంతే" ఇత్యాది వాక్యము లానందాత్మకత్వంబును, "స ఏకో బ్రహ్మణ ఆనందః" ఏవమాదివచస్సులు నిరతిశయానందము కలిగియుండుటను ప్రతిపాదించుచుండుటఁ జేసి యిది యంతయు శివునం దెట్లు పొసగును ?

ఉత్తరము : లోకవేదములందు ప్రసిద్ధములైన పరమేశ్వరుని నామములు ప్రవర్తించుటకు గల కారణములను గమనించినచో పూర్వోక్త మంతయు శివునందు సరిపడునని విశదమగును. "ఈ పరమాత్మవలన జగము ఆవిర్భవించుచున్నది" గావున భవుఁడనియు ; "జగత్ క్షేమమును కలుగ జేయువాడగుటను, కల్యాణగుణము లన్నియు కలవాడగుటను" శివుఁ డనియు ; "జగమును హింసించువా" డగుటచే శర్వుఁడనియు ; "పశువు లనఁబడు జీవాత్మలను గోవృషభాదులనువలె పాశములతో బంధించి స్వకార్యమును చేయించువాడు" గావున పశుపతి యనియు ; "ప్రపంచము నంతయు శాసించుచు పూజ్యుఁ" డగుటచే పరమేశ్వరుఁడనియు; "సర్వేంద్రి యానందము నతిశయించు గొప్పదైన స్వాత్మానందమునందు వెలుగొందు వాడు" గావున మహాదేవుఁ డనియు ; "భక్తులకు సంసారదుఃఖమును పోగొట్టువా"డగుటఁ జేసి రుద్రుఁడనియు; "సుఖముఁ గలుగ జేయువాడు" గావున శంభుఁ డనియు ; సదాశివుఁడు పేర్కొనఁబడుచున్నవాడు.

శివశబ్దముతో నిఖిలమాంగళ్యగుణాకరత్వంబును ; భవ శివ శర్వ పశుపతి రుద్ర పదములతో పంచకృత్యపరాయణత్వంబును, పరమేశ్వర పదముతో నంతర్యామిత్వంబును, శంభుశబ్దముతో నిరతిశయానందము కలిగియుండుటయు, నిర్వచింపఁబడుచున్నవిగావునను వేదాంతములన్నిటి యందు బ్రహ్మలక్షణములఁ జెప్పునవిగా ప్రతిపాదింపఁబడు ముఖ్య నామ ధేయములకు నిధానమగుటచేతను శివుఁడే సర్వశ్రుతితాత్పర్యముఁ జెందు వాడని తెలియుచున్నది.

ప్రశ్న : శ్రవణ మనన నిధిధ్యాసన సాక్షాత్కారములతో ప్రసన్నుడై మోక్షమును కలుగఁజేయువాడే "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" సూత్రగత బ్రహ్మశబ్దమున కభిధేయమగువాడు. కావున "మోక్షమిచ్చే

జ్జనార్దనాత్" అను స్మృతివాక్యము ననుసరించి నారాయణునకు మోక్ష ప్రదత్వము విహితమగుచున్నది.

ఉత్తరము : ఇట్టి శంకను నివారించుటకై "స్వశేషభూత..."అను విశేషణము నుపపాదించి యున్నవారు. "ఫలమత ఉపపత్తేః" అను సూత్రాధికరణమున సకలపురుషార్థప్రదత్వంబును, "తన్నిష్ఠస్య మోక్షోప దేశాత్" ఇత్యాది సూత్రముల యధికరణములలో మోక్షప్రదత్వంబును శివునకు సమర్థింపఁబడును గాన నిట నుదాహరించలేదు.

ప్రశ్న : ఓయీ ! అనుగ్రహముతో పురుషార్థము సిద్ధించునెడ యత్నములేకయే పురుషార్థము లన్నియు సిద్ధింపవలసి వచ్చును. కపట రహితమైన దయకు నిధియై జీవులందరి ననుగ్రహించు శివున కెల్లకాలము ప్రసాద ముండుగదా !

ఉత్తరము : ఈ సంశయమును తొలగింప "సముపాసనానుగుణ సముదిత..." అను విశేషణముఁ జెప్పియున్నవారు. శివుఁడందరి ననుగ్ర హించువాఁడై యెల్లపుడు కలిగియుండు దయ-జీవులనాదికాలమునుండి చేయుచున్న నపచారములవలన వ్యక్తము గాకుండుటయు, కర్మజ్ఞాన రూపమైన శివారాధన ననుసరించి జీవులలో వారివారియందు వ్యక్త మగుచు పురుషార్థములను సిద్ధింపఁజేయుటయు గాననగును.

ప్రశ్న : ఓయీ ! చేతనశబ్దమునకు "నిఖిల" పద ముపయుక్తము కాజాలదు. పశుపక్ష్యాదులకు కర్మజ్ఞానాధికారము లేదుగదా !

ఉత్తరము : చేతనులందరును తమతమ ప్రారబ్ధముల ననుసరించి వరుసగా గ్రహించు జన్మలలో మనుష్యాదిశరీరములఁ బ్రవేశించుతఱి కర్మ జ్ఞానముల నాచరించుటకు నధికారము సిద్ధించుచున్నది. మఱియు

ణము - తిర్యక్ జంతువులందును పరమేశ్వరప్రసాదము సంభవించునని నిరూపించుచున్నయది. మరియు పాము ఏనుగ మున్నగు జంతువులలో నుపాసనాత్మకమైన జ్ఞానము చెప్పఁబడినందున నవ్వానియందును పూర్వజన్మ సంచితమగు జ్ఞానము నుపయోగించు యోగ్యత యుండునని తెలియునది.

ప్రశ్న : ఓయీ ? పుష్పములు బిల్వము మున్నగువానిని సమర్పించుట తుల్లకమైనదిగదా ; ఇంతమాత్రమున శివుఁ డెట్లు ప్రసన్నుడై గొప్ప పురుషార్థముల నిచ్చువాడు ?

ఉత్తరము : ఈ శంకను నిగసించుటకే "స్వశేషభూత..." అను విశేషణమును చేతనపదమున కనుసంధించి యున్నవారు.

ఒకానొక గృహస్థునకు భార్యాదులకునువలె చేతనులందరికి శివునకు ననాదికాలమునుండి శేష శేషి భావము సిద్ధించుచున్నది గావున నట్టి సంబంధముతో భక్తిపూర్వకమైన శివారాధన స్వల్పమైనను సంతసించువాడు పరమాత్మయని గ్రహించునది.

ప్రశ్న : త్రివిధ పరిచ్ఛేదము లేకుండుటను గుణములతో నిండి యుండుటను జగజ్జన్మాది కారణత్వము వలనను శివుఁడే బ్రహ్మయగు నపుడు శివేతర దేవతలందు బ్రహ్మశబ్ద మెట్లుపయోగించును ?

ఉత్తరము : ఇందుకే "పరబ్రహ్మణః" అని బ్రహ్మపదమునకు పర విశేషణముఁ జెప్పియున్నవారు. శ్రుత్యాది ప్రమాణములఁబట్టి హిరణ్యగర్భునకు బ్రహ్మత్వ వ్యవహారమున్నను అపరబ్రహ్మ కాదగును. బ్రహ్మ శబ్దము ప్రవర్తించుటకు గల కారణముల పూర్ణత్వము శివేతర దేవతలందు గానరాదు.

"ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ" యని శంకరుఁడే పరబ్రహ్మగా వర్ణింపఁబడుచున్నవాడు. "ఎందువలన పరబ్రహ్మయని చెప్పఁబడునని" ప్రశ్నించుకొని "పరబ్రహ్మ" యని యుచ్చరించుచుండగానే గొప్పయగుచు విస్తరింపఁజేయునది గావున పరబ్రహ్మ యని చెప్పఁబడునని ప్రతిపాదించిన నథర్వశిరోపనిషదంబును శంకరునకు పరబ్రహ్మత్వమును నిర్ధారించుచున్నది.

ప్రశ్న : అధర్వశిరమునందు చెప్పఁబడిన నామధేయములు ఓంకారముఁ జెందినవిగదా ! (?)

ఉత్తరము : "ఎయ్యది ఓంకారమో నయ్యది ప్రణవము; ప్రణవమే సర్వవ్యాపి; సర్వవ్యాపి యనంతము; అనంతము తారము; తారమే సూక్ష్మము; సూక్ష్మము శుక్లంబు; శుక్లము వైద్యుతంబు; వైద్యుతము పరబ్రహ్మంబు; అట్టివాఁడే యొకఁడగు రుద్రుఁడుగా, నీశానుఁడుగాను, భగవానుఁడుగాను, మహేశ్వరుఁడుగాను, మహాదేవుఁడుగాను, పేర్కొనఁబడుచున్నవాఁడు" ఇట్లు ఓంకారము మొదలుకొని మహాదేవపదమువరకు గల నామములు ఒక వ్యక్తిఁ జెప్పునవిగా నిర్వచింపఁబడియెను. మరియు

"శివోవా ప్రణవో హ్యేష(ః)ప్రణవో వా శివ స్తథా
వాచ్యవాచకయో ర్భేదో నాత్యంతం విద్యతే క్వచిత్.

"శివుఁడే ఈ ప్రణవముగాను, ప్రణవమే శివుఁడుగాను, వాచ్య వాచకములగు శివప్రణవములకు మిక్కిలి భేదమెందును గానరాదు" అను శివపురాణవచనము ననుసరించి ప్రణవనామములన్నియు నిట శివునందే పర్యవసానముఁ జెందుట సముచితమగుచున్నయది.

ఇందువలననే నధర్వశిఖయందు— "ఓంకార, ప్రలయ, ప్రణవ, సర్వదేవవేదయోని, సర్వవాచ్య, సముద్ధర్తృ, తార, విష్ణు, బ్రహ్మ, ప్రకాశ, విద్యుత్, వ్యాపి" ఇత్యాది నామములకు వాచ్యుఁడు మహాదేవుఁడని ప్రతిపాదింపఁబడినది. ఇట్లు బ్రహ్మదేవునకు విష్ణుమూర్తికిని చూపఁబడు పరబ్రహ్మత్వము గౌణమని విశదమగుటఁజేసి ప్రపరబ్రహ్మయగు సదాశివుని నిరూపించు వేదాంతభాగము విచారణీయంబని "బ్రహ్మజిజ్ఞాసా" పదముతో ప్రదర్శించి యట్టి వేదాంతవిచారము ధర్మవిచారానంతరకర్తవ్యమని అథశబ్దముఁ దగు ఆనంతర్యార్థముఁ జూపెట్టియు "తన్నియోగ..." అను పదముతో ధర్మము నుల్లేఖించియున్నవారు.

"తన్నియోగరూప..." అని చెప్పుటచే ధర్మమునకుగల చోదనకు ప్రమాణత్వంబు "తత్తదర్థవాద..." అనుటవలన మంత్రమునకు నర్థవాద

మునకును ప్రామాణ్యంబు, "స్వప్రమాణానుగుణ..." అనుటచే స్మృత్యాదులు ప్రమాణము లగుటయు, చూపఁబడినవి. మరియు "తదారాధన" ఇత్యాది విశేషణముచే ఇందలి ద్వితీయాధ్యాయములో నుపాసనాభేదంబు ప్రదర్శింపబడెను. "శ్రుతిస్మృతీ మమైవాజ్ఞే" "శ్రుతిస్మృతులు శివాజ్ఞలే" యనుటవలన వేదము, చోదనాత్మకమైన ధర్మంబు పరమేశ్వరుని శాసనము లగుటయు ; "భోక్తారం సర్వయజ్ఞానాం" కర్మలన్నియు శివారాధనము లగుటయు ; నిర్ధారింపఁబడుటచే కర్మానుష్ఠానరూపమగు ధర్మవిచారము చిత్తశుద్ధిద్వారా జ్ఞానజనకమగుటఁజేసి బ్రహ్మవిచారమునకు ముందు (ధర్మవిచారము) సరిపడుచున్నయది. ఇట్టితరి ఏతాదృశ విశేషణములతో కూడిన ధర్మమును విచారించుటయే పుష్కలముగా బ్రహ్మవిచారమునకు సహాయపడును కాని నిరీశ్వరవాద్యభిమతమైన ధర్మమును విచారించుట బ్రహ్మవిచారసహాయకము కాజాలదని గుర్తెరుగవలెను.

ఈ "అతః" శబ్దము - గడచినదానికి కారణత్వమును చూపెట్టునది. ఎందువలన వేదములఁ జదువుకొని ధర్మమును విచారించినవాడో అందువలన ధర్మానుష్ఠానముతో చిత్తశుద్ధికలవాడై తత్కాలమందు కలుగు వివేకము మొదలగు గుణముల తోడ్పాటుతో నేర్పడు పరమ (ఏకాగ్ర) భక్తితో కూడియుండు పురుషుఁడు నిరతిశయమైన ఆనందము నాపాదించు పరబ్రహ్మ నవశ్యము విచారించవలసినది.

ప్రశ్న : ధర్మముల నన్నిటి నాచరించుట చిత్తశుద్ధ్యర్థము గాకుండుటను ధర్మానుష్ఠానము తప్పనిసరిగా చిత్తశుద్ధిని కలిగించకుండుటను బ్రహ్మవిచారకారణము ధర్మవిచారము కాకుండునుగదా !

ఉత్తరము : ధర్మవిచారముఁ జేయునపుడు పూర్వమీమాంస యందు చెప్పఁబడిన వేదచోదన మొదలగు వాని ప్రామాణ్యంబు, శ్రుత్యాదుల స్వరూపముఁ దగు బలాబలంబులును ఉత్తరమీమాంసకు వలయు పరిజ్ఞానము దృఢపడుటకు నుపయోగించును కావున ధర్మవిచార మంతయు బ్రహ్మవిచారమునకు ముందు నియతమై యుండుట సమంజస మగు

చున్నయది. మోక్షఫలము నిత్యమనియు, సత్క్రియలకుఁ దగు నభ్యుదయ ఫల మనిత్యమనియు, భావించుట - వివేకమనఁబడుచున్నది.

ధర్మవిచారానంతరము పరమేశ్వర ప్రీతిభావనతో గావింపఁబడు కర్మలవలన చిత్తశుద్ధికలుగునని యుద్దేశించి "తత్కాల సంపన్న..." అను విశేషణముఁ జెప్పియున్నవారు.

హింస్రాహింస్రే మృదుక్రూరే ధర్మాధర్మౌ వృతానృతే
తద్భావితాః ప్రపద్యంతే తస్మాత్తత్తస్య రోచతే.

హింసించుటను, హింసించకుండుటను; మృదుత్వమును, క్రూరత్వమును; ధర్మమును, అధర్మమును; సత్యమును, అసత్యమును పూర్వజన్మవాసన ననుసరించి కలిగియుందురు గావున నాయా చేష్టితములు నాయా వ్యక్తులకు రుచించుచుండు నను స్మృతిప్రమాణముఁబట్టి సహజశివభక్తి కలవారై పాశుపతవ్రతము నవలంబించువారే నిజముగా నీ వేదాంతశాస్త్రమును విచారించుట కధికారము కలిగియుందురని విశదమగుచున్నది.

"తేషామేవైతాం బ్రహ్మవిద్యాం వదేత - శిరోవ్రతం విధివద్యైస్తు చీర్ణమ్" శ్రు. "వ్రతం పాశుపతం చీర్ణం - యైర్ద్విజై రాదరేణతు; తేషామేవోపదేష్టవ్యా మితి వేదానుశాసనమ్"

"శిరోవ్రత మనఁబడు పాశుపత (శివలింగధారణ) వ్రతమును విధియుక్తముగా నాచరించు ద్విజులకు మాత్రము బ్రహ్మవిద్యోపదేశముఁ బడయు నర్హత కల" దను ప్రమాణములఁబట్టి శ్రీ మాధవాచార్యులవారు - ఏకర్షిహోమము శిరోవ్రతము మొదలగునవి ఆథర్వణికులకు మాత్రము అధ్యయన ధర్మంబు లగుననియు, ఇతరులకు శిరోవ్రత మనఁబడు పాశుపతదీక్ష మోక్షాంగ మనియు సూతసంహితలో వ్యాఖ్యానించియున్నందువలనను పూర్వోక్తమైన బ్రహ్మవిద్యాధికారము శైవులకే సుసంగత మగుచున్నయది.

మరియు ముందు నధికరణములలో భాష్యకారులును పాశుపత వ్రత ధర్మములైన భస్మోద్ధూళనాదులు ఉపాసనలన్నిటియందు సాధారణ

కర్తవ్యము లనియు పాశుపతవ్రతమునకు ముక్తియే ఫలం బనియు నిర్ధారించియున్నవారు.

ప్రశ్న : పాశుపతవ్రతము - భస్మోద్ధూళనాదిరూపమే యని భాష్య కారులు నిరూపించుటవలన శివలింగధారులకు బ్రహ్మవిద్యాధికారము లేదని తెలియుచున్నది గదా !

ఉత్తరము : ప్రకృతభాష్యమునకు కారికను రచించిన శ్రీ నీలకంఠా చార్యులవారు - భాష్యోక్తమగు పాశుపతము లింగధారణ దీక్షారూపం బని క్రియాసార మనఁబడు నిగమాగమసార సంగ్రహమునందు అనేకాధి కరణములలో నిర్ణయించియున్నవారు. మరియు పాశుపతము లింగ ధారణాత్మకంబని శ్రీ ముదిగొండ నాగలింగారాధ్య శివయోగులవారు స్వవిరచిత లింగధారణ సర్వస్వమునందు బ్రహ్మపథమునందు విసరించి యున్నవారు. సూతసంహితలోని పాశుపతమును వివరించుతటి ప్రమా ణాంతరములఁబట్టి భస్మపదము - రుద్రాక్ష శివలింగములకు నుపలక్షకం బగునని గ్రహించునది.

బ్రహ్మజిజ్ఞాసా అను పదములోని బ్రహ్మశబ్దమునకు - బ్రహ్మను తెలుసుకొనుట యని షష్ఠికి కర్మార్థముఁ జెప్పవలెను.

"వేదములఁ జదివి ధర్మానుష్ఠానముతో శుద్ధచిత్తము గలవాడై యుండు బ్రాహ్మణుఁడు కర్మఫలములగు పుణ్యలోకంబు లనిత్య సుఖముల నిచ్చునట్టివని విమర్శించి నిత్యలోకము కృత్రిమకర్మతో ప్రాప్యము కాజాల దని నిర్వేదమును పొందవలెను. మరియు సమిత్ఫలాదులఁ గైకొని నిత్య లోక విరాజమానుండగు పరమాత్మను తెలుసుకొనుటకు శ్రోత్రియుడై బ్రహ్మనిష్ఠుఁడగు ఆచార్యు నాశ్రయించవలెను" అను శ్రుతివాక్యము విషయ మగుచున్నయది.

బ్రహ్మ విచారింపఁదగినది అవునా ? కాదా ? అని సందేహము కలుగుచున్నది.

ప్రశ్న: సందేహమున కవకాశములేనందున బ్రహ్మ విచారణీయము కాదని తెలియుచున్నది. "అయమాత్మా బ్రహ్మ" యను శ్రుతి - "అయం"

అను పదముతో ప్రత్యక్షసిద్ధమగు జీవాత్మనే బ్రహ్మగా నిర్దేశించుచున్నది. కావున బ్రహ్మకొరకై సందేహకళంకముఁదగు ప్రసంగమున కవకాశము లేదు. మరియు విచారమునకు ఫలము - విచార్యవిషయజ్ఞానము గదా; జ్ఞానమనగా జ్ఞేయపరిచ్ఛేదము; వేదాంతవిచారమువలన కలుగు జ్ఞానము- బ్రహ్మను పరిచ్ఛిన్నముఁ గావించునా లేదా ? పరిచ్ఛిన్నముఁ జేయునెడ బ్రహ్మపరిచ్ఛిన్నము కానిది యను ప్రసంగము భంగపడునది. పరిచ్ఛిన్నముఁ గావించనియెడల బ్రహ్మ-సంపూర్ణముగా తెలియకుండును. "అయం" అని పరిచ్ఛిన్నమగు ఘటము విశదమగుచున్నదిగదా! కావున బ్రహ్మ జ్ఞానము సంభవించునది కాదు. ఐనను బ్రహ్మజ్ఞానమువలన నెట్టి ప్రయో జనంబు గానరాదు. సంసారనివృత్తిరూపమైన మోక్షము ప్రయోజనమను నెడ సంసారము అనాదికాలమునుండి సిద్ధమగుటచే ఎప్పటికిని తొలగునది కాజాలదు.

ఈ ఆత్మ బ్రహ్మయని శ్రుతి చెప్పుటచే జీవుఁడే బ్రహ్మయని "అహం" అనుభవముతో ప్రత్యక్షసిద్ధం బగుచున్నది. బ్రహ్మ జీవభిన్నమనునెడ అట్టి బ్రహ్మను తెలుసుకొనుటవలన ఫలము గానరాదు. సంసారము తొలగినచో నిరతిశయానందము ప్రాపించునట్టిది; బ్రహ్మపదార్థజ్ఞానమువలన అనాది యగు సంసారము తొలగునదికాదు. జీవులందరికి నొకపర్యాయమే మోక్షము సంభవించునని చెప్పునెడ జీవులు గావించిన అనర్థంబులన్నియు నిష్ఫలములు కావలసివచ్చును.

కావున విషయప్రయోజనాదులు లేని యీ వేదాంతశాస్త్రము విచారింపఁ బ్రారంభింపఁదగినది కాదని యంగీకరింతురా ?

ఉత్తరము : ఉత్తరమీమాంస యనఁబడు బ్రహ్మవిచారశాస్త్రము అన్నివిధములను ప్రారంభింపదగినదై యున్నది. బ్రహ్మఁగూర్చి సందేహము కలుగుచుండుటఁజేసి యీ శాస్త్రమునకు బ్రహ్మ విషయంబగుచున్నయది. అట్టి బ్రహ్మను నిర్ణయించుకొనుటయు సఫలంబగునది. "అయమాత్మా బ్రహ్మ" యని యెందువలన శ్రుతి- యహంకారబద్ధుఁడగు సంసారిజీవునే బ్రహ్మగా జెప్పుచున్నదో అందువలననే సందేహము పొడముచున్నది.

"సమస్త బాధల కళంకములు లేనట్టి, నిరతిశయములైన జ్ఞానా నందములు మొదలగువాని శక్తియొక్క మహిమాతిశయము గలిగి యుండుట బ్రహ్మలక్షణం" బగుగదా !

"అనాదియగు అజ్ఞానము దగు వాసనల యభివృద్ధిచేత వ్యాపింపఁ బడు విచిత్రకర్మఫలముల యనుభవము ననుకూలించు నానాశరీరములందు ప్రవేశించుటయు అవ్వానినుండి వెడలుట యను వ్యసనపరంపరలకు పర వశుడై యనంత సంతాపమును సహించుట జీవలక్షణం" బగునది.

ఇట్లు పరస్పరము విలక్షణులైన జీవేశ్వరులకు శ్రుతులట్లు ఐక్య మును ప్రతిపాదించునని సందేహ మెందుకు పొడమకుండును ?

అన్నము బ్రహ్మయనియు, ప్రాణము బ్రహ్మయనియు, మనస్సు బ్రహ్మయనియు, విజ్ఞానము బ్రహ్మయనియు, ఆదిత్యుఁడు బ్రహ్మయనియు, నారాయణుఁడు బ్రహ్మయనియు, ఇత్యాదివాక్యములు భిన్నభిన్నవస్తువును బ్రహ్మగా చెప్పుచున్నయవి. ఇవ్వానిలో నెద్ది బ్రహ్మంబని యనేకవిధములు సందేహింపఁబడు బ్రహ్మము-విచారింపఁ దగినదే యగుచున్నది.

అట్టితటి-శ్రవణ మననాదులతో నిర్ణయింపఁబడునట్టి, భక్తిజ్ఞానముల యతిశయమున కభిముఖు డగునట్టి, వికారరహితమైన అనుగ్రహము గలిగినట్టి, గొప్ప యాచార్యుడై ముముక్షువుల నందరి ననుగ్రహించునట్టి శివాభిధేయమగు పరబ్రహ్మయొక్క కరుణాతిశయమువలన శమదమాది సంపన్నుడగు జీవాత్మకు కైవల్య (మోక్ష) మనెడు సంపద లభించుట ప్రయోజనం బగుచున్నది.

పాశముల సముదాయమును ఛేదించి, నిరతిశయములైన జ్ఞానా నందములను గోచరింపఁజేయు స్వరూపము గలిగినదియు, పరమేశ్వరుని యైశ్వర్యముతో సరిపడు గుణముల సారము గలదియు కైవల్య మనఁ బడును.

ఇందువలన వేదాంతవిచారము విషయముతోడను, ప్రయోజనము తోడను కూడిన దగుచున్నయది.

వేదములఁ జదివిన పిమ్మట భార్యఁ బరిగ్రహించి ధర్మానుష్ఠానమునకు వలయు వేదార్థవిచారమునకై "అథాతో ధర్మజిజ్ఞాసా" సూత్రార్థముఁ దెలుసుకొనుటకు స్వయముగా ప్రవర్తింతురు గావున ధర్మవిచార సమయమందు చిత్తశుద్ధి యపేక్షణీయము కాదు. పూర్వ పుణ్యబలమున చిత్తశుద్ధి కలవారు జ్ఞానసాధనమగు కర్మ నాచరించుటకు ధర్మవిచార మత్యవసర మగుటఁ జేసి ధర్మము నాచరించుచు సర్వతోముఖమైన చిత్తశుద్ధి గలవారై బ్రహ్మసూత్రములఁ జదువుటవలన వివేక, వైరాగ్య, శాంతి, ముముక్షు లనఁబడు సాధనచతుష్టయము నవలంబించి సహజ శివ భక్తి నభివృద్ధిపఱచుకొనియు బ్రహ్మవిచారమందు ప్రవర్తించువా రగుచున్నవారు.

బహువిధశ్రుతివాక్యశ్రవణమువలన ముముక్షుజ్ఞేయ మగు బ్రహ్మ మెట్టిదని సందేహము కలుగుటచే బ్రహ్మజిజ్ఞాస గలవాడై బ్రహ్మను నిర్దేశించు ఉత్తరమీమాంసా శాస్త్రశ్రవణమునందు ప్రవృత్తుఁడై వినుట కనుకూలించు ఉపపత్తుల ననుసంధించుకొనుచు స్వరూప, ప్రమాణ, సాధన, ఫలములవలన బ్రహ్మను నిర్ణయించుకొని భక్త్యతిశయముతో నిరంతర సేవనాత్మకమైన ఉపాసనఁ గావించు విశిష్టాధికారికి నిజసాక్షాత్కారము ననుగ్రహించి నిత్యసిద్ధమైన అపారకరుణతో నుద్ధరించుటయందభిరుచి గలవా డగుటచే బ్రహ్మవిద్య నుపదేశించుటకు పరమగురు స్వరూపముతో శ్రవణమననాదులఁ బ్రవర్తింపఁజేయు పరబ్రహ్మ-నిండు దయగలవాడై తనతో నత్యంత సామ్యము నాపాదించు జ్ఞానానంద స్వరూపమగు మోక్షలక్ష్మిఁ బ్రసాదించుచున్నవాడు.

అనాది సంసారము నివర్తించునని "సంసార మోక్షస్థితి బంధ హేతుః" ఇత్యాది ప్రమాణములు నిరూపించుచున్నవి. ఇప్పుడు పుట్టినవాని యజ్ఞాన మనాది యని విశద మగుచున్నను అట్టి యజ్ఞానము దూరమగునని యంగీకరింపబడినట్లు సంసారము అనాదియైనను తొలగునని గౌతమ సూత్రమునందు స్పష్టీకరింపఁబడియెను. "సర్వానుగ్రాహకస్య" అని చెప్పుటచే ప్రసాదాతిశయము పరమేశ్వరుని నిత్యకర్తవ్యమని విదిత మగు

చున్నది. "మహాదేశికస్య" అనుటవలన బ్రహ్మవిద్య నుపదేశించు గురుమూర్తి నధిష్ఠించి శ్రవణ మననాదులను సంపాదించుచు శివుఁడే మోచకుఁడగువాడని తెలియుచున్నది.

ప్రశ్న : ఇట్లు పరమకారుణికుఁడు సర్వజ్ఞుఁడు సర్వశక్తియు నగు పరమాత్మ అందరి నొకే మారు ముక్తుల నెందుకు చేయకుండును ?

ఉత్తరము : ఈ శంకను నిరసించుటకై "ప్రధ్వస్తపాశపటలా" అని చెప్పియున్నవారు. పాశపటల మనగా ? పటలమువంటి పాశమగును.

వైద్యుఁడు మిక్కిలి దయగలవాడైనను పక్వభావమును కనుగొని నేత్రావరణమును తీసివేయునట్లు పరమేశ్వరుఁడును జీవుల కర్మపరిపాకము ననుసరించి మలావరణములఁ బోగొట్టువాడు.

మలపాశ మనియు. మాయాపాశ మనియు, కర్మపాశ మనియు ఇవ్వాని సమూహము పాశపటల మనఁబడును. నైయాయికుల ముక్తి వలె పాశపటల వినాశము స్వతఃప్రయోజనము కలది కాదు గావున "ప్రత్యక్షీభూత——" అను పదముచే ప్రయోజనముఁ ప్రదర్శింపఁబడియెను. "తత్సమాన గుణసారా" అనుటవలన ముక్తియందు బ్రహ్మానందానుభవము అను పరమపురుషార్థ సద్భావము సత్యసంకల్పాది బ్రహ్మగుణము లావిర్భవించుటయు విశదమగుచున్నవి.

ఇట్లు "అథాతో బ్రహ్మజిజ్ఞాసా" సూత్రమువలన వేదాంతశాస్త్ర ప్రయోజనమును నిరూపించి సాధారణముగా తెలియునట్టి విశేషముగా తెలియనట్టి బ్రహ్మము జిజ్ఞాస్యమని వివరింపఁబడినది.

మరియు "అయమాత్మా బ్రహ్మ" అను వాక్యమే గాక "ఋతగ్ం సత్యం పరంబ్రహ్మ" ఇత్యాది వాక్యంబులును బ్రహ్మ నిర్దేశముఁ జేయుచున్నందున బ్రహ్మ యెద్ది యను సందేహము సహజమగుటఁ జేసి బ్రహ్మము జిజ్ఞాసా విషయంబగుచున్నయది.

బ్రహ్మశబ్దమునకు గల అవయవశక్తిని విచారించుటచే బ్రహ్మము జీవభిన్నంబనియు జీవుని పాశనివృత్తి బ్రహ్మానుగ్రహమునఁ గాదగుననియు విశదీకరింపఁబడియెను.

ఎల్లకాలము తాపత్రయముతో బాధపడు జీవునకు బ్రహ్మత్వము గాని, నిర్దోషమంగళ గుణాకరంబగు బ్రహ్మమునకు ఒకప్పుడు జీవత్వము గాని సంభవింపఁజాలవు.

ఇట్లు బ్రహ్మము జీవభిన్నమని తెలియుచుండగా అట్టి బ్రహ్మము నారాయణుఁడా? శివుఁడా? అని సందేహము కలుగుట అనివార్యము గావున "జన్మాద్యస్య యతః" ఇత్యాది సూత్రములఁ జెప్పవలసివచ్చెను.

"జ్ఞానము-జ్ఞేయమును పరిచ్ఛిన్నముఁ జేయునదగుటఁజేసి అపరిచ్ఛిన్నమగు బ్రహ్మమును నిర్దేశింపఁజాలునది కా" దను శంక యవివేకపూర్ణమైనది.

"ఇది యిట్టి" దని బ్రహ్మపరిచ్ఛేదము పొసగకున్నను బ్రహ్మభిన్నములగు వస్తువులను నిరాకరించి చెప్పఁబడు లక్షణమువలన (పరిచ్ఛేదము) సంభవింపనగును. లక్షణముతో పరిచ్ఛేదమనగా లక్ష్యేతరములను నివర్తించుటవలన (కలుగు) లక్ష్యమును తెలుసుకొనుట యగుగదా.

ఉద్దేశింపఁబడిన బ్రహ్మయొక్క లక్షణమును వేదాంతవాక్యములతో నిరూపించి విమర్శించగా అట్టి బ్రహ్మలక్షణము లేనట్టి బ్రహ్మసమానములు బ్రహ్మభిన్నములు నగు సమస్త వస్తువులకంటె వేరైన స్వరూపము గలదియు బ్రహ్మంబని విశదమగును కావున బ్రహ్మఁగూర్చిన శాస్త్రమును ప్రారంభించుట సమంజసమగుచున్నది.

సందేహాస్పదము కానట్టి ప్రయోజనరహితమైన దానిఁ గూర్చి బుద్ధిమంతులు విచారించువారు కారు. ఈ వేదాంతశాస్త్రమునకు బ్రహ్మము-ప్రమాణాభాసయుక్త్యాభాసములతో భాసించునదై సందేహింపఁబడునదగుటచే విషయంబగుచున్నయది.

"బ్రహ్మవి దాప్నోతి పరమ్" "బ్రహ్మ నుపాసించువాడు పరమాత్మను పొందువాడు" "జ్ఞాత్వా శివం శాంతి మత్యంత మేతి" "శివునిఁ గురుతెరిగి యత్యంతశాంతి యనఁబడు మోక్షమును పొందును" "ఈశం తం జ్ఞాత్వా హ్యమృతా భవంతి" "పరమేశ్వరుని తెలుసుకొనినవారు ముక్తులగుచున్నవారు" "తమక్రతుం పశ్యతి వీతశోకో ధాతుః ప్రసాదా

న్మహిమాన మీశమ్" "శివానుగ్రహమువలన దుఃఖములేనివాడై బంధరహితుఁడు గొప్ప మహిమగలవాడు నగు మహేశ్వరుని కనుగొనును" "ఆత్మాన మరణిం కృత్వా ప్రణవం చోత్తరారణిమ్ - ధ్యాననిర్మథనా దేవ పాశం దహాతి పండితః" "జీవాత్మను క్రిందియరణిగా ప్రణవమును త్తరారణిగా గావించి ధ్యాన మనఁబడు మథనముజేయు విద్వాంసుఁడు పాశమువంటి సంసారమును దహించును" "జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః" "మహాదేవుని తెలుసుకొనువాడు సర్వవిధపాశములనుండి విడిబడుచున్నవాడు" ఇత్యాది శ్రుతుల ననుసరించి జీవాత్మకు శివోపాసన వలన పాశములు విడిబడుట యనఁబడు మోక్షము ప్రయోజనంబగునని యీ మొదటి యధికరణమునందు ప్రతిపాదింపఁ బడినది.

జీవభిన్నంబగు బ్రహ్మమును తెలుసుకొనుటవలన ముక్తి యనఁబడు ప్రయోజనము నుపపాదించుటకు వలయు బ్రహ్మోపరిచ్ఛిన్నత్వంబు, జీవుడే బ్రహ్మయనునెడ బ్రహ్మపరిచ్ఛిన్నత్వంబు నేర్పడుచున్నవి. జీవ బ్రహ్మైక్యవాదమున - పరిచ్ఛిన్న బ్రహ్మజ్ఞానమువలన నెట్టి ప్రయోజనము సంభవింపకుండును. పరిచ్ఛేదము రెండు విధము లగునది.

కరతలామలకమువలె "ఇది యిట్టిదని" తెలియనగునది ప్రథమంబు. "ఇదమిత్థ" మని నిర్ణయము లేమిని ఇతర పదార్థములను నివర్తించి నిర్దేశించుట ద్వితీయంబు నగుచున్నవి. ఇందు రెండవ పరిచ్ఛేదము-బ్రహ్మయం దేర్పడునది.

సైన్యమధ్యమున రాజుఁ గనుగొనుటకు శ్వేతచ్ఛత్రమువలె వేద రాశియందు మంత్రములలో అర్థవాదములలోను ప్రసిద్ధమైన మహిమాతిశయము గల దేవతలలో జగత్కారణత్వము బ్రహ్మలక్షణముగా ఉపదేశింపఁ బడుచున్నది.

ప్రశ్న : పరిచ్ఛిన్న జ్ఞానముచేత బ్రహ్మప్రాప్తి యను ప్రయోజనము సిద్ధించునా ?

ఉత్తరము : బ్రహ్మమునకంటె వేరైన వస్తువులనుండి విలక్షణంబగుట యను పరిచ్ఛేదమునుమాత్ర మంగీకరించి యొకొక విద్యయందు

నుపసంహరింపఁదగిన గుణములయొక్క పరిజ్ఞానముతో శ్రవణ మనన నిధిధ్యాసనములు నివర్తించుచుండుటఁ జేసి బ్రహ్మసాక్షాత్కారమందు (ఇతరవ్యావృత్తత్వ మనఁబడు) పరిచ్ఛేదము సర్వథా అనివార్యం బగు చున్నయది.

అపరిచ్ఛేదమును తెలుపు శ్రుతులు :

బ్రహ్మము మనోవాగతీతంబని విశదపఱచునవి. బ్రహ్మసాక్షాత్కార మగునపుడు ఆవరణ రహితంబై సర్వతోముఖమగు జ్ఞానముతో బ్రహ్మము పరిచ్ఛిన్నమగునంతమాత్రమున వస్తుతః బ్రహ్మమునకు గల యపరిచ్ఛేదము భంగపడునది కాదు.

ప్రాణిమాత్రము చూచుటకు నేత్రము సూర్యుఁడు నవసరమైనట్లు ముముక్షువు తనకై ప్రసరించు శివానుగ్రహమనఁబడు సూర్యకాంతిచే సుసిద్ధముగా జేయఁబడిన జ్ఞాననేత్రముతో శక్తివిశిష్టుఁడగు పరమేశ్వరు నవలోకించువాఁడు.

బ్రహ్మము జీవభిన్నమా ? అను సందేహము పొడముచున్నందు వలననే ఈ శాస్త్రమునకు విషయము ప్రయోజనంబు నిరూపింప శక్యం బగుచున్నయది.

ప్రమాణాభాసములు :

నైయాయికులు చూపెట్టు అనుమానము మొదలగునవి. "మాయ భాసించుటతో జీవుఁడు ఈశ్వరుఁడును భాసించువారు. మాయావిద్యలు స్వయముగానే ప్రవర్తించునట్టివి" అనునవియు ;

యుక్త్యాభాసములు :

"యద్దృశ్యం తన్నశ్యం" "ఎద్ది కనఁబడు నద్ది నశించునది" మొదలగునవి.

ప్రయోజనము :

అర్థప్రాప్తి, అనర్థ నివృత్తియని రెండు విధములగునది ; ధ్యానము, శివానుగ్రహము, సాక్షాత్కారము అనునవి ముక్తి యనఁబడు ప్రయోజన మున కుపకరించునవి.

"బ్రహ్మ విదాప్నోతి పరం" అనుచో పరశబ్దమునకు నిరతిశయ బ్రహ్మానందము ప్రయోజనంబని చెప్పఁగూడదు. పరమముక్తి - పరమేశ్వర సాయుజ్య రూపమగుటచే సాయుజ్యమనఁబడు అర్థప్రాప్తియు, "ఈశం తం జ్ఞాత్వా అమృతా భవంతి" ఇత్యాది శ్రుతివాక్యములు నిరూపించు జననమరణ రాహిత్యమనఁబడు అనర్థనివృత్తియు ప్రతిపాదింపఁబడుచున్నవి.

ఈ సూత్రము కేవలాద్వైతులకు సంగతమగునది కాదు. ఎట్లనగా? బ్రహ్మము - ప్రత్యక్షగ్రాహ్యమగు సన్మాత్రమగుటచే వేద్యము కానందున విషయము కాజాలదు. వాక్యజన్యజ్ఞానము సంసారబంధమును తొలగించునది కానిదగుటచే ప్రయోజనంబు సిద్ధింపకుండును. బంధనివృత్తి ద్వారా జ్ఞానసిద్ధితో మోక్షము సంభవించుట పరమప్రయోజన మగుగదా; వాక్యజన్య జ్ఞానము గల జీవాత్మలందరికి వసిష్ఠ పరాశర వ్యాసాదులకుఁ బోలె నజ్ఞానము మున్ముందు నివర్తించునని చెప్పునెడ శాస్త్రము నారంభించుట కవకాశమేర్పడకుండును. జ్ఞాతృజ్ఞేయభేదము అనివార్యమగుటచే సత్యమైన భేదజ్ఞానము ఏనాటికిని తొలగనిది కావున నవాంతర ప్రయోజనము గాని పరమ ప్రయోజనము గాని యద్వైతమునందు సిద్ధించునవి కావు.

మరియు నీ మతమున అధికారియు పొసగకుండును. జ్ఞాత - స్వవినాశము అపురుషార్థమగుటచే శ్రవణాద్యులందు ప్రవర్తించువాడు కాడు. సుఖప్రాప్తియు దుఃఖనివృత్తియు నగు పురుషార్థము 'అహం' పదమున కర్థము గదా! అట్టి పురుషార్థి యొక్క వినాశము పురుషార్థ మెట్లు కాజాలును? ఇట్లు విషయ ప్రయోజనములు అధికారియు సంగతములు కానందున ప్రకృతసూత్రము నిర్విశేషవాదులకు సంబద్ధము గాకున్నయది.

మరియు మధ్వరామానుజాదుల సిద్ధాంతమునందు నీ సూత్రముపయుక్తముకానిది ; నిరుపపద (ఎద్దియు పైనలేనట్టి) బ్రహ్మశబ్దము శివునకు అసాధారణాభిధానమగుటచేత నితర దేవతలఁ జెప్పునది కాదు.

"ఏకమేవాద్వితీయంబ్రహ్మ" "ఏకఏవ రుద్రోనద్వితీయాయతస్థుః" ఇత్యాది వాక్యములందు నిరుపపద బ్రహ్మశబ్దము, శివశబ్దంబును సమానార్థకంబులని విశదమగుచున్నది.

మరియు నీ మీమాంసాశాస్త్రకర్త వేదవ్యాస భగవానుఁడు— "యుధిష్ఠిరుఁడు ధర్మమయంబగు మహావృక్షము; అర్జునుఁడు స్రాను; భీమసేనుడు శాఖలు; నకులసహదేవులు— పుష్పఫలంబు" అని చెప్పి "మూలం కృష్ణో బ్రహ్మచ బ్రాహ్మణాశ్చ" అని నిరుపపదమైన బ్రహ్మ శబ్దమును శివునివిషయమై ప్రయోగించెను.

"బ్రహ్మపదము—విష్ణువును బ్రాహ్మణజాతిని వేదమును తపమును చెప్పును" గాన నిట శివవాచకంబగునని చెప్పుట యెట్లనగా? కృష్ణశబ్ద ముతో విష్ణువు గ్రహింపఁబడి బ్రాహ్మణజాతియు వేరుగాఁచెప్పఁబడియెను. ఇట బ్రహ్మశబ్దమునకు వేదంబనిగాని తపస్సనిగాని యర్థముఁ జెప్పుట కూడదు. వేదతపస్సు లచేతనములగుటచేత చేతనులగు కృష్ణబ్రాహ్మణుల మధ్య నుపపాదించరాదు. ధర్మరాజు మొదలుకొని కృష్ణునివరకు నుండు వారికంటె భిన్నుఁడగు శివుని యిట బ్రహ్మపదమున కర్థముగా చెప్పుట సమంజసమగుచున్నయది.

ఇట్లు వేదాంతములు నిరూపించుటచేతను శ్రీ వేదవ్యాసుని మీమాంస మొదలగువానియందలి వ్యవహారమువలనను "బ్రహ్మజిజ్ఞాసా" గతబ్రహ్మశబ్దము శివునొకనినే తెలుపుచున్నందున-శివేతరదేవతాపరత్వముఁ జెప్పువారి కీ సూత్ర మసంగతంబగుననియే తెలియనగును.

ఐయ్యది, శ్రీ నీలకంఠ భగవత్పాదకృత శారీరక బ్రహ్మ మీమాంసా
సూత్ర భాష్యములో ప్రథమాధ్యాయ ప్రథమపాద
ప్రథమసూత్రాంధ్రీకరణము.

శ్రీ నీలకంఠారాధ్యకృత శారీరక బ్రహ్మసూత్ర భాష్యములో ప్రథమాధ్యాయ ప్రథమ పాదమందలి రెండవ సూత్రము.

౨. జన్మాద్యస్య యతః

అస్య - ఈ ప్రపంచమునకు, యతః - ఎద్దానివలన, జన్మాది- ఉత్పత్తి స్థితి. సంహార తిరోధాన అనుగ్రహంబులు నెరవేరుచున్నవో అద్ది బ్రహ్మం బని సూత్రార్థము. బ్రహ్మను నిర్దేశించు లక్షణముఁ జెప్పుటకు రెండవ సూత్రపు అధికరణ మారంభింపఁ బడియెను.

ప్రశ్న : లక్ష్యము తెలియుచుండగా లక్షణమును చెప్పుట నిరుప యోగమగుచున్నది. ఒకవేళ లక్ష్యము తెలియునది కాని యెడల లక్షణముఁ గూర్చి యాకాంక్ష కలుగకుండు కావున నిట బ్రహ్మలక్షణముఁ జెప్పు ప్రసంగ మెట్లు పొసగును ?

ఉత్తరము : వేదశాస్త్రముల నభ్యసించుటవలన బ్రహ్మము ఆపా తముగా తెలియునదగుటచేతను పూర్తిగా తెలియనిదగుటవలనను బ్రహ్మ లక్షణముఁ జెప్పుట యుక్తంబగుచున్నయది. జన్మాది - అస్య - యతః అని సూత్రపదచ్ఛేదము.

చేతనాచేతనములతో నిండియుండుటఁజేసి సమరసంబగు ప్రపంచ విలాసముయొక్క ఉద్భవము, స్థితియు, సంహారము, తిరోభావము, అను గ్రహము అను పంచకృత్యములఁ గావించునది బ్రహ్మంబగుచున్నయది.

"యతోవా ఇమాని భూతాని జాయంతే - యేన జాతాని జీవంతి, యత్ప్రయంత్యభిసంవిశంతి, తద్విజిజ్ఞాసస్వ ! తద్బ్రహ్మేతి"

"ప్రధాన క్షేత్రజ్ఞ పతిర్గుణేశః - సంసార మోక్షస్థితి బంధహేతుః"

"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"

"ఋతం సత్యం పరంబ్రహ్మ - పురుషం కృష్ణపింగళం - ఊర్ధ్వరేతం విరూపాక్షం విశ్వరూపాయవై నమః"

ఇత్యాది శ్రుతివాక్యములు పైసూత్రమునకు విషయములు.

"ప్రాణులందరిని పుట్టించునదియు, బ్రతికించునదియు, తనయందు విశ్రాంతిని కలుగజేయునదియు బ్రహ్మంబని గుర్తెరుగుము !"

"సంసారమును విడిపించుటకు (మోక్షమునకు) సంసారమున బద్ధుఁ గావించుటకును కారణమగు పరమాత్మ - గుణములకు ప్రకృతికిని జీవాత్మకు నధిపతిగా నుండువాడు."

"అపరిచ్ఛిన్నంబు, జ్ఞానగుణకము, సత్యరూపంబు నగునది బ్రహ్మంబగుచున్నది."

"పరమాత్మ - మనోవికారము వాగ్వికారంబు లేనివాడై పరిపూర్ణ స్వరూపము కలిగియుండు. మరియు కృష్ణ పింగళవర్ణములు గలవాడును విరూపాక్షుండును విశ్వరూపుండునగు. ఇట్టి పరమేశ్వరునకు నమస్కారము."

"బ్రహ్మవిదాప్నోతిపరం" ఇత్యాది వాక్యములను పఠించుటవలన బ్రహ్మము - స్వరూపగుణ మహిమలతో నిరతిశయప్రాభవముతోడ నొప్పునది కలదని యాపాతముగా తెలియుచుండుటఁజేసి యెద్ది యెట్టిదని శ్రుతులందు వెదకుచుండగా - మంత్రములు అర్థవాదములు మున్నగువాని యందు ప్రసిద్ధంబగు మహిమాతిశయము గలిగినట్టి బ్రహ్మ విష్ణు రుద్రాదులలో ఇద్ది బ్రహ్మంబని నిర్ధారణ గామిఁజేసి బ్రహ్మజిజ్ఞాస (బ్రహ్మఁగురుతెరుగుబుద్ధి) దృఢపడుచున్నయది.

"స్వయంవరమున రాజకుమారు లనేకు లాసీనులై యుండగా - ఆప్తులు వర్ణించిచెప్పిన స్వాభిమతగుణముగల వరుని వరించు కన్యకవలె". యతోవా మొదలగు వాక్యములందలి లక్షణములుగల సాంబశివునందు ముముక్షువునకు బ్రహ్మబుద్ధి ప్రసరించుచున్నయది.

ఇట్టి బ్రహ్మబుద్ధి "సదేవ సౌమ్యేద మగ్ర ఆసీత్" మొదలగు వాక్యముల వలన సందిగ్ధమగుచుండును కావున "శివుఁడే జగత్కారణమగు బ్రహ్మ" యని దృఢపఱచు నుద్దేశముతో జన్మాద్యధికరణము నుల్లేఖించి యున్నారు.

1. జన్మ - ఉత్పత్తి ;
2. స్థితి - ఉదయమునుండి ప్రళయమువరకు ప్రపంచస్థితి ;

3. సంహారము - ప్రళయము ;

4. తిరోభావము - సమస్త సాంసారిక అనర్థములకు మూలమైన బంధమును నెలకొలిపి నిత్యసిద్ధమైన జ్ఞానక్రియాశక్తులు మొదలగు ఐశ్వర్యమును మఱుగుపఱచుట ;

5. అనుగ్రహము - మోక్షప్రదానము.

ప్రశ్న : అనుగ్రహమనునది పరమేశ్వరుని నిజధర్మము గావున నద్దానికి జగత్సంబంధ మెట్లు చెప్పనగును ?

ఉత్తరము : అనుగ్రహముతో లభించు బంధనివృత్తి సంసారులఁ జెందియుండున దగుటచే సృష్టి స్థితిలయతిరోధానములవలె ననుగ్రహంబు జగత్సంబంధముకలదని చెప్పఁబడియెను. మరియు సర్వజ్ఞుఁడగు పరమాత్మ - జీవుల దుఃఖములను కనుగొని యొకేపర్యాయము విముక్తులఁగావింపగలిగినను సహజంబగు స్వకరుణ ప్రకాశించి భక్తులకు నిజసాక్షాత్కారోదయమగువరకు - ఆవరణముల ననువృత్తిసంకల్పము కలవాడగుటచే తిరోభావంబు పరమేశ్వరధర్మమే యగుచున్నది. ఘటాది స్థితికి మృత్తికాదుల స్థితి యావశ్యకంబగునట్లు జగదుపాదానకారణంబగు బ్రహ్మయొక్కస్థితి- ప్రపంచ స్థితికి కారణమగుటవలన స్థితియు బ్రహ్మధర్మంబగుచున్నయది.

జీవాత్మలు చేతనులనఁబడుదురు. పాషాణ వృక్షపర్ణాదు లచేతనములనఁబడును. శరీరములో శరీరి ప్రవేశించునట్లు చేతనాచేతనముల మేళనము సంభవించునది ; ఇట్టి మేళనముతోడ నేకీభావమును పొందియుండు ప్రపంచము సమరసంబనఁబడుచున్నయది. ఏతాదృశప్రపంచము పరమేశ్వరునకు విలాసమువంటిది ; విచిత్రములైన అనంతంబులగు కార్యములతో నిండియుండు ప్రపంచమును పరమేశ్వరుఁ డొకఁడే నిర్మించువాడగుటచే ప్రపంచమునకు "అస్య" అని ఏకవచనముఁ జెప్పఁబడియెను. ప్రథమసూత్రగత బ్రహ్మపదముఁబట్టి ద్వితీయ సూత్రములోని "యతః" అను పదము ననుసరించిన "తత్" అను అధ్యాహారంబు నెరవేరుచున్నయది.

ఆత్మలకు అవిర్భావస్థానము, తనకుతానే జనకుఁడునగు పరమాత్మ- క్షణాదికాలమును మృత్యుయమాదులను నియమించువాడై సత్యసంక

ల్యాది గుణములు కలిగి సర్వవిద్యాధిష్ఠాతయై ప్రకృతి పురుషులను నియోగించువాడై సత్త్వ రజస్తమోగుణములను శాసించువాడుగా వర్ణింపఁబడుటచే పరమేశ్వరుని స్వరూపలక్షణమును ప్రదర్శించుటకై "సత్యం జ్ఞానం" "ఋతం సత్యం" అను శ్రుతివాక్యము లుదాహరింపఁబడియెను.

ప్రశ్న : ప్రపంచము యొక్క ఉత్పత్తి స్థితిలయములకు కారణమగుట బ్రహ్మలక్షణం బగునా కాదా యని సంశయముకలుగుచున్నయది. ఎందుకనగా ? జగమునకు ఈశ్వరునకును సంబంధము లేనందున జగత్కారణత్వము బ్రహ్మలక్షణము కాజాలదు. మరియు "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అనుచో ఆనందమునకు జగజ్జన్మాది కారణత్వ లక్షణము సంగతమగునది. మరియొకచో "సదేవ సౌమ్యేదమగ్ర ఆసీత్" అని సత్పదార్థము జగత్కారణముగా చెప్పఁబడియెను. ఒకచో "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" అని అపరిచ్ఛిన్నమగు జ్ఞానము బ్రహ్మంబని తెలియుచున్నది. అన్యత్ర "యదా తమస్తన్నదివా నరాత్రి ర్నసన్న చాస చ్ఛివ ఏవ కేవలః" శివశబ్ద వాచ్యంబగునది జగత్కారణముగా చేతనాచేతన ప్రపంచమునకు ముందునుండు బ్రహ్మంబని విశదమగుచున్నది.

ఇట ఆనందము మొదలగువానిఁ గూర్చి చెప్పఁబడిన బ్రహ్మ భావమునకు వికల్పమా? సముచ్చయమా ? వికల్పమనునెడ నొకదాని నాకర్ణించి మరియొకదానిని వినవలెను గావున శ్రుతహాన్యాదిదోషములు సంభవించుటయు బ్రహ్మత్వమునకు వ్యవస్థలేకుండుటయు గాననగును. వ్యవస్థిత వికల్పమును (ఒకదాని యనంతరము మరియొకటి యనునది) చెప్పునెడ బ్రహ్మలు అనేకంబులగుచున్నవి.

సముచ్చయము (అన్నియు కూడి) అని చెప్పునెడ - ఆనందము మొదలగునవి బ్రహ్మ ధర్మములు గావున జగన్నిర్మాణమునకు వలయు నుపాయములను గురుతెరుగు మహిమాతిశయము గల బ్రహ్మము ఏర్పడకుండును.

ఇందు వలన "మాయాంతు ప్రకృతిం విద్యాత్" అను శ్రుతి - అచేతనంబగు మాయ జగత్కారణంబని చెప్పుచుండుటచే నదియే సమంజసముగా

తోఁచుచున్నది. జ్ఞానరూపంబగు బ్రహ్మము జగత్కారణంబని చెప్పునెడ "నిష్కళం నిష్క్రియం శాంతం" ఇత్యాది శ్రుతిభంగ ప్రసంగ మేర్పడు చుండుటఁజేసి సర్వవిధంబులను బ్రహ్మము జగత్కారణత్వాది లక్షణములు గలది యని చెప్పుటకు నశక్యముగానున్నయది.

వికల్పము=ఇదిగాని అదిగాని యనునది ;

వ్యవస్థిత వికల్పము=ఒకటి కొంతకాలము, మరియొకటి కొంత కాలంబను వ్యవస్థ గలది ;

సముచ్చయము=ఇదియు అదియు అన్నియు కూడి యనునది :

ఉత్తరము : సృష్టి స్థితి లయాదులు వస్తుతః జగముఁజెందినవై బ్రహ్మసంబంధము గలవి కాకున్నను జగజ్జన్మాది కారణత్వము - తటస్థ భావముతో బ్రహ్మ లక్షణముగా సంగతమగుచున్నయది.

ఎద్ది సర్వజ్ఞతాదివిశిష్టమై నామధేయాష్టక సన్నిహితంబగు శివ తత్త్వమో అద్దియే జగత్కారణమగు బ్రహ్మంబని చెప్పఁబడుచున్నయది.

ఆనందాది ధర్మములు బ్రహ్మమునందే పర్యవసానముఁ జెందునవి.

సర్వజ్ఞత, నిత్యతృప్తి, అనాదిబోధ, స్వతంత్రత, అలుప్త శక్తి కత్వము, అనంతశక్తిమత్త్వము- అనునవి బ్రహ్మమునకు సహజలక్షణ ములుగా పేర్కొనఁబడుచున్నవి.

1. సర్వజ్ఞత :

బాహ్యసాధనముల నపేక్షింపనట్టి నిష్కళంకానుభవమున సర్వ వస్తువులు నిత్యప్రత్యక్షము లగుచుండుట.

"యః సర్వజ్ఞః సర్వవిత్, యస్య జ్ఞానమయం తపః" ఇత్యాది శ్రుతులు బ్రహ్మము సర్వజ్ఞుఁడని ధృవపఱచుచున్నయవి.

ఇట్లు బ్రహ్మము సర్వజ్ఞుఁడని చెప్పుటచేత చేతనుల నానావిధకర్మ ఫలభోగమున కనుకూలములగు శరీరములను నిర్మించుటకు వలయు నుపా యంబగు సామగ్రివిశేషమును గురుతెరుగు బ్రహ్మము జగన్నిమిత్త కారణంబగునని తేటపడుచున్నది.

2. *నిత్యాతృప్తత :*

సర్వవిధబాధలఁజెందు కళంకము లేనట్టి నిరతిశయానందముతో పరిపూర్ణుడై యుండుట. ఇందువలననే "ఆనందో బ్రహ్మ" యని శ్రుతి ప్రతిపాదించినది. "అన్యోఽంతర ఆత్మాఽఽనందమయః" అని ప్రశంసించి "సైషాఽఽనందస్య మీమాంసా భవతి" అని యారంభించి యభ్యసించుట వలన నిరతిశయానందము ఉన్నతస్థానముగా కలవాడుగా, "సఏకో బ్రహ్మణ ఆనందః" అని పరమాత్మ నిరూపింపఁబడియెను. బ్రహ్మము ఆనందపరిపూర్ణుఁడగుటఁజేసి యట్టి యానందమే బ్రహ్మంబని వర్ణింపఁబడు చున్నయది. అట్టి యానందము ననుభవించు నైపుణ్యముగల బ్రహ్మము నిత్యాతృప్తమనఁబడుచున్నది.

బ్రహ్మము మహానందము ననుభవించుట మనస్సుతోడనే యగును. అస్మదాదులవలె బాహ్యసాధనముల యవసరము బ్రహ్మానందానుభవము నకు లేకుండును.

"ఆకాశ శరీరం బ్రహ్మ, సత్యాత్మ, ప్రాణారామం మన ఆనందం శాంతిసమృద్ధ మమృతమ్"

"ఆ సమంతాత్ కాశత ఇత్యాకాశః" అను వ్యుత్పత్తి ననుసరించి అంతట వెలుగొందునది యగుటవలన ఆకాశ మనఁబడును. ఇట ఆకాశ శబ్దవాచ్యము చిదంబరమగుటచే భూతాకాశము కానేరదు. ఎందుకనగా? భూతాకాశమునందు ప్రకాశ రూప ధర్మము లేకున్నయది. చిదంబర మనగా— సమస్తజగదండ సముదాయమనఁబడు బుద్బుదసముదాయము నకు సముద్రమువంటిదియు, శ్రేష్ఠమైన ప్రకృతిస్వరూపము గలదియు పరమశక్తి యగును. ఇట్టి చిదంబరము శరీరముగాగల పరమాత్మ ఆకాశ శరీరంబగుచున్నయది.

"సర్వాణి హవా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యంతే ఆకాశం ప్రత్యస్తంయంతి । ఆకాశో హవై నామ నామరూపయో ర్నిర్వహితా"

"ఈ ప్రాణులన్నియు ఆకాశమునుండియే పుట్టుచున్నవి. ఆకాశమును పొంది యస్తమించుచున్నవి. ఆకాశము ప్రపంచము యొక్క నామరూపముల నేర్పఱచునది" ఇత్యాది శ్రుతివాక్యములందు చిదంబరమునకు పరప్రకృతిత్వము (జగత్కారణత్వము) ప్రసిద్ధమైనది.

సత్యాత్మయనగా - ఉనికి స్వరూపముగా కలది యగును.

ప్రాణారామం - సర్వాధారమగు చిదంబరశక్తియే ప్రాణమనంబడును. స్వరూపంబగు నీ చిదంబరశక్తియందు సంతృప్తిఁబడయు బ్రహ్మము ప్రాణారామంబగునది.

బాహ్యసాధనములగు స్రక్‌చందన వనితాదులందు గాక మనస్సునందే ఆనందము కలుగునది మనఆనందమనఁబడును. ఇట ఆనందము చిదంబర ప్రకృతిగా చెప్పఁబడుచున్నయది. "కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనందో నస్యాత్" "ఈ చిదంబరరూపమగు ఆనందము లేనిచో ఎవఁడు జీవించును ? ఎవడు పెంపొందును ?" అను శ్రుతియు ఆనందము చిదంబరమగునని ప్రతిపాదించుచున్నయది.

శాంతిసమృద్ధం - శివత్వముతోడ నిండియుండునది ;

అమృతం - అనాదికాలమునుండి ముక్తమైయుండునది ;

ఇఁట పరమాకాశమనఁబడు చిదంబరము స్వరూపముగా గల బ్రహ్మము - మనస్సుతోడనే స్వరూపమగు ఆనందము ననుభవించునట్టి దనియు, బాహ్యసాధనములందపేక్ష లేనిదనియు విశదమగుచున్నది.

"మన ఆనందం" అని చెప్పుటవలన బ్రహ్మభావమును పొందిన ముక్తులకు స్వరూపంబగు నిరతిశయానందము ననుభవించుటకు సాధనము అంతఃకరణము మాత్ర మగుననియు బాహ్యసాధనముల యవసరము లేదనియు తెలియుచున్నది.

కావున బాహ్యసాధన నిరపేక్షంబగు శుద్ధజ్ఞానోచితసామర్థ్యము రూపముగా గలిగియుండు మనస్సుతో స్వరూపమైన అనంతానందము ననుభవించు బ్రహ్మము - నిత్యతృప్తమనఁబడుచున్నయది.

3. అనాదిబోధత్వము :

సహజమైన నిరతిశయంబగు జ్ఞానము కలిగియుండుట - అనాది బోధత్వ మగుచున్నయది.

ఆనందానుభవసాధనంబగు అంతఃకరణముగా నుండు జ్ఞానము అనాదిసిద్ధమగుటఁజేసి సంసారదోషము నెల్లకాలము లేనట్టి బ్రహ్మము - శాంతిసమృద్ధముగా నమృతంబుగాను వినఁబడుచున్నయది.

4. స్వాతంత్ర్యము :

ఇతరుల యధికారమునకు లొంగుట బొత్తిగా లేక స్వేతరవస్తువు లన్నియు స్వాధీనములై యుండుట - స్వాతంత్ర్యమనఁబడును.

"అజ్ఞుఁడగు జీవుఁడు పరతంత్రుఁడనియు, సర్వజ్ఞుఁడగు శివుఁడు స్వతంత్రుఁ" డనియు, "భోక్తయగు జీవుని, మరియు భోగ్యంబగు ప్రకృతిని ప్రేరేపించువాడు పరమాత్మ" యనియు "చేతనాచేతనములను శాసించు పరమాత్మ - చేతనాచేతనభిన్నుం"డనియు శ్రుతివాక్యములు— జడాజడప్రపంచమును ప్రవర్తింపఁజేయు బ్రహ్మమునకు స్వాతంత్ర్యమును సమర్థించుచున్నవి.

"జ్ఞాజ్ఞౌ ద్వావజా వీశానీశౌ"
"భోక్తా భోగ్యం ప్రేరితారం చ మత్వా"
"విద్యావిద్యే ఈశతే యస్తు సోఽన్యః"

ఇట్టి స్వాతంత్ర్యము సర్వవిషయములందు గల బ్రహ్మమునకు సర్వకర్తృత్వసిద్ధియు నేర్పడుచున్నది.

5. అలుప్తశక్తిమత్త్వము :

స్వాభావికంబగు శక్తి కలిగియుండుట - అలుప్త శక్తిమత్త్వ మనఁబడును.

"పరాఽస్య శక్తి ర్వివిధైవ శ్రూయతే - స్వాభావికీ జ్ఞానబల క్రియాచ" శ్రు.

ఇట్లు చెప్పుటచేత చిదచిత్ప్రపంచరూపమైన శక్తితో కూడియుం డుట - స్వాభావికంబగుననియు నిర్విశేషత్వము బ్రహ్మమునకు ఒకప్పుడు నుండజాలదనియు తెలియుచున్నది.

6. *అనంతశక్తిమత్త్వము :*

అపరిచ్ఛిన్నశక్తులతో కూడియుండుట - అనంతశక్తిమత్త్వ మనఁ బడును. బ్రహ్మము - అనంతశక్తులతోడనే జగమును శాసించునదై జగ జ్జనకంబగుచున్నయది.

"ఏక ఏవ రుద్రో న ద్వితీయాయ తస్థు స్తురీయ మిమం లోకమీశత ఈశినీయు ర్జననీయు ర్యః సర్వాన్ లోకా నీశత ఈశినీభి ర్జననీభిః పరమ శక్తిభిః" శ్రుతి.

"సృష్టికి ముందు రుద్రశబ్దవాచ్యుఁడగు పరమాత్మ యొకఁడే యుండెను. రెండవ వ్యక్తి లేకుండెను. నాలుగవదగు ఈ లోకమును శాసించువాడును పుట్టించువాడు నగు రుద్రుఁడు జననీశక్తులతోడను ఈశినీశక్తులతోడను లోకముల నన్నిటిని శాసించువాఁడగుచున్నవాడు."

అనంతశక్తిమంతము గావున బ్రహ్మము - అపరిచ్ఛిన్న ప్రపంచము నకు సమవాయి కారణంబగుచున్నయది.

శ్రుతులందు చెప్పఁబడు జగత్కారణత్వమును గురించి విశేషా కాంక్ష యుదయించగా- పంచకృత్యకారిత్వమును సమర్థించు సర్వజ్ఞత్వాది షడంగములు శివునకు ప్రసిద్ధంబులనియు, భవాదినామధేయాష్టకము - జగజ్జన్మాదికారణత్వము నుపపాదించుననియు, శివశబ్దంబు జగత్కారణత్వా ర్థమును స్థిరపఱచుననియు గ్రహించునది.

"యదా తమః" అను మంత్రమునందు శివుని జగత్కారణత్వ ప్రాబల్యముఁబట్టి సచ్చిదానందరూపత్వంబు శివునకే పొసగుచున్నదని "ఆనందాదీనాం" అను వాక్య ముపయుక్తంబయ్యెను.

ప్రాణులందరి కర్మోపాసనల ననుసరించి పక్షపాతము కఠినతయు లేకుండా అనాదికాలమునుండి ప్రవర్తించు సృష్ట్యాది పంచకృత్యముల

కర్తృత్వమునందు సర్వజ్ఞత మొదలగు షడ్గుణములు ఉపయోగించుచున్నవి.

సృష్టి స్థితి లయ తిరోధానానుగ్రహపాత్రులగువారి సమస్త విశేషములను అనాది సిద్ధజ్ఞానముతో నెల్లకాలము ప్రత్యక్షముగా గురుతెఱుగుచు తదనుకూలశక్తులతో ప్రపంచమునంతయు నధిష్ఠించుచు నిరతిశయానందముతో నిత్యతృప్తుడై యుండుకతన స్వతఃసిద్ధమైన యథార్థంబగు జ్ఞానము గలవాడగుటఁజేసియు భక్తులం దనురాగము భక్తులు కానివారియందు ద్వేషము అను వ్యత్యాసము లేనివాడగు శివుఁడే పూర్వోక్తముగా సృష్టి స్థితి లయాది పంచకృత్యములఁ గావించుటకు సమర్థుఁడగుచున్నవాడు.

అలుప్తశక్తిమత్త్వము, అనంత శక్తిమత్త్వంబు - ఘటమునకు మృత్తిక వలె బ్రహ్మము ప్రపంచమునకు ఉపాదానకారణం బగుటను సమర్థించునవి.

ఇట్లు భవాదినామధేయాష్టకమునందు శివశబ్దమునను పరమేశ్వరునకు జగజ్జన్మాది కారణత్వమును చూపుట భాష్యకర్తల యొక్క పరమోద్దేశంబగుచున్నయది.

ఉప్పురాయి యందు మరియొక రసము బొత్తిగా లేనట్లు బ్రహ్మానందము - లేశమైనను దుఃఖసంబంధము లేనిదగుటచే నిరతిశయంబగుచున్నయది.

ప్రపంచమంతయు శరీరముగా గల పరమాత్మకు భూతాకాశము శరీరమని నిర్వచించుటలో విశేషములేదు కావున చిదాకాశము స్వరూపముగా కలదని చెప్పుట సంగతమగునది.

చిచ్ఛక్తి - పరమేశ్వరునకు శరీరముగాను ఆనందముగాను ప్రాణముగాను చెప్పఁబడుచున్నందున ప్రపంచమునకు మూలకారణముగా నొప్పారుచున్నయది.

ముక్తపురుషులకు మనస్సు లేదనుచెడ - సంకల్పసిద్ధి యనునది సంభవించకుండును గావున లింగశరీరము భంగపడుటయే మోక్షమని చెప్పువాద మసంగతమని గుర్తెరుగునది.

పరబ్రహ్మము - భవ శర్వ ఈశాన పశుపతి రుద్ర ఉగ్ర భీమ మహాదేవ అను నామధేయాష్టకమునకు వాచ్యంబు అధికరణంబు నగునది ; యద్యపి సకల శబ్దవాచ్యంబైనను పరత్వమును తెలుపునవగుటచే ముఖ్యములగు భవాది శబ్దములచే పరమాత్మ నిర్వచింపఁబడువాడు. ఇంత మాత్రమున నితర శబ్దములతో చెప్పఁబడడని గ్రహింపరాదు.

"ఇమా రుద్రాయ స్థిరధన్వనే గిరః"అను శ్రుతివాక్యము ననుసరించి శంభు శంకరాది నామధేయములన్నియు శివునిఁ బ్రతిపాదించునవియే. "సర్వాణి హవా ఏతస్య నామధేయాని" అని ఆశ్వలాయనుఁడును చెప్పి యున్నవాడు.

కాని భవాది నామధేయములు - జగజ్జన్మాది కారణత్వలక్షణమును తెలుపునవి యగుటచేతను ఆపస్తంబీయ మంత్రసూత్రములందు ఈశానబలి యందును బోధాయనాశ్వలాయనసూత్రములందును శూలగవహోమము నందును, మహాదేవ ప్రతిష్ఠా విధి యందును, నిత్యపూజావిధి యందును, హోమతర్పణాదులందును చెప్పఁబడి వినియోగము కలవియగుటఁ జేసియు ముఖ్యములగుచున్నవి.

భవశబ్దారము :

"సర్వత్ర సదా భవతీతి భవశబ్దవాచ్యం బ్రహ్మ"

సర్వకాలములం దంతట నుండున దగుటచే బ్రహ్మము భవశబ్ద వాచ్యంబగునది; భూధాతువు సత్తార్థక మగుటవలన వస్తువుల నన్నిటి ననువర్తించు సద్రూపము - బ్రహ్మంబని విశదమగుచున్నయది.

"సదేవ సౌమ్యేదమగ్ర ఆసీ దేకమేవాద్వితీయమ్"

"సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ"

"సత్యాత్మ ప్రాణారామం మన ఆనందమ్"

"సన్మహాః"

"ఓ సౌమ్యుడా ? పరిదృశ్యమానంబగుప్రపంచము సృష్టికిపూర్వము సదాత్మకమై రెండవది (అసద్రూపము) లేనిదిగా ఏకరూపముగానుండెను.

"బ్రహ్మము జ్ఞానపరిపూర్ణమైనదియు, అవధిలేనిదియు, సద్రూపంబు నగునది"

"సత్యస్వరూపము, ప్రాణమునందు క్రీడించునదియు, మనస్సు నానందముగలదియు బ్రహ్మంబగుచున్నయది."

"పురుషుఁడైన రుద్రుఁడు సద్రూపుఁడు తేజోమయుండును"

"సన్ఘటః", "సన్పటః" అని వస్తువుల నన్నిటి ననువర్తించు స్వభావముగల బ్రహ్మము జగమునకంతటికి నుపాదానకారణంబగుచున్న యది. మట్టితో నిండియుండు కుండ మున్నగువానికి మృత్తిక యుపాదానంబగు గదా !

ఇందువలన సద్రూపంబగు బ్రహ్మము భవశబ్దముతో నిర్వచింపఁ బడుచున్నయది.

భూధాతువునుండి అసధాతువునుండియు నిష్పన్నమైన భవశబ్దము సత్తార్థకంబగుటచే సచ్ఛబ్దమునకు పర్యాయంబగునది; "సదేవ" అను వాక్యమందలి సచ్ఛబ్దము, "పురుషో వై రుద్రః సన్మహః" అను వాక్యము ననుసరించి శివునందే పర్యవసానముఁ జెందునదగుటచే భవపదము సత్పదంబు నేకార్థకములగుచున్నవి.

శర్వశబ్దార్థము :

"శౄ హింసాయాం" అను ధాత్వర్థము వలన శర్వశబ్దముతో బ్రహ్మము - సకలమును సంహరించునదిగా ప్రతిపాదింపఁబడుచున్నయది.

"తస్మా దుపసంహర్త్రే మహాగ్రాసాయ వై నమః"

"యస్య బ్రహ్మ చ క్షత్రంచ ఉభే భవత ఓదనః"

"మహాగ్రాసము గల నిఖిలప్రపంచసంహారి యగు పరమాత్మకు నమస్కారము."

"బ్రాహ్మణక్షత్రియాదిజగము నాహారముగా గొనునది బ్రహ్మంబగుచున్నయది."

ఇట్లు శ్రుతులందు బ్రహ్మము సర్వసంహర్తగా నిరూపింపఁబడు చున్నయది.

ప్రశ్న : నిఖిలసంహారము తమోగుణకార్యమగుటచే బ్రహ్మలక్షణ మగునా ?

ఉత్తరము : "సమస్తసాక్షిం తమసః పరస్తాత్" తమోఽతీతుఁడు స్వయం - ప్రకాశమానుండగు శంకరుఁడు - జీవుల విశ్రాంతికై స్థూల రూపములను విడదీయు సంహారకృత్యమును గావించుచు జీవుల ననుగ్ర హించువాడు.

ఈశాన శబ్దార్థము :

ఒకానొక ఆశ్రయము (ఉపాధి) లేనట్టి గొప్ప ఐశ్వర్యముతో కూడియుండువాడగుటచే బ్రహ్మము ఈశానశబ్దవాచ్యంబగుచున్నయది.

"య ఇమాఁ లోకా నీశత ఈశినీభిః" శ్రుతి.

శాసించుశక్తులకు బ్రహ్మమునకు నవినాభావ (ఎడతెగని) సంబంధ ముండుటఁజేసి పరమాత్మయే లోకములను శాసించువాడని తెలియునది.

పశుపతి శబ్దార్థము :

శాసించుటకు శాసింపఁబడువారు కావలయు గావున పరమేశ్వ రుఁడు పశువులనఁబడు జీవాత్మలను నియమించువాడై పశుపతి యనఁ బఱగును.

"ఏషా మీశే పశుపతిః పశూనాం చతుష్పదా ముతచ ద్విపదామ్" శ్రుతి. నాలుగు పాదములు రెండుపదములును గల ప్రాణులను శాసించు వాడు పశుపతి యగును.

పాశసంబంధమువలన పశుత్వము వ్యవహరింపఁబడుటచే పశువు పాశంబు గ్రహింపఁబడుచున్నవి. ఇట్లు చెప్పుటవలన చిదచిత్తులనఁబడు పశుపాశములను నియమించువాడు పరమాత్మయని గురుతెలుగునది.

చేతనులపైన నచేతనములపైనను ఈశ్వరభావము (నియమించుట అథవా ప్రేరేపించుట) సమానమగుటచే చేతనాచేతనములు పశువులనం బడుచు పరమేశ్వరునకు పశుపతిలక్షణమును ధ్రువపఱచుచున్నయవి.

"బ్రహ్మాదులును సంసారవశవర్తులగుటచే దేవదేవుఁడగు శంకరునికి పశువులని చెప్పఁబడుదురు. అవ్వాని నియమించుటవలన శివుఁడు పశుపతి యనఁబడును" అని పురాణ ముద్ఘోషించుచున్నయది. మరియు మల మాయాది పాశములతో జీవులను బంధించు పరమేశ్వరుని భక్తులు బాగుగా నుపాసించినయెడల నవ్వారి పాశబంధమును విడదీయువా డగును. పృథివ్యాది చతుర్వింశతి (ఇరువదినాలుగు) తత్త్వములు మాయా కర్మగుణంబులై జీవులను బంధించు పాశములగుచున్నవి. మహేశ్వరుఁడు బ్రహ్మాదులను పాశములతో బందించి స్వకార్యమును చేయించువాడు.

ఇఁట 'పశుశబ్దము గవాశ్వాదిపశువులనుగాని ప్రమథగణములను కాని చెప్పునది కాదు. చేతనులందరినిఁ జెప్పునట్టిది. లోకమున గోవృషభాది పశువులను తనుగులతో బంధించి బండిలాగుట, భూమి దున్నుట మున్నగు పనులను గృహస్థులు చేయించునట్లు చేతనులందరును పాశబద్ధులై తమతమ యోగ్యత ననుసరించి శివారాధన కుపయోగించువారుగా నొనర్పఁ బడుచున్నవారు. ఏవమాది సందర్భమువలన పశుశబ్దము జీవునియందు గౌణవృత్తిగా వ్యవహరింపఁబడియెనని విశదమగుచున్నయది.

రుద్రశబ్దార్థము :

సంసారదుఃఖమును పోగొట్టువాడు రుద్రుఁడనఁ బఱగుచున్నవాడు. "తరతి శోక మాత్మవిత్" "పరమేశ్వరుని గురుతెఱుగువాడు దుఃఖమయ మగు సంసారసముద్రమును దాటును".

ఉగ్రశబ్దార్థము :

ఇతరుల సామర్థ్యములతో పరాభవింపబడునది కానిదగుటచే బ్రహ్మము ఉగ్రశబ్దవాచ్యం బగుచున్నయది. "నతత్ర సూర్యోభాతి నచంద్ర తారకమ్" "సూర్యచంద్రనక్షత్రాదిప్రకాశములు బ్రహ్మపదమునం దుప యోగములేని వగుచున్న" వని శ్రుతియు వక్కాణించినది.

భీమశబ్దార్థము :

చేతనాచేతనములను ప్రేరేపించువాడగుటను చేతనులందరిని భయ పెట్టువా డగుటను పరమాత్మ భీమశబ్దముతో చెప్పఁబడువాడు. "భీషాఽస్మా

ద్వాతః పవతే" ఇత్యాది శ్రుతియు—పరమేశ్వరునివలన భయపడి వాయువు వీచును అని నిరూపించుచున్నయది.

మహాదేవశబ్దార్థము :

శివుఁడు—గోప్పదనము గలిగి స్వయంప్రకాశమానుఁడగుటఁజేసి మహాదేవుఁడని చెప్పఁబడుచున్నవాఁడు.

"అథ కస్మా దుచ్యతే మహాదేవః? యః సర్వాన్ భావాన్ పరిత్య జ్యాత్మజ్ఞాన యోగైశ్వర్యే మహతి మహీయతే, తస్మా దుచ్యతే మహా దేవః" (అథర్వ శీర్షోపనిషత్).

"ఎందువలన మహాదేవుఁడని చెప్పఁబడును? ప్రకృతిసంబంధములైన రాగద్వేషాదిభావములను విడనాడి శ్రేష్ఠమగు ఆత్మజ్ఞానము (నిజానం దాస్వాదను) అనఁబడు యోగముఁజెందిన ఐశ్వర్యమునందు విరాజమానుం డగుటవలన మహాదేవుఁడని చెప్పఁబడువాఁడు".

సర్వవిధములగు సంసారకళంకములు బొత్తిగా లేనట్టి సమస్త మంగళగుణముల కాశ్రయ మైనట్టి శివతత్త్వము—భవాదిశబ్దములతో చెప్పఁబడిన లక్షణములు కలదగుటచే సర్వజగమునకు సృష్టిస్థిత్యాది కారణం బగుచున్నయది. ఇట్టి మహిమగల శివస్వరూపము జగమునకు ఉపాదాన కారణంబు నిమిత్తకారణంబు నగుటఁజేసి బ్రహ్మంబని చెప్పఁబడుచున్న యది. శివశబ్దవాచ్యంబగు బ్రహ్మమే ఆనందాదిధర్మముల కాశ్రయంబగు నని యేర్పడుచున్నది. కావున ఆనందము మొదలగువానిఁ గూర్చిన వికల్పాదిచింత నిరర్థకంబగునది. "మాయాం తు ప్రకృతిం విద్యాత్" మహేశ్వరుఁడు మాయ నధిష్ఠించియుండువాఁడగుటచే పరమేశ్వరు నాశ్ర యించినట్టి మాయకే ప్రకృతిత్వము (జగత్కారణత్వము) కలదని విశద మగుచున్నది.

సూక్ష్మచిదచిత్తులతో కూడియుండు బ్రహ్మము కారణంబనియు, స్థూలచిదచిత్తులతో కూడియుండు బ్రహ్మము కార్యం బనియు ఏర్పడు చుండుటచే బ్రహ్మముజగజ్జన్మాదిస్వరూపము గలదగుచున్నదనిసిద్ధాంతము.

శివశబ్దనిష్పత్తి : శమిధాతువునకు వన్ ప్రత్యయము రాగా శమివన్ అగు. వ్యాకరణశాస్త్ర నియమము ననుసరించి అమ్, న్, ఈ రెండు లోపించినందున శమి అనుదానిలో శ్ ఇ, వన్ అనుదానిలో వకారంబు నిలచినవి. ఇట్లు శివశబ్దము నిష్పన్నమైనది.

దోషములు లేనివాఁడు గుణములు గలవాడు నని అచ్ ప్రత్యయాంతమగు శివశబ్దము చెప్పుచున్నయది.

జగమును హెచ్చుతగ్గులు కలదానిగా సృష్టించుటయు అర్థాని తారతమ్యమునకు వలయు పక్షపాతము లేకుండుటయు జగమునకు ఉపాదానంబు నిమిత్తంబునగుటయు పరస్పర విరుద్ధంబులైనను సర్వ సమర్థుండగు శివునకు చెల్లుచున్నయవి.

ప్రశ్న : "యదా తమః" అను మంత్రమందలి యంశము సుబా లోపనిషద్గత వాక్యమునందును వర్ణింపఁ బడుటఁజేసి యిందలి శివశబ్దము నారాయణ పరంబగును గాదా?

ఉత్తరము : "సర్వాణి హవా ఏతస్య నామధేయాని" నామధే యములన్నియు శంకరునివే యని ఆశ్వలాయనుఁడు చెప్పియున్నవాడు. మరియు హరివంశమునందు "గోవిందా! ప్రపంచమున నిన్ను జెందియుండు గొప్ప యభిధానములన్నియు నన్ను బోధించు" నని శివుఁడు కృష్ణ మూర్తికి చెప్పినట్లు కలదు. కావున సుబాలోపనిషద్గతమైన నారాయణ శబ్దము శివపరంబగును కాని "యదాతమః" అను మంత్రమందలి శివశబ్దము నకు నారాయణార్థమును చెప్పుట సమంజసముకాదు.

కూర్మ పురాణమునందు – చేతనాచేతన ప్రపంచమును స్వాధీన పఱచుకొనువాడగుట వలన ఈశ్వరుఁడనియు ; సర్వగతుండగుట వలన ఋషియనియు ; దేవతా గణముల నన్నిటిని కూడియుండువాడగుటచే హరియనియు ; అన్నిటికిని మొదటివాడగుట వలన స్వయంభువనియు ; ఉదకముల నాశ్రయించి యుండువాడగుటఁ జేసి నారాయణుఁడనియు ; సంసార బంధమును తొలగించును కావున హరుఁడనియు ; జగమునంతటను

వ్యాపించువా డగుటచే విష్ణువనియు ; నిఖిలమును గురుతెరగువాడగుట వలన భగవంతుఁ డనియు సర్వజ్ఞుఁడనియు ; సర్వవిధ రూపములు గలవా డగుటచే సర్వుఁ డనియు ; రక్షించువాడగుటచే "ఓమ్" అనియు ; మలత్రయరహితుం డగుటఁజేశి శివుఁడనియు ; పరమాత్మ నిర్వచింపఁబడు నని ప్రతిపాదింపఁబడి యున్నది.

ఇందువలన నారాయణ శబ్దము శివుని సాక్షాద్బోధించునదని విశద మైనది. మరియు "స్థావర జంగమములన్నియు నశించి యొకే సముద్ర ముగా నున్నపుడు వేయి తలలు, వేయి కన్నులు, వేయి కాళ్లును కలిగిన బంగరువన్నె దేహముతో కూడిన పురుషుఁడు అతీంద్రియ స్వరూపముతో జలమందు శయనించియుండగా" నా రా య ణుఁ డ ని పేరుగాంచెను. జగమును సృజించుటకు లయమొందించుటకును సమర్థుఁడగు పరమాత్మ చతుర్ముఖ బ్రహ్మయై నీటిని నిద్రించుకతన నారాయణుఁడాయెను.

ఇట్లు కూర్మపురాణము చెప్పుట వలన నారాయణపదము బ్రహ్మ నామధేయం బగుచున్నయది. కారణవాక్యములన్నియు శివునియందు పర్యవసానముఁ జెందుటను తెలుపు "యదా తమః" అను మంత్రము అనుగ్రాహ్య ప్రమాణముగా నొప్పారుచున్నయది.

"సదేవ సౌమ్యేదమగ్ర ఆసీత్" ఏతాదృశములు కారణవాక్యము లనఁబడుచున్నవి.

బ్రహ్మం బెట్టిదని పూర్వము ఋషులకు సందేహము కలుగగా వారు ధ్యానయోగముచే శివానుగ్రహముఁ బడసి "శివుఁడే బ్రహ్మం" బని నిర్ధారించుకొనిరి గావున తుల్లకబుద్ధితో కల్పింపబడు న్యాయములతో శివేతర దేవతలకు బ్రహ్మత్వము నిరూపింప శక్యము కానట్టిది.

సత్తు ఆనందము జ్ఞానము అనునవి వికల్పముగానో, సముచ్చయము గానో జగత్కారణములగుట పొసగనందునను పరమేశ్వరునితో వేరుగా నుండజాలని మాయయే జగదుపాదానమగుటను మాయావినాభావి పరమాత్మయే జగత్కారణమగుచున్నవాడు.

బ్రహ్మము నాశ్రయించు మాయ—ఆకాశాద్యచేతన రూపముగా పరిణమించునది; బ్రహ్మమును జీవుల నాశ్రయించు చిచ్ఛక్తి—జ్ఞానరూపముగా పరిణమించునది.

ఇట్టితరి బ్రహ్మముదగు పరిణామం బెట్టిదనునెడ - మాయకుగాని చిచ్ఛక్తికిగాని బ్రహ్మము - ఆశ్రయపర్యవసాన భూమి యగుటచే బ్రహ్మ వరకు జగదుపాన కారణత్వము చేకూరుచున్నయది.

ఘటాశ్రయమగు మృత్తిక - పిండావస్థయందు కారణముగాను ఘటావస్థయందు కార్యముగా నగునట్లు - పరమేశ్వరుఁడు సూక్ష్మచేతనాచేతన విశిష్టదశయందు కారణమగుచున్నవాడు. స్థూలచేతనాచేతన విశిష్ట దశయందు కార్యంబు నగుచున్నవాడు.

ఇట్టి జగత్కారణత్వము - బ్రహ్మమునకు తటస్థ లక్షణముగాను, సర్వజ్ఞత్వాది గుణములు కలిగి విరూపాక్షత్వాది విశేషములతో కూడి యుండుట - స్వరూపలక్షణముగాను విశదీకరింపఁబడుచున్నవి.

ఇయ్యది శ్రీ నీలకంఠ భగవత్పాదకృత శారీరక బ్రహ్మమీమాంసా
సూత్రభాష్యములో ప్రథమాధ్యాయ ప్రథమపాద
ద్వితీయసూత్రాంధ్రీకరణము.

శ్రీ నీలకంఠారాధ్యకృత శారీరక బ్రహ్మసూత్రభాష్యములో ప్రథమాధ్యాయ ప్రథమపాదమందలి మూడవ సూత్రము.

౩. "శాస్త్రయోనిత్వాత్"

లక్షణముఁబట్టి ప్రమాణము ననుసరించియు వస్తువు సిద్ధించునదగుటఁ జేసి జగత్కారణం బగు బ్రహ్మము ఎట్టి ప్రమాణముగలది? అను యాశంకకు సమాధానముగా తృతీయ సూత్రము నవతరింపఁజేసినవారు.

సూత్రార్థము - శాస్త్రము - యోని=ప్రమాణముగా గలదగుటచే బ్రహ్మము జగజ్జన్మస్థితిలయములకు కారణ మగుచున్నయది.

సందేహము - జగత్కారణ మగు బ్రహ్మము శాస్త్ర మొకదానితోడనే తెలియునదా? మరియొక ప్రమాణముతో విశద మగునదా?

ప్రశ్న : "ఈ జగము అవయవములతో కూడిన కార్యమేను, విచిత్రభావముగల జగము తగు కర్తఁ జెందియుండును" అను అనుమానముతో సర్వజ్ఞత్వాది గుణములుగల యొకానొక పురుషుడు జగత్కర్తగా కల్పింపఁ దగినవాడు. ఇట్టి జగత్కర్త- శాస్త్రైకగమ్యుడు కానందున శాస్త్రమునకు బ్రహ్మవిషయమై ప్రామాణ్యము గానరాదు. శాస్త్రమే ప్రమాణ మగునెడ ననుమానాది ప్రమాణాంతరములకు నవకాశ ముండ కూడదు గదా?

ఉత్తరము : జగత్కారణం బగు బ్రహ్మము - వేదాంతశాస్త్రము వలననే తెలియునట్టిది ;

"నావేదవిన్మనుతే తం బృహంతం" "వేదములను వేదాంతములను గురుతెరుగని వాడు గొప్పవా డగు పరమాత్మను భావింపఁజాలడు" ఇత్యాది వాక్యములందు వేదాంతవిజ్ఞానము లేనిది బ్రహ్మజ్ఞానము సంభవింపదని చెప్పఁబడియున్నది.

"జన్మాద్యస్య యతః" అను సూత్రముతో బ్రహ్మలక్షణమును నిరూపించి తాదృశబ్రహ్మలక్షణమునకు ప్రమాణము వేదాంతశాస్త్రం బని "శాస్త్రయోనిత్వాత్" అను సూత్రముతో తెలుపఁబడియెను.

ముముక్షువులు భావింపఁదగిన విశేషణములన్నిటితో కూడియుండు బ్రహ్మమును గురుతెఱిఁగుట- శాస్త్రభిన్నప్రమాణములతో కాజాలనట్టిది; మరియు నీవు చెప్పిన అనుమానము సమంజసము కానట్టిది; అనుమానము తోడనే జగత్కర్త సాధింపఁబడునెడ- నానావిధ నిర్మాణములు గల గోపుర ప్రాసాదాదులకు పెక్కురు కర్తలుందురనునది ప్రత్యక్షవిషయము గావున కర్త యొకఁడే యని సిద్ధింపకుండును. మరియు "కర్త యగువాఁడు కర్మపరవశుఁడగు" నను వ్యాప్తి బలమువలన పరమేశ్వరుఁడును కర్మపరవశుఁడు కావలసివచ్చును. పక్షమైన జగముఁ దగు ధర్మం బగు సకర్తృకత్వమువలన నొకానొక విలక్షణుఁడైన జగత్కర్త యుండునని యేర్పడుచున్నను నిమిత్తంబు నుపాదానంబు నగు సామర్థ్యముతో కూడిన కర్త యుండునని సిద్ధింపదు గావున బ్రహ్మము అనుమాన ప్రమాణముతో సాధ్యముకానిదై వేదాంతశాస్త్ర మొకదానితోడనే తెలియఁబడునదియు వేదాంతశాస్త్రమే ప్రమాణముగా కలదియు నగుచున్నయది.

భూ వృక్ష సముద్రాది నానావిధ ప్రపంచము నిర్మింపఁబడుటకు వలయు కర్తృత్వమునకై అనుమానాది ప్రమాణములు ఉపయోగించునవి కావు. దేవాలయాదులు ననేకులచే క్రమముగా కట్టబడుచున్నందున నేక కర్తృకత్వము సిద్ధింపదు కదా!

వేదాంత ప్రతిపాదిత లక్షణములన్నిటిని బ్రహ్మమునకు సమర్థించుటకై కేవల తర్కరీతిని విడనాడి వేదాంతములనే తప్పక నంగీకరింపవలసి వచ్చును.

పూర్వాధికరణమందు చెప్పఁబడిన జగత్కారణత్వమునకు వలయు సర్వజ్ఞత్వము "శాస్త్రయోనిత్వాత్" అను సూత్రముతో సిద్ధింపఁజేయఁ బడుచున్నదని కొందరి యభిప్రాయము.

సూత్రము సూచనాత్మకమగుటచే ననేకార్థములు కలిగియుండు ననుటలో—శ్లేషకావ్యమందు వలె వాక్యభేదాది దోషములు సంభవింపవు గావున మరియొక యధికరణము ప్రస్తావింపఁబడుచున్నయది.

"అస్య మహతో భూతస్య నిశ్వసిత మేత ద్యదృగ్వేదో యజుర్వేదః సామవేదః" ఇత్యాది శ్రుతివాక్యములు విషయములగుచున్నవి.

సందేహము — బ్రహ్మము వేదములకు కర్తయగునా కాదా ?

ప్రశ్న : "వాచా విరూప నిత్యయా" అను ప్రమాణము ననుసరించి నానా రూపములు కలిగియుండు నిత్యమైన వాక్కునకు బ్రహ్మము కర్త యగుచో వేదము లనిత్యములు కావలసివచ్చును. మరియు వేదములు బ్రహ్మకార్యములగునెడ- పౌరుషేయము లగుటఁజేసి యప్రమాణము లగును. పురుషుఁడు వేదములను నిర్మించువాడని చెప్పుట వలన భ్రమ ప్రమాదముల వశమున లోపముగలవియగును. బుద్ధమూర్తియు సర్వజ్ఞుఁడని బౌద్ధులు చెప్పినట్లు భగవంతుఁడు సర్వజ్ఞుఁడని చెప్పుట ప్రశంసామాత్ర మగును. వేదములు నిత్యములగునెడ ఈశ్వర కర్తృకములు కాగూడదు. వేదకర్తృత్వమూలముగా పరమేశ్వరునకు సర్వజ్ఞతయు పొసగజాలదు.

ఉత్తరము : బ్రహ్మకు వేదకర్తృత్వము విహితమేను ; "వేదరాశి పరమాత్మ నుండి నిట్టూర్పువలె నప్రయత్నముగా నావిర్భవించినది" అని శ్రుతి ప్రమాణము చాటుచున్నయది.

అష్టాదశానా మేతాసాం విద్యానాం భిన్నవర్త్మనామ్
ఆదికర్తా కవిః సాక్షాత్ శూలపాణి రితి శ్రుతిః.

నాలుగు వేదములు ; శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అను ఆరు వేదాంగములు ; పురాణము, న్యాయ శాస్త్రము, మీమాంస, ధర్మశాస్త్రము అను నాలుగు ; ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వము, అర్థశాస్త్రము అనఁబడు నుపవేదములును కూడి పదునెనిమిది విద్యలగుచున్నవి. వేరువేరు నంశములను పురస్కరించుకొని ప్రవర్తించిన నీ విద్యలకు త్రిశూలధారి యగు పరమేశ్వరుఁడు ఆది కర్త యగుటచే కవి యని చెప్పఁబడువాడు.

సృష్టికి పూర్వము తనలో దాగియున్న వేదములకు- పూర్వ పూర్వానుక్రమము ననుసరించు రచనతో ననంతరమును సర్వజ్ఞుఁడైన పరమేశ్వరుఁడు కర్తయగుచున్నవాడు. ఇందువలననే వేదములు

సాధారణ పురుష విరచితములు గానందున నపౌరుషేయములగుటయు ఈశ్వరకార్యము లగుటయు విశదమగుచున్నవి.

రాగద్వేషములు గలవారి వాక్యము ఒకప్పుడు ప్రమాణము గాకుండును కాని సమస్తదోష కళంకము లేనివాడు సర్వాధికంబగు నిర్వికార జ్ఞానమున భూతభవిష్యద్వర్తమాన వస్తువులను ప్రత్యక్షముగా ననుభవించు విలాసము గలవాడును స్వతఃప్రమాణమగువాడును ఆప్తులలో ముఖ్యుఁడును, సకలకామములను పొందినవాడును, పరమేశ్వరుఁడును అగు శివుని యొక్క వచనము ప్రమాణమగునట్టిదియే.

"ఈశానః సర్వవిద్యానా మీశ్వరః సర్వభూతానామ్"

"సనో దేవః శుభయా స్మృత్యా సంయునక్తు"

అను శ్రుతివాక్యములు—సకలవిద్యా ప్రవర్తకత్వమును శుభస్మృతి కారణత్వమును పరమేశ్వరునకు నిరూపించుచున్నవి. ఇందువలన సమస్త వస్తువులను ప్రకాశింపఁజేయు వేదములకు కర్తయగుటఁజేసి పరమేశ్వరుఁడు సర్వజ్ఞుఁడగుచున్నవాడు.

తెలియనిది చెప్ప నశక్యము గదా; పరమేశ్వరుఁడు సర్వవ్యాపకుఁడగుటచే వస్తువుల నన్నిటిఁ జెందియుండు గావున సర్వజ్ఞుడగుట సిద్ధించుచున్నను సర్వవస్తువులను ప్రకాశింపఁజేయు వేదముల నావిర్భవింపఁజేయుటవలనఁ గూడ సర్వజ్ఞత విశేషముగా సమర్థింపఁబడుచున్నయది.

"వస్తువుల రూపమును మాత్రమే తెలుపు దీపమువలె" పరమేశ్వరుఁడు కానివాడై తన శక్తులతో కూడిన ప్రపంచమునంతయు నొకే పర్యాయము విశదపఱచువాడు. జ్ఞానముఁ గలుగఁజేయు పదునెనిమిది విద్యలలో ముఖ్యములగు వేదములు – కర్మోపాసనల ద్వారా సాక్షాత్తుగాను పరమేశ్వరుని నిరూపించునట్టివి.

శిక్ష, వ్యాకరణము, నిరుక్తంబు వేదస్వరముల నిర్ణయించుటకు వర్ణములయొక్కయు, పదములయొక్కయు అర్థములను నిర్ధారించుటకు నుపయోగించునవి. కల్పము – వేదోక్తకర్మానుష్ఠానమును విధించునది; ఛందస్సు – కర్మాంగములైన మంత్రములయొక్క ఛందస్సులను తెలుపు

నది; జ్యోతిషము - కర్మాంగ సమయవిశేషమును నిర్ణయించునది; పురాణములు - సృష్ట్యాదివిషయములను పరమేశ్వరుని మహావిభూతిని విశదీకరించునవి. న్యాయశాస్త్రము-వేదాంత తాత్పర్యమును నిర్ణయించుటకు షడ్విధ లింగములలో నుపపత్తి యనఁబడు అనుమానమును, అనుమాన పరికరములను శోధించునట్టిది; మీమాంస - వేదార్థనిర్ణయము ననుకూలించు న్యాయములను తెలుపునది; ధర్మశాస్త్రము - వర్ణాశ్రమ సాధారణ ధర్మములను ప్రతిపాదించునది; ఆయుర్వేదము - కర్మాచరణ సాధనంబగు దేహపాటవమున కుపయోగించునది; ధనుర్వేదము - రాజ్యమున కవసరములగు అస్త్రశస్త్రముల సముదాయమును కనుగొనునది; గాంధర్వము-దేవతలను సంతసింపఁజేయు సంగీతముల పరిజ్ఞానముఁ గలిగించునది; అర్థశాస్త్రము - ప్రత్యక్షములు నప్రత్యక్షములునగు ధనసంపాదనోపాయములఁ దెలుపునది; ఇతిహాసములు పురాణములలో చేరును. వైదికదేవతారాధన విధాన విశేషములను బోధించు శివాగమములు ధర్మశాస్త్ర మనఁబడుచున్నయవి.

పరమేశ్వరుఁడు - సృష్ట్యాదియందు నష్టాదశ విద్యాస్థానములకు మొదటికర్తయై సాక్షాత్కవి యగుచున్నవాడు. ఒకానొక అర్థవిశేషమును పురస్కరించుకొని శ్లోకాదికమును రచించు అధ్యాపకునివలెఁగాక "తదేవ బ్రహ్మ పరమం కవీనాం", "కవిం కవీనా ముపశ్రవ స్తమం", "ఉదీరయం కవితమం కవీనాం" ఇత్యాది శ్రుతివాక్యములచే ఆదికవిగాను, మహాకవిగాను పేర్కొనఁబడుచున్నవాడు.

కవిశబ్దము - సర్వజ్ఞుడైన పరమేశ్వరుఁడు సర్వజీవుల ననుగ్రహించు నుద్దేశముతో తనలో దాగియుండు వేదములను వేదోక్తములైన కర్మోపాసనల నాచరించి జీవులు కృతార్థులు కావలెనని సృష్ట్యాదియందు రచించువాడని విశదపఱచునది. అక్షరజ్ఞానముమాత్రము కలవాడు రచయిత యగునా? సమస్తవేదార్థమును మనసునం దిడుకొని తన నిట్టూర్పుగా వేదములను బయలుపఱచు పరమేశ్వరుఁడు దక్క నన్యుడు వేదరచయిత కాజాలడు.

ప్రశ్న : అర్థమును పురస్కరించుకొని వేదముల నావిష్కరించుట పౌరుషేయమగుటఁజేసి వేదనిత్యత్వము భంగపడును గదా ?

ఉత్తరము : వేదాక్షరములు పదములు వాక్యములు ప్రకరణంబులు నవ్వాని యర్థంబులును పూర్వపూర్వము లగుటచేత ననాదిసిద్ధంబు లగుచున్నవి. ఇందు పురుషబుద్ధి కల్పితంబగు వ్యత్యాసము ఉండజాలదు. "ఈ వాక్యమునుండి యీ యర్థము స్ఫురించుగాత" యని యుద్దేశించి మాత్రము వేదములను రచించుటయు, తన్మూలముగా సర్వజ్ఞతయు సంగతము లగుచున్నవి.

"ఛందాంసి యజ్ఞాః క్రతవో వ్రతాని-భూతం భవ్యం యచ్చ వేదా వదంతి, అస్మాన్మాయీ సృజతే విశ్వమేతత్".

ఛందస్సులు యజ్ఞములు క్రతువులు వ్రతంబులును ఐనది కానున్నదియు వేదములు తెలుపు ప్రపంచమునంతయు మాయావిశిష్టుఁడగు మహేశ్వరుఁడు సృజించుచున్నవాడు.

ఇత్యాది ప్రమాణములవలన వేదము పురుషబుద్ధికృతం బనుటయు, వేదార్థము ననుసంధానముఁ జేయునట్టి ఒకానొక మహాపురుషుఁడు లేడనుటయు సమంజసములు కాజాలవు.

పరమేశ్వరుఁడు భ్రమలేనివాడని నిరుపప్లవ పదము తెలుపునది :

"స్వతః ప్రమాణస్య" అను పదము ప్రమాదము లేనివాడని విశదపఱచునది ;

"పరమాప్తస్య" అను పదము విషమత్వము లేనివాడని స్పష్టపఱచునది ;

ప్రశ్న : పరమేశ్వరుని సర్వజ్ఞత యనగా వేదోక్తములైన వస్తువుల నన్నిటిని తెలుసుకొనుట యగుగదా ! మహర్షులును వేదార్థమును గురుతెఱుగువా రగుటఁజేసి సర్వజ్ఞులు కాదగినవారు. కావున పరమేశ్వరునకు, మహర్షులకును భేదమేద్ది ?

ఉత్తరము : వేదములను రచించు పరమేశ్వరునకు వేదాతీతజ్ఞానముండవలయును. వ్యాకరణాది శాస్త్రములను రచించు పాణిని మొదలగువారు, వ్యాకరణాది శాస్త్రములకంటె నధిక పరిజ్ఞానము కలవారు.

వేదము-సర్వార్థములను తెలుపునది. ఐనను కొంత లక్షణతోడను, కొంత సామాన్యముగాను, కొంత విశేషముగాను సమస్తమును నిరూపించును.

పరమేశ్వరుఁ డట్లుగాక సమస్త సాక్షియై సర్వమును గోచరింపఁజేయువాడగుటచే వేదమునకు ఈశ్వరునకును వ్యత్యాసమును గాననగును.

వేదము పరమేశ్వరుని వాణియైనను పరమేశ్వరునివలె సర్వవస్తువులఁ జెందియుండు లక్షణముల నొకే పర్యాయము తెలుపునది కాదు. మహర్షులు వేదసంపూర్ణ పరిజ్ఞానముకలవారు కానందున మహర్షుల సర్వజ్ఞతకు పరమేశ్వరుని సర్వజ్ఞతకును గొప్ప యంతరము కనఁబడుచున్నయది.

ప్రశ్న : ఓయీ ? హిరణ్యగర్భుఁడు ఋగ్యజుః సామవేదములను మరియు సమస్తంబును సృజించెనని శ్రుతిచెప్పుచున్నందున చతుర్ముఖునకు వేదకర్తృత్వము అవగతమగును గదా ?

ఉత్తరము : హిరణ్యగర్భుఁడు ఆవిర్భవించుటకు ముందును వేదములున్నట్లు శ్రుతి వక్కాణించునది. "యో దేవానాం ప్రథమం పురస్తాత్ విశ్వాధికో రుద్రో మహర్షిః, హిరణ్యగర్భం పశ్యత జాయమానం స నో దేవః శుభయా స్మృత్యా సంయునక్తు" "యో బ్రహ్మాణం విదధాతి పూర్వం - యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై".

దేవతలందరిలో మొదటివాడగు హిరణ్యగర్భుని సృజించి వేదములనుపదేశించువాడగుటచే సర్వాధికుఁడైన వేదకర్తయు పరమదేశికుఁడు నగుచున్నవాడు. శ్రుత్యర్థము : రుద్రశబ్దవాచ్యుఁడైన పరబ్రహ్మ - సర్వజ్ఞతాది సామర్థ్యముతో ప్రపంచాధికుడై హిరణ్యగర్భుని తన ప్రకృతివలన ఉన్మించువానిగా నొనర్చి సృష్ట్యారంభమునందు సమస్తజ్ఞాన సాధనములగు వేదముల నుపదేశించు అనుగ్రహదృష్టితో వీక్షించువాడు. పరమదేశికుఁ

డైన నిట్టి పరమాత్మ - సర్వవిధ సంసారపాశము లనఁబడు మహానర్థము లను తొలగించునట్టి పరానందముఁ జెందించునట్టి పరమమంగళరూపమైనట్టి వేదాంతసార సామరస్యమువలన నేర్పడునట్టియు స్వవిషయంబగు బోధ రూపముగా గల స్మృతితో మమ్ము ననుసంధింపఁజేయుగాత !

ఇందువలన నీశ్వరునకు సకలవేదకర్తృత్వమును సుసంగతంబగునది.

వాజ్నిత్యత్వ శ్రుతి - పరమేశ్వరుఁడు పూర్వసత్త ననుసరించి వేద ముల నావిర్భవింపఁ జేయువాడగుటచేత నీశ్వరకార్యములయ్యును నిత్యం బులు నగు వేదములకు - విరుద్ధము కానట్టిది. కాపున వేదములు పరమేశ్వర ప్రణీతము లగుటయందు నిత్యత్వభంగము చేకూరఁజాలదు. మరియు —

బ్రహ్మదేవునకు వేదప్రాప్తి పరమేశ్వరునివలన యని శ్రుతి చెప్పు చుండుటచే వేదకర్తృత్వము సిద్ధింపఁజాలదు.

శుభస్మృతి యనగా - ఇష్టలింగమును హృదయమునఁ ధరించి ప్రాణలింగధ్యానముఁ గావించు క్రమంబగును. ప్రాణలింగానుసంధాన రూపంబగు ప్రణవపంచాక్షరీ మంత్రజపంబుతో భావలింగసాక్షాత్కారం బగునది; మోక్షజనకంబగు శివసాక్షాత్కారజ్ఞానంబు శుభస్మృతి యనఁ బడును.

స్వయముగా సూక్తవిశేషంబులఁ గనుగొను వసిష్ఠుడు మొదలగు వారు ఋషులని చెప్పఁబడుదురు. పరమేశ్వరుఁడైతేనో వేదముల నన్నిటి నావిర్భవింపఁ జేయువాడగుటచే మహర్షి యని పేర్కొనఁబడుచున్నవాడు.

ఇట్లు చెప్పుటవలన - రుద్రుఁడు ఋషులందరిలో గొప్పవాడై మహర్షి యనఁబడునని యవైదికులు వచించునది గ్రాహ్యము కాజాల దని తెలియనగును.

ఇట రుద్రశబ్దము - సంసారరోగమును పోగొట్టు పరబ్రహ్మయందు వర్తించుననియు సంహారరుద్రునియందు కాదనియు వివరింపఁబడినది.

పరమామృతంబనగా - అమృతంబులలో నత్యంతోత్కృష్టము, అనాదిముక్తంబునగు బ్రహ్మంబగును. అట్టి బ్రహ్మభావముతో సాదృ

శ్యముఁ బొందుట - తల్లక్ష్మీసమావేశ మనంబడును. ఇట్టిదియే పరానంద ప్రాప్తి యగును. స్మృతివిశేషణార్థము - శబ్దపదముతో నిరూపింపఁబడు చున్నయది. ఉపనిషదములన్నియు నైకకంఠ్యముగా శివునందు తాత్ప ర్యము గలిగియుండుట వేదాంతసామరస్య మనఁబడుగుచున్నయది.

ఇట్లు షడ్ఢోతాదివాక్యములకన్న నిశ్వసితాదిశ్రుతులు విలక్షణంబు లగుట కతన పరమేశ్వరునకు సకలవేదకర్తృత్వమును సమర్థించుచున్న యవి.

వేదములు - ప్రతికల్పమునందు నావిర్భవించునవగుటవలన ప్రవాహ నిత్యంబులగునని మొదట సమర్థించి - క్రమవిశేషముతో కూడిన వేదా క్షరములు ప్రళయమందు పరమేశ్వరుని బుద్ధిస్థములై సృష్ట్యాదియందు పరులకు వినఁబడునట్లు బయలుపడున వగుటచే పరమేశ్వరప్రణీతంబులగునని నిర్ధారింపఁబడియెను.

"స్వయంభువుండైన సదాశివుఁడు మొదట ననాద్యంతమగు వాణి నావిర్భవింపఁ జేసినవాడు. అట్టిదియే వేదమనఁబడు చున్నది. ఆ పిమ్మట సృష్టిప్రవృత్తు లన్నియు నేర్పడినవి" అని శాస్త్రప్రమాణంబు కలదు గావున వేదములు నిత్యములైనను పరమేశ్వర కర్తృకంబులగుట బాగుగా పొసగుచున్న యది.

ఇయ్యది శ్రీ నీలకంఠ భగవత్పాదకృత శారీరక బ్రహ్మమీమాంసా సూత్ర భాష్యములో ప్రథమాధ్యాయ ప్రథమపాద తృతీయ సూత్రాంధ్రీకరణము.

శ్రీ నీలకంఠారాధ్యకృత శారీరక బ్రహ్మసూత్ర భాష్యములో
ప్రథమాధ్యాయ ప్రథమ పాదమందలి నాలుగవ సూత్రము

౪. "తత్తు సమన్వయాత్"

ప్రథమాధికరణమందు జ్ఞాతవ్యముగా ప్రతిపాదింపఁబడిన పరబ్రహ్మమును గురుతెఱుగుటకు ద్వితీయాధికరణమున జగజ్జన్మాదికారణత్వము బ్రహ్మలక్షణంబని నిరూపించి యట్టి బ్రహ్మమునకై వేదాంతశాస్త్రము ప్రమాణంబనియు బ్రహ్మము నిఖిలవేదములకు మూలమనియు తృతీయాధికరణమునందు నిర్ధారింపబడియెను. వేదాంతవాక్యములు బ్రహ్మము నెట్లు సాధించునను నాశంకకు సమాధానముగా నాలుగవ సూత్రమవతరింపఁ జేయఁబడినది.

"తత్-తు-సమన్వయాత్" అని సూత్రపదచ్ఛేదము.

తచ్ఛబ్దముతో ప్రకృతమైన బ్రహ్మము పరామర్శింపఁబడుచున్నది. 'తు' శబ్దముతో అవధారణార్థ పూర్వకముగా వేదాంతవాక్యములన్నియు గ్రహింపఁబడుచున్నవి. సమన్వయ శబ్దముతో తాత్పర్య సంబంధము చెప్పఁబడుచున్నయది.

తత్ = బ్రహ్మమును, తు = వేదాంతవాక్యములు, సమన్వయాత్ = తాత్పర్యలింగ సంబంధము వలనఁ దెలుపునట్టివి యని సూత్రార్థము.

"కుముదం శ్వేతమేవ" అనుచో విశేషణ గత ఏవకార బలముతో కలువలన్నిటికిని తెలుపుదనము వలె సర్వ వేదాంతములకును బ్రహ్మసాధకత్వము గుర్తింపఁబడుచున్నయది. సమన్వయమనగా- ఉపక్రమాది లింగములతో తెలుపఁబడు తాత్పర్యముఁ దగు సంబంధమగును.

ఈ సూత్రమునకు వేదాంత వాక్యములన్నియు విషయములు.

సందేహము — వేదాంత వాక్యములకు బ్రహ్మబోధకత్వము యుక్తమా? కాదా?

ప్రశ్న : శబ్దము అర్థమును తెలుపుటకు నంతటను సంబంధ గ్రహణము నపేక్షించునది ; శబ్దార్థ సంబంధ జ్ఞానములేనిది పురుషునకు శబ్దార్థ

జ్ఞానము కలుగజాలదు. సంబంధజ్ఞానమైతేనో వృద్ధవ్యవహారము నపేక్షించు నది; వృద్ధ వ్యవహారము క్రియాస్వరూపంబు; "ఆవుఁ దెమ్ము! కట్టి వేయుము!" అని వృద్ధులు పలికెడు వాక్యములను వినుటతోడనే ప్రవర్తించు మరియొక వ్యక్తిఁ గనుగొని జిజ్ఞాసు విట్లు నిర్ణయించును. "అన్ని విధముల నీ వ్యక్తి క్రియఁ దెలుసుకొనియే ప్రవర్తించుచున్నవాడు. ఇట్టి కార్య జ్ఞానము 'గామానయే' త్యాది వాక్యము వలననే కలుగుచున్నది. అన్యథా ప్రవృత్తి కలుగు టెట్లు?" ఆవుఁ దెచ్చుటను కట్టుటను చూచి కార్యవిశేష మును నిర్ధారించుకొనువాడు. ఇట్లు శబ్దార్థజ్ఞానము కార్యము నుద్దేశించి కలుగునదగుటఁ జేసి సిద్ధమగు బ్రహ్మము విషయమై శబ్దమునకు ప్రామా ణ్యము కూడదు. మరియు జగము కార్యవిశేషమగుటచే కర్తృవిశేషం బగు బ్రహ్మము అనుమానము వలనను సిద్ధించునట్టిది. ఇంతియే గాక వేదాంత వాక్యములు విధిపరములగునవియే, బ్రహ్మపరములు కానట్టివి. విధి బ్రహ్మ ఉభయపరములని చెప్పునెడ వాక్యభేదము సిద్ధించును గావున వేదాంతవాక్యములు బ్రహ్మబోధకములగుట యుక్తముకాదు.

"అప్రాప్తే శాస్త్ర మర్థవత్" "ఇతర ప్రమాణములతోడ నగమ్యం బగు దానివిషయమై శాస్త్ర ముపయోగము కల" దను పూర్వమీమాంసా మర్యాద ననుసరించి యనుమాన ప్రమాణముతో సిద్ధంబగు బ్రహ్మమునకై వేదాంతశాస్త్రము నిరుపయోగమగును గదా?

ఉత్తరము: వేదాంతవాక్యములు తాత్పర్య లింగసంబంధముతో బ్రహ్మమును బోధించుట యుక్తమగుచున్నయది. "పరిజ్ఞానము కార్యము ననుసరించునదగుటచేత, బ్రహ్మము కార్యము గాకుండుటను బ్రహ్మము నకై శబ్దమునకు ప్రామాణ్యము లేదని" చెప్పఁబడిన యంశము సమంజ సము కాదు. "కుమారుఁడు కలిగె" ననునది మున్నగు వాక్యములు సిద్ధార్థము గలిగియుండియు శబ్దార్థసంబంధమువలన వృద్ధవ్యవహారమందు కార్యావగతిని జిజ్ఞాసువునకు కలుగఁజేయును. "ప్రయోజ్య వృద్ధునికి ప్రయోజనవాక్యము పదార్థజ్ఞానము నాపాదించు" నని జిజ్ఞాసువు

నిర్ధారించుకొనును. కావున సిద్ధార్థవిషయముల నుద్దేశించియు శబ్ద మభిధానం బగుచున్నయది.

సిద్ధమనగా - స్వతంత్రముగా నేర్పడునది. శబ్దాదిప్రమాణములు భూతార్థముఁ గురించి వాక్యార్థసంబంధము గలవి యగుటచే సిద్ధబోధకంబు లగుచున్నవి. ఇంతియేగాక వృద్ధవ్యవహారముతో నవసరము లేకయే మరియొక విధముగాను పదార్థజ్ఞానము కలుగునది. ఎట్లనగా? బాలురు తల్లి మున్నగువారితో శిశుపశ్వాదులఁగురించి యంగుళ్యాదులతో బోధింపఁబడుచుందురు. మరియు తత్తద్వస్తువుల విషయమై తత్తచ్ఛబ్దముల నుపయోగించుచు బాలురకు పదార్థజ్ఞానము కలుగఁజేయఁబడును.

కావ్యనాటకముల యర్థమును గురుతెఱుగఁదలచిన పురుషులు తదభిజ్ఞులైన పురుషుల నాశ్రయించి - పదవిభాగముతో నీ శబ్దమున కీ యర్థంబని - శబ్దములన్నిటి యర్థముఁ గ్రహించుచున్నవారు. ఇందువలన సిద్ధార్థకమందును శబ్దార్థజ్ఞానమేర్పడుచుండుటచే సిద్ధవిషయమై శబ్దమునకు ప్రామాణ్యము కలదు. గావున వేదాంతవాక్యములు బ్రహ్మవిషయమై ప్రమాణములగుచున్నవి.

పెద్దవారు మాటలాడుచుండగా నవ్వారి నడతఁబట్టి యర్థమును గ్రహింపనగును. మరియు చిన్నవారికి వస్తువులఁ జూపుచు - ఇద్దానికి ఇది పేరు - అని చెప్పుటవలనను ఉపాధ్యాయులు బోధించు శబ్దార్థసంబంధమువలనను పరిజ్ఞానమును బాలురు కలిగియుందురు.

"జగము కార్యవిశేషమగుటచే బ్రహ్మమును కర్తృవిశేషముగా ననుమానింపవచ్చు" ననుట సంభవింపదు. అనేకవిధ రచనలుగల రథ సౌధాదులకు కర్త లనేకులు కనఁబడుటచేత ననుమానముతో జగత్కర్తను సాధింపరాదు.

"వ్యాప్తి బలమువలన కర్మవశ్యత్వాదులు కర్తయందావహించు" నని పూర్వము చెప్పఁబడినది. గావున బ్రహ్మము అనుమానగమ్యము కానట్టిది. మరియు శ్రుత్యనుకూలమైన అనుమానము బ్రహ్మమునకై ప్రమాణంబగుగాత! వాక్యములకై తేనో విశ్రాంతిఁజెందుచోట ప్రామాణ్యా

మేర్పడుచున్నది. ప్రత్యక్షాది ప్రమాణము లట్లుగాక నంతటను ప్రామాణ్యము గలిగి యుండునవి.

వేదాంతవాక్యములకు బ్రహ్మమునందు తాత్పర్యమును నిర్ణయించు లింగములు ఉపక్రమాదు లగుచున్నయవి.

ఉపక్రమోపసంహారా వభ్యాసోఽపూర్వతా ఫలం
అర్థవాదోపపత్తీ చ లింగం తాత్పర్య నిర్ణయే.

ఉపక్రమము (ప్రారంభము), ఉపసంహారము (సమాప్తి), అభ్యాసము (పునఃపునరావృత్తి), అపూర్వత, ఫలము, అర్థవాదము, ఉపపత్తి యనఁబడునవి తాత్పర్య నిర్ణయము విషయమై లింగము లగుచున్నవి. కావున వేదాంతవాక్యములు బ్రహ్మయందు తాత్పర్యము కలిగియుండుట యుపక్రమాది లింగములతో నిర్ణయింపఁ బడునట్టిది. ఇట్టి నిర్ణయమే వేదాంతవాక్య శ్రవణ మనఁబడుచున్నది.

అజ్ఞానప్రభవం దుఃఖం జ్ఞానం తస్య నివర్తకం
సర్వవేదాంత వాక్యానాం శ్రవణం తత్ప్రవర్తకమ్.
శ్రవణం నామ వాక్యానాం వైదికానాం పరాత్పరే
ఉపక్రమాదిభి ర్లింగైః శివే తాత్పర్య నిర్ణయః.

అజ్ఞానమువలన కలుగు దుఃఖమును పోఁగొట్టు జ్ఞానము-సర్వవేదాంతవాక్య శ్రవణమువలన నేర్పడునది. శ్రవణ మనగా? వైదిక వాక్యములు నుపక్రమాది లింగములతో పరాత్పరుండైన శివుని విషయమై తాత్పర్యము గలిగియుండుటను నిర్ణయించుట యగును.

ఉపక్రమము, ఉపసంహారంబును గూడి వేదాంతములు శివునందు తాత్పర్యము గలిగి యుండుటను నిర్ణయించుటకు నొక లింగ మగునవి.

శివునందు తాత్పర్య మనగా? శివస్వరూపము, శివోపాసనయు విషయములుగా (వేదాంతములు) కలిగియుండుట యగును.

ఉపక్రమోపసంహారములకు నుదాహరణములు "సదేవ సౌమ్యేద మగ్ర ఆసీత్" "ఓ సౌమ్యుడా! సృష్టికి పూర్వము జగము సన్మయము

గానే యుండెను" అని యుపక్రమము. "తత్త్వమసి" "ఓ జీవుడా ! నీవా పరమేశ్వరుఁ డంతర్యామిగాఁ కలవాడవు" అని యుపసంహారము. "ధాతుః ప్రసాదా న్మహిమాన మీశం" "శివానుగ్రహమువలన పరమేశ్వరుని కనుఁగొనఁ జాలుదు" వని యుపక్రమము. "యఃపరః స మహేశ్వరః" "ప్రణవాతీతుఁ డగువాడే మహేశ్వరుఁడు" అని యుపసంహారము.

"తత్త్వమసి" "సర్వోవై రుద్రః" "అంబికాపతయ ఉమాపతయే" "యోవై రుద్రః స భగవాన్ భూర్భువః సువః" అనునది యభ్యాసము.

వేదేతర ప్రమాణముతో సంబంధము లేకయుండుట అపూర్వత యనఁబడును. ఫలము - బ్రహ్మజ్ఞానంబు ; సృష్టిస్థితిలయాదులఁ జేర్కొనుట మున్నగునది యర్థవాదంబగును. ఎట్టి విరోధంబు లేకుండుట సర్వజ్ఞతాది సంపత్తియు నుపపత్తి యగును.

ఇట్లు నుపక్రమాది షడ్విధ లింగములతో వేదాంత వాక్యములకు బ్రహ్మయందు తాత్పర్యము కలదని గ్రహించవలెను.

వేదాంతములు బ్రహ్మపరంబులే గాక "ఆత్మావాఽరే ద్రష్టవ్యః" ఇత్యాది వాక్యములవలన బ్రహ్మోపాసనవిధిపరంబు లగుననియు తెలియఁ బడుచున్నది. "బ్రహ్మమును బ్రహ్మోపాసనమును సమర్థించు నెడ వాక్య భేద ప్రసంగమగు" నని చెప్పగూడదు.

రూప జ్ఞాపకంబగు నేత్రముతో రూప గతంబగు వస్తువు సిద్ధించు నట్లు వేదాంతములు బ్రహ్మోపాసనపరములైనను బ్రహ్మసిద్ధిఁ గలుగఁ జేయున వగుటచే ఉభయపరత్వ మగుటయందు విరోధ మేమియు లేదు.

ప్రశ్న : బ్రహ్మజ్ఞానము బ్రహ్మవాచకశబ్దముతోడనే కలుగును గావున బ్రహ్మజ్ఞానవిధితో నేమి ప్రయోజనము ?

ఉత్తరము : బ్రహ్మవాచక శబ్దముతో బ్రహ్మపదార్థము తెలియఁ బడుచున్నను మంత్రములు మొదలగువానియందువలె బ్రహ్మజ్ఞాన విధికి విరోధము గానరాదు. ఎట్లు ద్రవ్యదేవతాదులను విశదపఱచు మంత్రములు చదువఁబడుచుండగా ద్రవ్యాది పరిజ్ఞానము కలిగినను మరల ననుష్ఠాన సమయమందు మంత్రములను స్మరించవలెనని రెండవది యగు అనుష్ఠాన

జ్ఞానమును కలుగఁజేయునో అట్లు వేదాంత వాక్యములు బ్రహ్మజ్ఞాన విధి ప్రయోజకము లగుచున్నవని గ్రహించవలెను.

ఉపక్రమము ఉపసంహారంబు గూడి యొక లింగము గావున లింగములు ఆరగుచున్నవి.

తాత్పర్యమనగా - అర్థస్వరూపంబగు వస్తువు ఇష్టముగా గలదాని భావంబగును. వక్త్రభీష్టము వాక్యమునం దుపచరింపఁబడుటచే పై విధము తాత్పర్య శబ్దార్థముఁ గ్రహించునది.

కల్పాదియందు వేదమునంతయు ప్రవర్తిలఁజేయు పరమేశ్వరుని యిచ్ఛ - ప్రవాహానాది న్యాయముతో సిద్ధమై వేదార్థవిషయంబగునట్టిది.

వేదము - శబ్దబ్రహ్మం బనఁబడును. వేరువేరుగా చెప్పఁబడిన ఋగాది వేదవాక్యములు జీవాత్మభోగ్యంబు లగుచున్నవి. వేదాధిష్ఠాత - పరమాత్మ యొకఁడేను.

"వివక్ష యవివక్షయు వాక్యార్థ ప్రతిపాదనయందు శబ్దశక్తివలన తెలియఁబడునది. విధిశక్తితో గ్రహింపఁబడునదంతయు వివక్ష యగుచున్నది. విధిశక్తి రహితంబగునది యవివక్షిత మనఁబడును." ఈ రీతి యంతయు లోకవాక్యములకు నతిశయముగా సంబంధించునది; వేదమునందైతేనో న్యాయముఁబట్టి తాత్పర్య మేర్పడునది.

"తత్త్వమసి" "జీవుఁడు శరీరముగా గలవాడు పరమాత్మ" యని తొమ్మిది పర్యాయంబులును, "యోవై రుద్రః స భగవాన్" బ్రహ్మవిష్ణు మహేశ్వరాదిక్రమముతో భగవచ్ఛబ్దార్థమగు కల్యాణగుణవత్త్వము ప్రతి పర్యాయంబు నభ్యసింపఁబడుచున్నయవి.

అణుష్ఠునకంటె నణువును ఆకాశాదులకన్న గొప్పవాడు నగు పరమాత్మ - ప్రాణి హృదయగుహాయందు ప్రాణలింగస్వరూపముతో వర్తిలువాడు, సకలకర్మాతీతమహత్వము కలిగియుండు మహేశ్వరుని లింగాంగసాహిత్యముతో నుపాసించి తదనుగ్రహామువలన సంసారక్లేశము లేనివాడై నిరతిశయానంద స్వరూపముగల శివునితో నత్యంత సామ్యము గల సాయుజ్యముఁ బొందువాడు జీవాత్మయని మంత్రార్థము.

ప్రశ్న : ఉత్పత్తివిధి, వినియోగవిధి, అధికారవిధి యని విధి త్రయము గలదు గదా; ఇందెద్దియు నుపయుక్తము కానందున ప్రయోగ విధియు సంభవించుట లేదు.

ఉత్పత్తివిధియనగా :

ఒకానొక విధియొక్క స్వరూపంబగును. ప్రతి విధికిని కర్త యవసరమగుటచే విధివాక్యము ననుసరించి యధికారిని పేర్కొనవలసి వచ్చును.

వినియోగవిధియనగా :

అధికారికి వలయు సాధనముల ననుసంధించుట యగును.

అధికారవిధియనగా :

అర్థవాదమువలన స్ఫురించు నత్యవసరాంశమును విశదపఱచుట యగును.

ఇవ్వాని సమష్టి ప్రయోగవిధి యనఁబడును.

అనగా మొదట విధివాక్యము, సాధనములు, అధికారియు కూడి ప్రయోగవిధి యగునని తెలియనగును.

ఉత్తరము : అధ్యాహారముతోడ నుత్పత్తివిధి సిద్ధింపగా ప్రకరణ వశమున శమదమాది సంపన్నుడై పరమేశ్వరు నుపాసింపవలెనని వినియోగవిధి యుపపన్నంబగునది; కావున రాత్రిసత్రన్యాయముతో "జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః" ఇత్యాద్యర్థవాదవాక్యములవలన నేర్పడు మోక్షకాముఁడు బ్రహ్మము నుపాసింపవలెనని యధికారవిధియు;

"మోక్షాపేక్షగలవాడు శమదమాదిసంపత్తి గలిగి బ్రహ్మోపాసకుఁడు గావలె" నని ప్రయోగవిధియు సంభవించుచున్నవి.

"సంసారబంధనిర్ముక్తుడు కాగోరినవాడు పరమేశ్వరునిఁ జూడవలె" నని యుత్పత్తివిధి కవకాశము కలుగునది. (ఇట నధ్యాహారము-సంసారవిమోచనేచ్ఛుః అను పదమునకు.)

"రాత్రులం దన్నదానముఁ గావించువారు ప్రతిష్ఠితు లగుదు" రనుటలో - రాత్రిసత్రమునకు ప్రతిష్ఠాకాముఁ డధికారియగునట్లు మోక్షకాముడు బ్రహ్మజ్ఞానమున కధికారి యగుచున్నవాడు.

ఇట్లు వేదాంతములకుఁ జెందిన ప్రయోగవిధితో నప్రత్యక్షమైన బ్రహ్మజ్ఞానం బేర్పడును గావున పునఃప్రత్యక్షజ్ఞానార్థము బ్రహ్మోపాసనముఁ గావింపవలెనని వేదాంతములు విశదీకరించుచున్నవని గుర్తెరుగునది.

ప్రశ్న : ఓయీ! బ్రహ్మజ్ఞానవిధి యుక్తముకాదు; "ఆత్మా వా రే ద్రష్టవ్యః" నిత్యము నిర్వికారము విశుద్ధంబు నగు పరమాత్మవిషయమై కర్మకర్తృభావము కూడదు. కర్మకర్తృభావముతోడనే విధి యేర్పడునది గదా! ఉత్పత్తి ప్రాప్తి వికార సంస్కారము లనఁబడునవి పరమాత్మయందు సంభవించనట్టివి.

స్వతంత్రఫలప్రాప్తికై సక్తున్యాయముతో కర్మకారక భావమును విసర్జించి కరణత్వముకొరకై "ఆత్మనాపశ్యేత్" అని చెప్పవలెనుగాదా? మరియు సక్తువులకును బ్రహ్మమునకును వ్యత్యాసము గలదు. హవన క్రియవలన భస్మీభావమనఁబడు విశేషము సక్తువులకు కలుగుటఁజేసి శబ్దముతో కరణత్వము, అర్థమువలన కర్మత్వంబు నేర్పడుచున్నవి. ఇట్టి వికారము బ్రహ్మమునందు సంభవింపదు గావున వేదాంతములకు బ్రహ్మజ్ఞానవిధిపరత్వము కూడదు గదా!

ఉత్పత్తియనగా - క్రియాజన్యఫలము; ప్రాప్తియనగా - పూర్వము అలభ్యమై ప్రస్తుతము లభ్యమగుట; వికారమనగా - మార్పు; సంస్కారమనగా శుద్ధి నాపాదించుట యని గుర్తెరుగవలెను.

ఉత్తరము : కర్మత్వాదిప్రయుక్తములగు నుత్పత్త్యాదు లాత్మయందు లేకున్నను కర్తకు వలయు మోక్షఫలముకొరకు విధి యుపపన్నంబగుచున్నయది. ప్రాప్తియుండగా విధి యెట్లనినచో ప్రాప్తి పాక్షికమా? నిత్యమా? ద్వివిధప్రాప్తి యున్నను నియమాది విధి సంభవించునది.

ప్రశ్న : ఓయీ! అట్లయినచో వేదాంతములు విధిపరములు బ్రహ్మపరములు నగుట యుక్తముకాదు. "రూపవినివేదకమగు నేత్రము

వస్తువునుఁగూడ తెలుపునట్లు వేదాంతములు విధిపరములైనను బ్రహ్మ పరములగు" నని చెప్పుటయు సమంజసముకాదు.

ఎందుకనగా ? కన్ను వస్తువుఁ జెందునపుడు అనపేక్షితముగానే ప్రతివస్తువును తెలుపునట్టిది. శబ్దము అట్లుగాక తాత్పర్యముగలచోట ప్రమాణంబగునది. కావున వేదాంతములు బ్రహ్మఁ దెలుపునవియు, బ్రహ్మోపాసనను విధించునవియు నగుట పొసగదుగదా ?

ఉత్తరము : "సమిధో యజతీ" త్యాది వాక్యములు - పంచప్రయాజములనఁబడు కర్మలను విధించుటయు పంచప్రయాజానుష్ఠాన క్రమ విధాయకంబులగుటయు ఇట్లు ఉభయపరత్వ ముండుటఁజేసి వేదాంత వాక్యంబులును బ్రహ్మప్రమాపకములగుటయు మోక్షోపకారక బ్రహ్మ జ్ఞాన విధాయకంబులగుటయు యుక్తములగుచున్నవి. సమిదాది వాక్యములు - చదువువారికి నర్థమును అనుష్ఠానక్రమమును తెలుపుగాతయని యుద్దేశించి పరమేశ్వరునిచే సక్రమముగా నుచ్చరింపఁబడిన కతన నవ్వానికి పంచప్రయాజ విధానమందును తదనుష్ఠానక్రమమందును తాత్పర్యము సమంజసమగుచున్నది.

శివారాధనమందు గంధాక్షత పుష్పబిల్వ ధూపదీపనైవేద్యాదులఁ జెప్పునెడ తత్క్రమము తదనుష్ఠానబోధయు నేర్పడుచున్నవిగావున వేదాంతములు ఉభయపరములగుటలో ఎట్టి యభ్యంతరము లేదని సిద్ధాంతము.

ప్రశ్న : బ్రహ్మము వేదవాక్యమువలననే తెలియఁబడుచుండగా వేదములు బ్రహ్మజ్ఞానమును విధించుట నిష్ప్రయోజన మగునది. ప్రయోజనంబు పూర్వజ్ఞానము వలననే కలుగును గదా !

ఉత్తరము : బ్రహ్మము వేదవాక్యమువలన పరోక్షముగా తెలియఁ బడుచున్నందున తత్సాక్షాత్కారమునకై బ్రహ్మజ్ఞాన విధి యుపపన్నం బగుచున్నయది. పరోక్ష జ్ఞానమునకు, అపరోక్ష జ్ఞానమునకును భేదమెట్లనగా ? శబ్దజన్యజ్ఞానము బ్రహ్మదర్శనమునకు కారణము గానట్టిది ; ఉపాసనాత్మక జ్ఞానము బ్రహ్మసాక్షాత్కారమును కలుగఁజేయునది.

"ధ్యాత్వా మునిర్గచ్ఛతి భూతయోనిం
సమస్త సాక్షిం తమసః పరస్తాత్"

"ప్రాణుల నుదయింపఁ జేయువాఁడు, సకల జీవప్రేరకుండు, ప్రకృత్యతీతుండు నగు పరమాత్మను ధ్యానించి, బ్రహ్మసాక్షాత్కారముఁ బొందువా డగును. ఇట్టి యుపాసకుని ముని యందురు."

"జ్ఞాన నిర్మథనాదేవ పాశం దహతి పండితః"

"ఆత్మను అరణిగాను, ప్రణవము నుత్తరారణిగా నమర్చి జ్ఞాన మనఁబడు మథనమువలన విజ్ఞానము గలవాఁడై సంసార పాశమును దహించును."

"జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః"

"పరమేశ్వరుని కనుగొని సర్వవిధ సంసార పాశములనుండి విడిబడును."

"ఈశం తం జ్ఞాత్వా అమృతా భవంతి"

"సర్వజగమును శాసించు మహాదేవుని కనుగొనినవారు ముక్తులగుదురు." ఇట్లు శ్రుతులు వక్కాణించుచుండుటచే బ్రహ్మఁగూర్చిన ప్రత్యక్షజ్ఞానము మాత్రమే మోక్షప్రద మైనదని గ్రహించవలెను.

"శ్రోతవ్యః శ్రుతివాక్యేభ్యో మంతవ్య శ్చోపపత్తిభిః
జ్ఞాత్వా చ సతతం ధ్యేయః ఏతే దర్శన హేతవః"

"వేదవాక్యములవలన వేదవాక్యార్థంబగు బ్రహ్మమును గురించి వినవలెను. మరియు అనేకవిధములైన సమర్థనములతో ఇదమిత్థమని నిష్కర్షితబుద్ధిఁ గలిగి యుండవలెను. ఇట్లు శ్రవణ మననములతో బ్రహ్మమును నిర్ధారించుకొని నిత్యము ధ్యానించవలెను. ఇట్టి శ్రవణ మనన నిదిధ్యాసనములు బ్రహ్మదర్శనమునకు కారణము లగుచున్నవి."

ఇట్టి తఱి శ్రవణమువలనను, మననమువలనను కలుగు పరిజ్ఞానముతో కూడిన ధ్యానము బ్రహ్మసాక్షాత్కారముఁ గలుగజేయునదని

విశదీకరింపఁబడినది. మరియు దిగువ శ్రుతులందు ఉపాసనాత్మక జ్ఞానము మోక్షఫలకమని విధింపఁ బడుచున్నయది.

"ఆత్మన్యేవాత్మానం పశ్యేత్" "మనోబుద్ధ్యాది విశిష్టమగు హృదయ మందు హృదయ స్థానీయమైన శివలింగమునందును అథవా జీవాత్మ యందు పరమాత్మఁ జూడవలెను."

"శంభు రాకాశమధ్యే ధ్యేయః" "హృదయాకాశమునందు శంకరుని ధ్యానించవలెను."

"తజ్జలానీతి శాంత ఉపాసీత" "శమదమాది సంపన్నుడై సృష్టి స్థితిలయములు మూడును పరమేశ్వరునివలననే జరుగుచున్నవని జగత్కార ణముగా బ్రహ్మను భావించవలెను."

"ప్రాచీనయోగ్యోపాస్స్వ" "పూర్వికుల ననుసరించు నుపాసకుడా! బ్రహ్మము నుపాసించుము."

"బ్రహ్మవిదాప్నోతి పరం" "బ్రహ్మోపాసకుఁడు బ్రహ్మమును పొందును" ఇత్యాది వాక్యములయందు బ్రహ్మస్వరూపము నుపాసించు టయు తత్ఫలాదికంబు నుపదేశింపఁబడియెను.

అట్లు బ్రహ్మ సాక్షాత్కారమునకు బ్రహ్మోపాసనము అనవసర మగుచో సత్యత్వాది విశిష్టమగు బ్రహ్మముతో నేకకాలమందు కోరిక లన్నియు సిద్ధించుట, మరియు బ్రహ్మసాక్షాత్కారంబు ఎట్లు సమకూరును?

కావున "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" "ఆనందో బ్రహ్మ" "ఆకాశ శరీరం బ్రహ్మ" "సత్యాత్మ ప్రాణారామం మన ఆనందం శాంతి సమృద్ధ మమృతం" "ఋతం సత్యం పరంబ్రహ్మ - పురుషం కృష్ణపింగళం, ఊర్ధ్వ రేతం విరూపాక్షం" అని సత్యజ్ఞానానంద స్వరూపంబై నదియు తనయందు తాను విశ్రాంతిఁ జెందునదియు, సమస్త ఉపద్రవకళంకములు బొత్తిగా లేనిదియు, సకల శుభాత్మకమైనదియు, ఎప్పుడును ఎడబాయనట్టి పరమ శక్తితో విచిత్రరూపముగల దగుటచే నలుపు ఎరుపు తెలుపు కూడిన వన్నెగలదియు మూడు కన్నులు గలదియు నగు బ్రహ్మము - ఉపక్ర మాది తాత్పర్యలింగములతో నిరూపింపఁబడుచున్నయది.

"యో వేద నిహితం గుహాయాం" "ప్రాచీన యోగ్యోపాస్వ" అనుచో "వేద" గుర్తెరుగుము! "ఉపాస్వ" ఉపాసించుము! ఇట్లు జ్ఞానము ఉపాసనము ఏకార్థకములుగా నుపదేశింపఁబడుచున్నవి.

"సర్వాన్ కామాన్" ఇత్యాది వాక్యములందు - ఉపాసకులకు బ్రహ్మముతోగూడ సకల కామావాప్తి యేర్పడునని విశదమగుచున్నది.

కావున నిష్కామము నిజవర్ణాశ్రమోచితంబు నగు ధర్మము నాచరించుచు పాశుపతవ్రతము ననుష్ఠించువాడును నిషిద్ధకామ్యకర్మరహితుండును శ్రుతిస్మృతిచోదితంబగు కర్మానుష్ఠానమువలన చిత్తశుద్ధిగలవాడును శమదమాదిసంపన్నంబగు పరమ శివభక్తి గలవాడు నగు ముముక్షువే శ్రేష్ఠ శ్రుతులవలన పరబ్రహ్మము శివాభిధేయంబని తెలుసుకొని పరమేశ్వరు నుపాసించవలెనని జ్ఞానాత్మకంబగు బ్రహ్మోపాసన విధింపఁబడుట యుపపన్నంబగుచున్నయది.

శబ్దజ్ఞానము కలిగిన పిమ్మట నత్యంతచిత్తైకాగ్రతతో సాధింపఁదగు ఉపాసనాత్మకంబైన జ్ఞానంబే మోక్షార్థము ఉపయోగించునట్టిది; శబ్ద జ్ఞానమువలననే బంధవిముక్తి కలుగునది కాదు. ధ్యానము, ఉపాసన మున్నగు పదములతో చెప్పఁబడు నిరంతర స్మరణాధిక్యము జ్ఞాన మనఁబడుచున్నది. ఇట్లు చెప్పుటచే "అహం బ్రహ్మాస్మి" అను మహావాక్యమును వినుటతోడనే కృతార్థతను భావించువారు తమ సిద్ధాంత మసంగతమని బోధింపఁబడుచున్నవారు.

ఉపాసనాత్మకజ్ఞానంబును సాక్షాత్ మోక్షసాధనముగాక బ్రహ్మ సాక్షాత్కారముద్వారా జన్మరాహిత్యముఁ గలుగజేయునది.

హృదయాకాశమనగా :

పరమేశ్వరుఁడు హృదయమందుండు ప్రాణలింగస్వరూపమగును. "లింగే సుషుప్తిః" అని హంసోపనిషదము - హృదయాకాశ మధ్యవర్తి యగు శివునకు లింగరూపముండునని చెప్పుచున్నయది. మరియు "తదేకోగ్రజ్వలనం" "హార్దానుగృహీతః శతాధికయా" ఇత్యాది సూత్రము

లందు హృదయగుహావర్తియగు ప్రాణలింగము నుపాసించువారికే శివాను గ్రహామువలన బ్రహ్మనాడీద్వారా శరీరమునుండి వెడలుటను సూత్ర కారుడు నిర్ధారించియున్నవాడు.

బ్రహ్మస్వరూపమును బ్రహ్మోపాసనను తత్ఫలవిశేషంబును నిరూపించుటకై "బ్రహ్మవిదాప్నోతి పరం"అని ప్రారంభించి ఆ బ్రహ్మయెట్టిది? బ్రహ్మజ్ఞాన మెట్లు కలుగును? ఫలమెద్ది? అను మూడు ప్రశ్నలకు సమాధానముగా "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" "యో వేద నిహితం గుహాయాం పరమే వ్యోమన్" "సోఽశ్నుతే సర్వాన్ కామాం త్సహ బ్రహ్మణా విపశ్చితా" అని యుదాహరించియున్నవారు.

ఈ భాష్యమునందు- ప్రథమాధ్యాయమున బ్రహ్మస్వరూపము; ద్వితీయాధ్యాయములో ప్రాణలింగస్వరూపంబగు పరమాత్మ నుపాసించు విధానము; తృతీయాధ్యాయమందు నిరతిశయానందరూపంబగు ఫలము; చతుర్థాధ్యాయమున శివసమరూపప్రాప్తిద్వారా శివసాయుజ్యముచేకూరుటయు చెప్పఁబడినవి.

శ్రుతివాక్యమునందు "బ్రహ్మణా సహ" అని యుండుటచే బ్రహ్మముతోకూడి వేరుగా నుండుటయే ముక్తిస్వరూపమని తెలియఁబడుచున్నది.

న్యాయరక్షామణి మొదలగు గ్రంథములందు చెప్పఁబడిన ముక్తి యసంగతమని పై శ్రుతివాక్యమువలన గ్రహింపనగును.

"వేదాంతవాక్యములు ఉపాసనను విధింపకుండునెడ వేదాంతములు బ్రహ్మను ప్రతిపాదించుట నిరుపయోగమగును. కావున బ్రహ్మపర వాక్యములు బ్రహ్మప్రాప్త్యుపాయంబగు నుపాసనను విధింపనిది మోక్షమనఁబడు మహాపురుషార్థమును కలుగఁజేయఁజాల కున్నవి" ఇట్లు తాత్పర్యలింగమగు ఉపపత్తియు ఉపాసనావిధికిని కలదని విశదమైనది.

"చీర్ణశిరోవ్రతః" అనుచో శిరోవ్రతమనగా - పాశుపతవ్రతంబగును. శిరోవ్రతము నాచరించినవారికే బ్రహ్మవిద్య నుపదేశించవలెనని శ్రుతులును సూతసంహితాది పురాణవచనంబులును బాగుగా చెప్పుచున్నవి.

మొదట బ్రహ్మము నుపాసించుటకు సాధారణజ్ఞానము కలిగిన తరువాత శ్రవణ మననములు సహజముగా నేర్పడునవగుటచేత నవ్వానికి విధి యనవసరమగుచున్నది.

ఇట శివోపపదము - త్రినేత్రంబగు పరమాత్మ యతిశ్రేష్ఠమగు విశుద్ధికి శుభగుణములకు నాధారంబగుటఁ జేసి ముముక్షువుల యుపాసనకు ముఖ్యవిషయంబగునని స్ఫురింపఁ జేయునది.

"శివఏకో ధ్యేయః శివంకరః సర్వమన్యత్పరిత్యజ్య"

"శివు డొకడే ధ్యానింపఁదగినవాడు. ఐహికాముష్మిక శుభఫలములను పరమపురుషార్థమైన మోక్షమును కలుగఁజేయువాడు గావున శివేతరదేవతలను అచేతనములనున్ను ధ్యానింపఁగూడదు" అని యధర్వశిఖోపనిషదము - శివునకే ధర్మార్థకామమోక్షార్థము ఉపాస్యత్వంబని వివరించినది.

అట్లు కానిచో సంసారపాశమునుండి విడిబడుట యెట్లు సంభవించును ? శివత్వమనగా- సమస్తదోషకళంకములు పూర్తిగాలేనట్టి సర్వోత్కృష్టమగు మంగళమున కాస్పద మగునట్టి స్వరూపంబగును. ఇట్టి శివజ్ఞానమువలన మోక్షఫలము చేకూరునది.

"యదా చర్మవదాకాశం వేష్టయిష్యంతి మానవాః
తదా శివ మవిజ్ఞాయ దుఃఖస్యాంతో భవిష్యతి."

"మానవులు మానవపదోపలక్షితులగు దేవతలును ఆకాశమును చర్మమువలె చుట్టగలిగినచో శివు నుపాసింపకయే దుఃఖవినాశము (మోక్షము)ను పొందగలుగుదురు."

ఆకాశమును చర్మమువలె పరివేష్టించుట కూడనట్లు శివుని విడిచి యన్యులను ధ్యానించుటవలన జన్మరాహిత్య మసంభవమని తెలియునది. మరియు "శివ ఏకో ధ్యేయః" అను శ్రుతియు మోక్షముఁ గోరువారు శివేతరదేవతల నుపాసించుటను నిషేధించునది. గావున శివాఖ్యమగు పరబ్రహ్మమును మోక్షకాములు ధ్యానించి కనుగొనవలెను.

ఇట్లు తాత్పర్యలింగ సమన్వయముతో వేదాంతములు బ్రహ్మ ప్రతిపాదకములై బ్రహోపాసనవిధాయకములగుటయు సమంజసమగు చున్నయది.

"భాష్యవిదులైన మహానుభావులు భాష్యార్థమును సరసముగా కనుగొనఁజాలుదురు. మరియు తమ యభీష్టపదములను వర్ణించుచు భాష్యమునకు సారస్యముఁ జేకూర్చుదురు" అను న్యాయము ననుసరించి శ్రీవారు స్వాభీష్టశివపదమును వివరించినవారు.

పరమవిశుద్ధియనగా :

సంసారమాలిన్యమును తొలగించుట యగును.

మంగళభాజనత్వమనగా :

సత్యసంకల్పత్వాది మంగళగుణములు కలిగియుండుట యగును. ఈ రెండును ముముక్షువునకు కావలసినవగుటచే శివశబ్దమందు నీ రెండర్థము లుండుటచేతను ముముక్షుధ్యేయత్వము శివునకే చెల్లుచున్నది.

ఇట్లు చెప్పుటవలన పరబ్రహ్మము నామరూపరహితమైనదని నిరూపించునవి శివేతరదేవతాపరములు నగు భాష్యములు సర్వప్రమాణ సంబద్ధములు కావని గ్రహింపనగును. కావున "జిజ్ఞాసువులగు ముముక్షువు లందరును శాంభవదీక్షితులై శివునినే పూజింపవలెను ధ్యానింపవలెను సాక్షాత్కరించుకొనవలెను" అని విశదమగుచున్నయది.

బ్రహ్మమీమాంసాశాస్త్రము నారంభించుటను సాధించు ఈ చతుః సూత్రి - శుద్ధాద్వైతుల కుపపన్నంబగునది కాదు. ఎందుకనగా ? వారి పక్షమున విషయము ప్రయోజనంబు పొసగనట్టివి.

విషయ మనగా - సామాన్యముగా తెలియునది విశేషముగా తెలియనిది గదా ; పూర్తిగా తెలియకున్నను, తెలిసినను జిజ్ఞాస (తెలుసు కొనఁ గోరిక) యుండజాలదు. బ్రహ్మము నిర్విశేష (నిర్గుణ) మగుటచే సామాన్యముగా తెలియునది కాదు మరియు విశేషముగా తెలియు

నదియు కాదు గావున పరబ్రహ్మమును గూర్చి తెలుసుకొనవలెనను తలంపు పొసగనిదగుచున్నది.

మరియు వారి పక్షమున - ఉత్తర మీమాంసయందు విషయమెద్ది? బ్రహ్మమా? భేదమిథ్యయా? జీవబ్రహ్మైక్యమా? బ్రహ్మము వేద్యము గాకుండుటచే విషయము కాజాలదు. వేద్య మనునెడ ఘటాదులు అనుభవ దూరము లగునట్లు కావలసివచ్చును. బ్రహ్మము వేద్య మగుట వ్యావహారికం బగుచో ఘటవేద్యత్వము నట్టిదే యగు గాన బ్రహ్మము విషయం బనుట కూడదు. ఇఁక భేదమిథ్యాత్వము - దృశ్యత్వాదులతో భేదమును పాటించి, యట్టి భేదమునకు మిథ్యాత్వమును భావించుటచే శాస్త్రము సార్థక మగుటలేదు.

తత్తద్వస్తువుల ధర్మములను నిజముగా తెలుపు ప్రత్యక్షాది ప్రమాణములకు ప్రపంచ మిథ్యాత్వము విరుద్ధ మగుటచే భేద మిథ్యాత్వము శాస్త్రప్రతిపాద్య మగుటను విషయము కాకుండును.

జీవబ్రహ్మైక్యము విషయ మనునెడ బ్రహ్మము వేద్యము కావలసి వచ్చును. బ్రహ్మశబ్దముతో బ్రహ్మమును తెలుసుకొనునెడ బ్రహ్మమునకును జీవునకును ఏకత్వమును చెప్పుటకు శక్యముకాదు. జీవాత్మ యొకడే యని చెప్పినంతమాత్రమున జీవబ్రహ్మైక్యము సిద్ధింపదు గదా; ఘట మొకటి యనినంతన ఘటపటైకత్వము ఏర్పడునా? "అయమాత్మా బ్రహ్మ" ఇత్యాది వాక్యములందు శబ్దమువలన జీవబ్రహ్మైక్యజ్ఞానము అంగీకరింపఁ బడినను బ్రహ్మమే ప్రధానముగా శాస్త్రప్రతిపాద్యంబని నిర్ధారింపవలసి వచ్చును.

ఇఁక ప్రయోజనంబు నద్వైతమున పొసగదు. అవాంతర ప్రయోజన మనియు, పరమ ప్రయోజనమనియు ప్రయోజనము ద్వివిధము; ఈ రెంటిలో ప్రస్తుతంబగు వాక్యజన్యజ్ఞానము, అజ్ఞాన నివర్తకము కాదను నంశము సర్వసమ్మతమే గదా!

అద్వైతమతములో వసిష్ఠ పరాశర వేదవ్యాసాదులకు కలుగని జ్ఞానము తదితరులకు కలుగునని భావించుట మిక్కిలి యసంగత మగునది;

ఒకవేళ వారికి జ్ఞానము కలిగినదనునెడ భేదము భాసింపకుండెడిది. అట్టి ప్రతిభాస తొలగుననిచెప్పునెడ వారితో నేకీభవించు (ఇతర) జీవులందరికిని తొలగవలసివచ్చును గాన నివ్విధముగను శాస్త్రారంభమునకు వీలు చిక్కుటలేదు. పరమప్రయోజనంబగు జీవబ్రహ్మైక్యంబును సిద్ధింపదు. ఎందుకనగా ? జీవేశ్వర భేదము శాస్త్రసమ్మతమై మిథ్య గాకుండుటచేత నెప్పటికి నభేదమును సాధింపరాదు.

ఇందు మొదటి సూత్రము అద్వైతులకు సంగతము కాకుండును. వారు జీవబ్రహ్మైక్యము శాస్త్రవిషయమని యంగీకరించుటచే బ్రహ్మ జిజ్ఞాసాపదము సార్థక మగుటలేదు. బ్రహ్మశబ్దమువలన బ్రహ్మము జిజ్ఞాస్యం బగునుగాని జీవబ్రహ్మైక్యము జిజ్ఞాస్యము కాజాలదు.

ధర్మజిజ్ఞాసా పదము – ధర్మము విచారణీయమనియు ధర్మాధర్మ ముల యేకీభావము కాదనియు తెలుపునట్లు బ్రహ్మజిజ్ఞాసా పదము బ్రహ్మము మాత్రము విచారణీయంబని విశదపఱచుచున్నయది.

రెండవ సూత్రంబు నసంగతము. “జగత్కారణత్వ” మను లక్షణ విశేషము బ్రహ్మము నిర్విశేష మనుటను సహింపదు. మరియు సర్వజ్ఞ త్వాది గుణములు ప్రసక్తములు లగుచున్నవి. బ్రహ్మము వస్తుమాత్రమని చెప్పునెడ నొకానొక పాషాణముఁగూర్చి అజ్ఞత్వాదులును లక్షణము లగుచున్నవి గావున బ్రహ్మమునకు జగత్కారణత్వ లక్షణమును ప్రతిపా దించు ద్వితీయ సూత్రంబు ఉపపన్నమగుటలేదు.

మూడవ సూత్రంబు నఘటితము. నిర్విశేష బ్రహ్మము తాత్పర్య విషయ మగుచుండగా శాస్త్రకారణత్వముతో నేర్పడు సర్వజ్ఞత్వాది గుణములను సమర్థించుట యెట్లు పొసగును? సర్వజ్ఞత్వాదులను సమర్థించు నెడ బ్రహ్మము సగుణంబగును. ఈ సూత్రము బ్రహ్మమునకు సర్వజ్ఞత్వ మును సమర్థించుటకే బ్రహ్మము వేదాదిశాస్త్రయోని యని విశదపఱచు నది. సర్వజ్ఞత్వ సమర్థనము నిర్విశేషత్వ విరుద్ధమగుటచే న్యాయ్యంబును కాదు.

ఇట్లు నాలుగవ సూత్రంబు ప్రతికూల మగుచున్నయది.

ఎందుకనగా ? వేదాంతవాక్యములు భ్రాంతిఁబోగొట్టు వాక్యార్థ జ్ఞానమును కలిగించునవిగా సప్రయోజనము లగుచున్నవని యద్వైతులు చెప్పుచున్నందున వాక్యార్థజ్ఞానమువలననే సంసారబంధము తొలగుట శాస్త్రవిరుద్ధంబు ప్రత్యక్షవిరుద్ధంబు నగుటచే నంగీకార్యము కాజాలదు.

ఇఁకను శివేతరదేవతలఁ బ్రతిపాదించు భాష్యము లన్నియు శ్రుతి సూత్రవిరుద్ధములగునవి. మరియు శ్రీకరభాష్యంబు సమంజసము గానట్టిది. అందలి భేదాభేద సిద్ధాంతము పరస్పరవిరోధముగల యట్టిది. బ్రహ్మము సగుణంబు నిర్గుణంబు, జీవుఁడు ఖద్యోతమువలె ప్రకాశరూపుఁడు అప్రకాశరూపుఁడును, ఇట్లు పరస్పరవిరోధముగల ప్రతిపాదనలవలనను అనేకకర్తల నిరూపణవలనను ప్రాచీనముగాకుండుటను గ్రాహ్యంబగుట లేదు.

ఇందువలన శ్రీకర శ్రీభాష్యాదులు ఉపాదేయములు కావనియు నిర్గుణ బ్రహ్మవాదముగాని విష్ణుపారమ్యముగాని జగద్బ్రహ్మాద్వైత వాదముగాని శూన్యవాదముగాని సంగతములు కావని విశదమగుచున్న యది.

ఇయ్యది, శ్రీ నీలకంఠ భగవత్పాదకృత శారీరక బ్రహ్మ మీమాంసా సూత్ర భాష్యములో ప్రథమాధ్యాయ ప్రథమపాద చతుర్థసూత్రాంధ్రీకరణము.